


# విశ్వ వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY




SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 8 | సంచిక : 348 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | గురువారం 4 సెప్టెంబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-



## సామాన్యులకు ఊరటనిస్తూనే
# ఆర్థిక రంగం బలోపేతం

**జీఎస్టీ సంస్కరణలపై ప్రధాని మోదీ స్పందన**

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

భారీ సంస్కరణలకు జీఎస్టీ మండలి ఆమోదం తెలపడంపై ప్రధాని మోదీ స్పందించారు. తాజా సంస్కరణలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయన్నారు. వ్యాపారం మరింత సరళతరమవుతుందని, చిరు వ్యాపారులకు మరింత ప్రయోజనం చేకూరుతుందన్నారు. సామాన్య ప్రజలకు ఊరటనిస్తూనే ఆర్థిక రంగాన్ని బలోపేతం చేసేలా కేంద్ర ప్రభుత్వం సంస్కరణలకు శ్రీకారం చుట్టిందంటూ ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సామాన్యులు, మధ్యతరగతి వారు, రైతులు, మహిళలు, యువత, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల వారికి ప్రయోజనం కలిగేలా - మిగతా5లో

## రైతుల ముసుగులో రాజకీయం చేస్తే
# ఖబడ్దార్



- హెచ్చరించిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రంలో 95,000 టన్నుల యూరియా ఉంది
- నెలాఖరులోపు 2.71 లక్షల టన్నులు వస్తోంది
- తప్పుడు పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలే
- తర్వాత వైకాపా వాళ్లు వచ్చి కాపాడలేరు
- వైకాపా రాజకీయాల్లో రైతులు భాగస్వాములు కావద్దని సూచన

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

'రైతుల ముసుగులో వైకాపా కార్యకర్తలు వచ్చి రాజకీయం చేయాలనుకుంటే ఖబడ్దార్.. నేరాలు, ఘోరాలు చేసి.. వాటిని ఇతరులపై వేసి తప్పించుకోవాలని చూస్తున్నారు. మనుషులా? పశువులా? తప్పుడు వార్తలు రాస్తే ఖబడ్దార్..' అని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. రాష్ట్రంలో రైతుల అవసరాలకు సరిపడా యూరియా అందుబాటులో ఉన్నా.. తప్పుడు ప్రచారంతో వారిని రెచ్చగొట్టడమే లక్ష్యంగా వైకాపా నేతలు పనిచేస్తున్నారని దుయ్యబట్టారు. సచివాలయంలో బుధవారం.. కలెక్టర్లతో వీడియో సమావేశం ద్వారా ఎరువుల సరఫరాపై ఆయన సమీక్షించారు. అనంతరం విలేకరుల సమావేశంలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఎరువుల పంపిణీ, నిల్వల వివరాలను వెల్లడించారు. 'వైకాపా చేసే రాజకీయాల్లో రైతులు భాగస్వాములు కావద్దు. ఎరువు లేదని ఎవరైనా చెబితే నేనే అక్కడికి వెళ్లి చూస్తా.. తప్పు ఉంటే చర్యలు తీసుకుంటాం' అని వివరించారు. 'దుష్ప్రచారంతో రైతుల్ని - మిగతా2లో




## యూరియా 'కట్ట'డి పై
# ముట్టడి!

**రాష్ట్రవ్యాప్తంగా రోడ్డెక్కిన రైతులు**

**కృష్ణా జిల్లాలో యూరియా లారీపై అర్ధరాత్రి మెరుపు దాడి**

- సరుకు తమకు పంపిణీ చేయాలంటూ రోడ్డుపై బైఠాయింపు
- రాష్ట్రంలో ఎక్కడికక్కడ విజిలెన్స్ అధికారుల అవతారమెత్తి అడ్డుకుంటున్న రైతులు
- పక్కదారి పడుతుంటే అడ్డుకోవాల్సింది పోయి తిరిగి రైతులపైనే సర్కారు నిందలు
- ఇచ్చేది కేవలం అరకట్ట.. కాంప్లెక్స్ ఎరువులూ కొనాలంటూ మెలిక
- అవసరం మేరకు సమకూర్చామంటూ బుకాయింపు
- అదే నిజమైతే రైతన్నలు ఎందుకు రోడ్లెక్కుతున్నట్లు?
- 'కట్ట' కోసం అష్టకష్టాలు.. ఘంటశాల, గుడివాడలో కిలోమీటర్ల కొద్దీ బారులు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

యూరియా కట్ట కోసం రైతన్నలు పడుతున్న కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. రాష్ట్రంలో ఏ మూలకు వెళ్లినా రైతు సేవా కేంద్రాల్లో 'నో స్టాక్' బోర్డులే దర్శనమిస్తున్నాయి. వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాల (పీఏసీఎస్) వద్ద రైతులు బారులు తీరి కనిపిస్తున్నారు. సీజన్‌లో పొలం పనులు మానుకుని రోజంతా తిండి తిప్పలు లేకుండా సొసైటీల ఎదుట పడిగాపులు కాస్తున్నా 'కట్ట' దొరకడం కష్టంగా మారింది. యూరియాతో సహా ఎరువులన్నీ డిమాండ్‌కు మించే ఉన్నాయంటూ ప్రభుత్వం చేస్తున్న ప్రచారానికి క్షేత్రస్థాయిలో పరిస్థితికి ఏమాత్రం పొంతన లేకుండా ఉంది. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, శ్రీకాకుళం, విజయనగరం తో పాటు రాయలసీమ జిల్లాల్లో యూరియా కొరత తీవ్ర స్థాయికి చేరుకుంది. మరోవైపు పక్కదారి పడుతున్న యూరియాను అడ్డుకోవాల్సిన కూటమి సర్కారు చేతులెత్తేసింది. మొక్కుబడి తనిఖీలతో మమ అనిపిస్తోంది. సొసైటీల ద్వారా సరఫరా - మిగతా2లో




## ఇక బ్రెడ్డు, బన్ను, చపాతీ, పరోటా చౌక

- వీటిపై ఉన్న 5%-%18 శాతం పన్ను ఎత్తివేత ఆరోగ్య, జీవిత బీమాపై పన్ను సున్నా
- గణనీయంగా తగ్గనున్న వాహన ధరలు
- ఎలక్ట్రిక్ వాహనాలపై 5శాతం పన్ను.. టూత్‌పేస్ట్, షాంపూలు, సబ్బులు, హెయిర్ ఆయిల్‌పై 5 శాతం
- సిగరెట్లు, గుట్కాలు, కూల్‌డ్రింక్స్ విలాస వస్తువులపై 40 శాతం
- రెండు శ్లాబుల విధానానికి ఏకగ్రీవ ఆమోదం
- ఈ నెల 22 నుంచి అమల్లోకి జీఎస్టీ కౌన్సిల్ కీలక నిర్ణయాలు


5

## రెండు వారాల్లోగా
# 18 కోట్లు కట్టండి



- జేపీ వెంచర్స్‌కు సుప్రీంకోర్టు షాక్
- 'ప్రతిమ', జీసీకేసీని ప్రతివాదులుగా చేర్చాలని ఆదేశం
- వైసీపీ హయాం ఇసుక అక్రమ తవ్వకాల కేసును విచారించిన బెంచ్
- అక్రమ తవ్వకాల విస్తీర్ణంలో ఇంత తేడానా?
- ప్రభుత్వం, పిటిషనర్ సమర్పించిన లెక్కలతీరుపై విస్మయం.. అఫిడవిట్ వేయాలని నిర్దేశం

# స్థానిక సంస్థలకు చేయూత



- ఆదాయార్జన ఆధారంగా పంచాయతీల విభజన
- తక్కువ ఆదాయం ఉన్నవాటికి ప్రభుత్వ సాయం
- ఆర్థిక వనరులు పెంచేలా ప్రత్యేక కార్యాచరణ
- రాష్ట్ర ఆర్థిక సంఘం భేటీలో సీఎం చంద్రబాబు సూచన
- పంచాయతీ రికార్డులు ఆన్‌లైన్ చేయండి: డిప్యూటీ సీఎం
- ఆదాయ వ్యయాల మధ్య భారీ వ్యత్యాసం: రాష్ట్ర ఆర్థిక సంఘం

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

సొంత ఆదాయ వనరులు పెంచుకుని వేగంగా అభివృద్ధి సాధించడంపై స్థానిక సంస్థలు దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. బుధవారం సచివాలయంలో 5వ రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యులు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో సమావేశమయ్యారు. స్థానిక సంస్థల బలోపేతంపై ఆర్థిక సంఘం సిఫారసులను ప్రభుత్వానికి అందజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితి ఆధారంగా స్థానిక సంస్థలను కేటగిరీలుగా విభజించాలని, దీనివల్ల తక్కువ ఆదాయం ఉన్నవాటికి ప్రత్యేక సాయం అందించే అవకాశం ఉంటుందన్నారు. పంచాయతీలకు ఏటా వివిధ రూపాల్లో సమకూరుతున్న నిధుల మొత్తాన్ని క్రోడీకరించాలన్నారు. ఈ ప్రక్రియను త్వరగా పూర్తిచేస్తే వాటికి ఏవిధంగా సాయం అందించాలి?, స్థానిక సంస్థల్ని ఏవిధంగా బలోపేతం చేయాలి అనే - మిగతా2లో



## భారత్‌కు ట్రంప్ మరోసారి భారీ షాక్!

- వాణిజ్య పరంగా భారత్‌పై మరింత ఒత్తిడి తెచ్చేలా ట్రంప్ ప్రయత్నాలు
- ఇప్పటికే రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై ఉత్పత్తుల విభాగంలో 50శాతం టారిఫ్
- విదేశీ సేవలపై కూడా వస్తువుల్లాగే టారిఫ్ విధించాలి అనే ఆలోచనలో ట్రంప్ ప్రభుత్వం

5

# ఏషియన్ మస్క్యూలో స్కెలిటల్ సొసైటీ అధ్యక్షుడిగా ప్రముఖ రేడియాలజిస్టు డాక్టర్ వి.ఎన్.వరప్రసాద్

- ఇటీవల సింగపూర్‌లో జరిగిన 27వ వార్షిక సమావేశంలో బాధ్యతలు స్వీకరణ
- అభినందించిన వర ప్రసాద్ మిత్రులు, శ్రేయోభిలాషులు





విజయవాడ

ఏషియన్ మస్క్యూలో స్కెలిటల్ సొసైటీ అధ్యక్షునిగా ప్రముఖ రేడియాలజిస్టు డాక్టర్ వి.ఎన్. వరప్రసాద్ పదవీ బాధ్యతలు స్వీకరించడం శుభపరిణామం అని పలువురు వక్తలు ప్రశంసించారు. డాక్టర్ వేమూరి నాగ వరప్రసాద్ ఏషియన్ మస్క్యూలో స్కెలిటల్ సొసైటీ నూతన అధ్యక్షునిగా నియామకం కావడం, బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఇండియన్ రేడియాలజి అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జి.వి.మోహన్ ప్రసాద్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ రోడ్డులోని హోటల్ మినర్వాలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ వర ప్రసాద్‌ను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.వి.మోహన్ ప్రసాద్ మాట్లాడుతూ, డాక్టర్ వేమూరి నాగ వరప్రసాద్ గతంలో ఇండియన్ కాలేజ్ ఆఫ్ రేడియాలజీ అండ్ ఇమేజింగ్ (ఐసీఆర్ఐ) అధ్యక్షునిగా మరియు ఇండియన్ రేడియాలజీ అండ్ ఇమేజింగ్ అధ్యక్షులుగా కూడా పదవీ బాధ్యతలు నిర్వహించినట్లు తెలిపారు. అదేవిధంగా ఏషియన్ మస్క్యూలో స్కెలిటల్ సొసైటీ అధ్యక్షునిగా పదవీ బాధ్యతలు స్వీకరించక ముందు ఈ సంఘానికి సెక్రటరీ జనరల్‌గాను మరియు ప్రెసిడెంట్ ఎలక్ట్‌గా కూడా వ్యవహరించినట్లు పేర్కొన్నారు. ఈ పదవి నిర్వహిస్తున్న మొట్టమొదటి భారతీయ రేడియాలజిస్టుగా డాక్టర్ వి.ఎన్.వరప్రసాద్ ఎంపిక కావడం దేశానికి గర్వకారణమన్నారు. డాక్టర్ వి.ఎన్.వరప్రసాద్ మాట్లాడుతూ, వివిధ దేశాలలో గల సొసైటీలు మరియు రేడియాలజీలోని మస్క్యూలో స్కెలిటల్ విభాగంలో ఉన్న పద్ధతుల మధ్యలో అంతరాలను సరిచేస్తూ వాటిని అనుసంధానం చేయడం అనే నినాదంతో సింగపూర్‌లో నిర్వహించిన 27వ వార్షిక సమావేశంలో ఎన్నికైన తాను, వచ్చే రెండేళ్ళలో ఈ థీమ్ లక్ష్యాన్ని నెరవేరుస్తానని తెలిపారు. వివిధ వ్యాధి నిర్ధారణ పద్ధతుల మధ్యన ఉన్న హద్దులను తొలగిస్తూ ఒక నిర్ణయానికి రావడం దీనిపై ప్రపంచ స్థాయిలో అవగాహన పెంపొందించేందుకు ఆసియా ఖండంలోని వివిధ దేశాల మస్క్యూలో స్కెలిటల్ రేడియాలజీ సంఘాల మధ్య అనుసంధాన కర్తగా వ్యవహరించేందుకు తాను నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. శరీరంలోని కీళ్లు, కండరాలు, ఎముకలతో కూడిన ఈ మస్క్యూలో స్కెలిటల్ విభాగం వ్యాధి నిర్ధారణలో ఆధునిక పద్ధతులైన ఆర్టిషిఫీయల్ ఇంటిలిజెన్స్ (కృత్రిమ మేధ)తో నూతనంగా రూపొందించిన సిటీస్కాన్, ఎమ్మారై, అల్ట్రాసౌండ్ వంటి పరికరాలు మస్క్యూలో స్కెలిటల్ రేడియాలజీ వైద్యంలో కీలక పాత్ర వహిస్తాయని తెలిపారు. ఈ విధానాలపై సమావేశంలో వివిధ దేశాలు నుండి హాజరైన నిష్ణాతులు చర్చించారని పేర్కొన్నారు. సింగపూర్‌లో జరిగిన 27వ వార్షిక సమావేశంలో తాను ఏషియన్ మస్క్యూలో స్కెలిటల్ సొసైటీ అధ్యక్షునిగా పదవీ బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. పదవీకాలం రెండు సంవత్సరాలు పాటు ఉంటుందని, 2027 ఆగష్టు నెల వరకు తాను ఈ పదవిలో కొనసాగుతానని పేర్కొన్నారు. సమావేశంలో ఐఆర్ఐఏ , సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ చలసాని కులదీప్, ఐఆర్ఐ ఏ విజయవాడ చాప్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ బి. రాజ్ కుమార్ పాల్గొన్నారు.

# యూరియా 'కట్ట'డిపై ముట్టడి!

-మొదటిపేజీ తరువాయి




చేయకుండా పక్కదారి పట్టిస్తున్న టీడీపీ నేతల ఆగడాలకు రైతన్నలే చెక్ పెడుతున్నారు. ఎక్కడికక్కడ రైతన్నలే విజిలెన్స్ అధికారుల అవతారమెత్తి అడ్డుకుంటున్నారు. చరిత్రలోఎన్నడూ లేనివిధంగా డిమాండ్ మేరకు యూరియా సరఫరా కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా రైతన్నలు నిరసన బాట పట్టారు. కృష్ణా జిల్లాలో యూరియా కోసం నిరసనలు భగ్గుమంటున్నాయి.

**దారి మళ్లుతున్న యూరియా..**

ప్రభుత్వం చెబుతున్న లెక్కల ప్రకారం ఈ సీజన్‌లో 6.22 లక్షల టన్నుల యూరియా అవసరం. ఈ ఏడాది 5.70 లక్షల టన్నుల అమ్మకాలు జరిగాయని చెబుతోంది. అదే నిజమైతే మరి రైతన్నలు ఎందుకు రోడ్డెక్కాల్సి వస్తోందన్న ప్రశ్నకు సర్కారు వద్ద సమాధానం కరువైంది. రైతులకు అందాల్సిన యూరియా పెద్ద ఎత్తున పక్కదారి పడుతున్నట్లు స్పష్టమవుతోంది. పలు జిల్లాల్లో టీడీపీ నేతలే యూరియాను పక్కుదారి పట్టిస్తున్నట్లు వార్తలు వస్తున్నా వారిని కాపాడే యత్నం చేస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

**గుడివాడలో గంటల కొద్దీ పడిగాపులు..**

కృష్ణా జిల్లా గుడివాడ మండలంలో యూరియా సరఫరా చేస్తామని అధికారులు ప్రకటించడంతో పీఏసీఎస్‌ల వద్ద పెద్ద సంఖ్యలో రైతులు బారులు తీరారు. విన్నకోట, నందివాడ, రామనపూడి పీఏసీఎస్ వద్ద గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడితే అరకొరగా మాత్రమే యూరియా అందజేశారని రైతులు మండిపడ్డారు. అధికార పార్టీ నేతల సిఫార్సులు ఉన్న వారికి మాత్రమే ఎరువులు దక్కుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఘంటశాలలో గందరగోళం**

కృష్ణా జిల్లా ఘంటశాల మండలంలో యూరియా కోసం రైతులు నానా తిప్పలు పడుతున్నారు. మండలంలోని లంకపల్లి పీఏసీఎస్‌కు 445 యూరియా కట్టలు రాగా ఘంటశాల గ్రోమోర్‌కు 555 యూరియా కట్టలు వచ్చాయి. లంకపల్లి పీఏసీఎస్ వద్దకు రైతులు భారీగా చేరుకోగా అధికారులు గేట్లు మూసి వేయడంతో ఎండలో బారులు తీరారు. రైతులను అదుపు చేయలేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒక్కో రైతుకు ఎకరాకు అరకట్టకు మించి ఇవ్వలేదు. రైతుల ఆధార్, పాస్ బుక్ జిరాక్సులు తీసుకుని స్లిప్‌లు పంపిణీ చేశారు. పలుకుబడి ఉన్న వారికే యూరియా ఇస్తున్నారని క్యూలో నిలబడ్డ వారు ఆందోళనకు దిగడంతో గందరగోళం నెలకొంది.

పోలీసులు, అధికారులతో రైతులు వాగ్వాదానికి దిగారు. గ్రోమోర్, లంకపల్లి పీఏసీఎస్‌ల వద్ద రైతులు కనీసం సేదతీరడానికి కూడా అవకాశం లేకపోముడంతో అవస్థలు పడ్డారు. ఘంటశాలలో అరుగులపై తమ వంతు వచ్చే వరకు కూలబడిపోయారు. యూరియా దొరకని రైతులు ప్రభుత్వ అసమర్థతను తిట్టుకుంటూ వెనుతిరగాల్సిన పరిస్థితి నెలకొంది.

**చిత్తూరులో రైతుల నిరసన**

టోకెన్లు ఉన్నా యూరియా పంపిణీ చేయడం లేదని చిత్తూరు జిల్లా సదుం మండలంలో రైతులు నిరసన తెలిపారు. మూడు రోజులుగా దుకాణం వద్దకు టోకెన్లతో వచ్చినా యూరియా ఇవ్వడం లేదని మండిపడ్డారు. స్టాకు లేదంటూ దుకాణం మూసి వేశారని, నాయకులు ఫోన్ చేస్తే పదుల సంఖ్యలో బస్తాలను తరలిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**రేపల్లె యార్డులో ఆందోళన**

యూరియా కోసం రేపల్లె వ్యవసాయ మార్కెట్ యార్డు గోడౌన్ వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. రెండు రోజులుగా మార్కెట్ యార్డు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా యూరియా అందించే నాథుడు లేడని వాపోయారు. స్టాక్ ఉందో లేదో తెలియని పరిస్థితి నెలకొందని, గంటల కొద్దీ గోడౌన్‌ల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**తూర్పు గోదావరిలో తిరుగుముఖం..**

తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలంలోని గజ్జరం, అన్నదేవరపేట సొసైటీల వద్ద బుధవారం యూరియా విక్రయాల వద్ద గందరగోళం నెలకొంది. ఈ సొసైటీలకు 1,600 బస్తాల యూరియా వచ్చింది. 500 మంది రైతులకు యూరియా అందజేశారు. మరో 50 మంది రైతులకు అందకపోవడంతో వెనుదిరిగారు. తాళ్లపూడి, వీరభద్రపురం, కుకునూరు, పైడిమెట్ట గ్రామాల రైతులకు యూరియా అందకపోవడంతో తామెక్కడికి వెళ్లాలని ప్రశ్నిస్తూ ఆందోళనకు దిగారు.

**అనకాపల్లిలో కిక్కిరిసిన కేంద్రం..**

అనకాపల్లి జిల్లా దేవరాపల్లిలో యూరియా కోసం మండుటెండలో అన్నదాతలు నరకయాతన అనుభవించారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో యూరియా పంపిణీ గురించి తెలియడంతో ఉదయం 8 గంటలకే అధిక సంఖ్యలో చేరుకున్నారు. యూరియా నిల్వల కంటే రెట్టింపు సంఖ్యలో రైతులు తరలిరావడంతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసింది. క్యూలైన్‌లో గంటల తరబడి నిరీక్షించి రైతులు నానా అవస్థలు పడ్డారు. ఒక రైతుకు ఒక బస్తా మాత్రమే ఇస్తామని, ఆధార్, 1 బీ తప్పనిసరిగా ఉండాలని వ్యవసాయశాఖ సిబ్బంది చెప్పడంతో స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది.

## ఇక అమరావతి పరుగులు

అమరావతి

అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఏపీ సర్కారు నిర్ణయించింది. ఇందుకోసం స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. సీఎం నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సీఆర్డీఏ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మొత్తం ఏడు అంశాలకు ఆమోదం తెలిపారు. అలాగే స్పెషల్ పర్పస్ వెహికల్ పరిధిలోకి బయో డిజైన్ ప్రాజెక్టును కూడా చేర్చాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దేలా ఏపీ సర్కారు అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే ఏపీ ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంగళవారం 52వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అమరావతి నిర్మాణ పనులపై ప్రధానంగా దృష్టి సారించారు. రాజధాని అమరావతిలో కీలక నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని చంద్రబాబు ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. అలాగే సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో ఏడు అంశాలకు ఆమోదం లభించింది. అమరావతిలో కీలక ప్రాజెక్టులు త్వరితగతిన కార్యరూపం దాల్చేలా స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే సీఎం నారా చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు.ఈ స్పెషల్ పర్పస్ వెహికల్ పరిధిలోకి బయో డిజైన్ ప్రాజెక్టును కూడా తీసుకురావాలని సీఆర్డీఏ అధికారులను ఆదేశించారు. అమరావతిలో హెల్త్ సిటీ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ హెల్త్ సిటీ పరిధిలోనే బయో డిజైన్ ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. ఈ బయో డిజైన్ ప్రాజెక్టు ద్వారా ప్రజారోగ్య సేవలు అందిస్తారు. ఈ ప్రాజెక్టులో భాగస్వామ్యులు అయ్యేందుకు ఏడు దేశాల నిపుణులు, సంస్థలు సిద్ధంగా ఉన్నాయని చంద్రబాబు వివరించారు. ఈ నేపథ్యంలో బయో డిజైన్ ప్రాజెక్టును కూడా స్పెషల్ పర్పస్ వెహికల్ పరిధిలోకి తేవాలని ఆదేశించారు.మరోవైపు అమరావతిలో గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, ఎన్టీఆర్ విగ్రహం, స్పోర్ట్స్ సిటీ, ఐకానిక్ బ్రిడ్జి, స్మార్ట్ ఇండస్ట్రీస్, రోప్ వే, రివర్ ఫ్రంట్, ఇన్నర్ రింగ్ రోడ్ వంటి ప్రాజెక్టులు చేపడుతున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టుల కోసం స్పెషల్ పర్పస్ వెహికల్ దోహదపడుతుంది.

## రైతుల ముసుగులో రాజకీయం చేస్తే ఖబడ్దార్

-మొదటిపేజీ తరువాయి

రెచ్చగొడుతూ రోడ్డున పడేస్తున్నారు. వీరి రాజకీయ ఉచ్చులో పడొద్దని రైతుల్ని కోరుతున్నా. త్వరలోనే రైతులతో సమావేశాలు నిర్వహించి ఎరువుల వాడకంపై అవగాహన కల్పిస్తాం. వాస్తవాలు వివరిస్తాం' అని పేర్కొన్నారు. 'వైకాపా ప్రభుత్వ హయాంలో.. రోజూ ఎక్కడో ఓచోట రైతులు ఆత్మహత్యలు చేసుకునేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతుల మీద ఒత్తిడి తగ్గింది. ఆత్మహత్యలు లేవు. అన్నివిధాలుగా సాయం అందిస్తున్నాం' అని తెలిపారు.

**10 రోజుల్లో 30 వేల టన్నులు వస్తుంది..**

ఖరీఫ్‌లో 6.65 లక్షల టన్నుల యూరియా సరఫరా చేశాం. గతేడాది కంటే 97 వేల టన్నులు ఎక్కువగా ఇచ్చాం. బుధవారం నాటికి రాష్ట్రంలో 94,892 టన్నులు అందుబాటులో ఉంది. వచ్చే 10 రోజుల్లో 30 వేల టన్నులు వస్తుంది. తాజాగా కేంద్రం 53 వేల టన్నులు కేటాయించింది. సెప్టెంబర్ నెలాఖరులోపు మొత్తం 2.71 లక్షల టన్నులు అందుబాటులోకి వస్తుంది. రబీ అవసరాలకు 9.38 లక్షల టన్నులను కేంద్రం కేటాయించింది. రైతులు ఆందోళన చెందవద్దు. ఎరువుల సరఫరాపై కలెక్టర్లు రోజూ పర్యవేక్షించాలి. పత్రికలకు వివరాలివ్వాలి. నిల్వలు లేకపోతే తెప్పించి అందుబాటులో ఉంచాలి. యూరియా మళ్లిస్తే 6ఏ, క్రిమినల్ కేసులూ నమోదు చేస్తున్నాం. ఇప్పటికి రూ.3 కోట్ల విలువైన 1,284 టన్నులు సీజ్ చేశాం. బోరర్ తెగులొచ్చిన కాఫీ పంటను తొలగిస్తున్నాం. పరిహారంగా రూ.10లక్షలు, ట్రాప్‌లకు రూ.50లక్షలు ఇస్తున్నాం. తప్పుడు ప్రచారాన్ని ఖండించడమే పనిగా పెట్టుకోవాలా? వైకాపా వారు డబ్బులు ఇస్తున్నారని తప్పుడు పోస్టులు పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆ తర్వాత వాళ్లు వచ్చి కాపాడలేరని గుర్తుంచుకోండి. 100 రోజుల్లో రూ.3,800 కోట్లు ఖర్చు పెట్టి కుప్పానికి నీరిస్తే.. దానిపైనా విషం చిమ్ముతున్నారు. నీరు రావడం లేదని, కాల్వలు ఎండాయని పోస్టులు పెడుతున్నారు. పదవీ విరమణ వయసు పెంపుపైనా ఫేక్ జీవోతో తప్పుడు ప్రచారమే. అభివృద్ధి, సంక్షేమం అమలు చేయాలా? తప్పుడు ప్రచారాన్ని ఖండించడమే పనిగా పెట్టుకోవాలా? అలాగని వాస్తవాలు చెప్పకపోతే.. ప్రజలు అదే నిజమని నమ్మి మోసపోతారు. మొన్నటి వరకు మహిళలపై వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారు. రాజధానిపైనా తప్పుడు ప్రచారం చేశారు. మామిడిని రోడ్లపై పోసి తొక్కించారు. కోకో విషయంలోనూ డ్రామాలాడారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌పైనా తప్పుడు ప్రచారమే కేంద్రం తెలుగు వారి మనోభావాలు గౌరవించి రూ.12 వేల కోట్లు ఇచ్చింది. గతంలో తీసుకున్న నిర్ణయంపైనా పునరాలోచన చేసింది. కొన్ని సేవలు ప్రైవేటీకరిస్తే.. మొత్తం ప్రైవేటుకు ఇస్తున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారు.

## స్థానిక సంస్థలకు చేయూత

-మొదటిపేజీ తరువాయి

అంశాలపై విధివిధానాలు రూపొందించవచ్చన్నారు. ఉపాధి హామీ పథకం కింద కేంద్రం నుంచి పెద్దఎత్తున నిధులు వస్తున్నాయని, అయితే ఆమేరకు ఆస్తుల కల్పన జరుగుతున్నదో.. లేదో? పరిశీలించాలన్నారు. స్థానిక సంస్థలు స్వయం సమృద్ధి సాధించేలా అధికారులు ప్రయత్నించాలన్నారు. పట్టణ స్థానిక సంస్థలనూ ఆర్థికంగా బలోపేతం చేస్తూ, మరిన్ని ఆదాయార్జన మార్గాలను అన్వేషించాలని చెప్పారు. ప్రభుత్వాలు ఇచ్చిన నిధులను సద్వినియోగం చేసుకునేలా స్థానిక ప్రజాప్రతినిధులు వ్యవహరించాలన్నారు. ప్రజలకు ప్రత్యక్షంగా సేవలు అందించేవి స్థానిక సంస్థలని, దీనిని దృష్టిలో పెట్టుకుని వాటిలో పనిచేసే ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు బాధ్యతగా ఉండాలని చెప్పారు. ఆర్థిక సంవత్సరం చివరికి పంచాయతీల్లో ఆడిటింగ్ పూర్తి చేయాలన్నారు.

**ఆదాయాలు, బకాయిల లెక్క తేల్చండి: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్**

2019 నుంచి 2024 మధ్య కాలంలో స్థానిక సంస్థల ఆస్తి పన్నుల వసూళ్లు, బకాయిల లెక్కలు తేల్చాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులకు సూచించారు. ప్రజలు చెల్లించే పన్నుల వివరాలను ఆన్‌లైన్ చేయాలన్నారు. గ్రామాల్లో పౌల్ట్రీ పరిశ్రమలపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలని, గ్రామ ప్రజలకు, పౌల్ట్రీ పరిశ్రమలకు ఇబ్బంది లేని విధానాన్ని తీసుకురావాలని చెప్పారు. ఆదాయార్జన ప్రకారం స్థానిక సంస్థల వర్గీకరణ ప్రక్రియను నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలని సూచించారు. అయితే ఇందుకు చట్ట సవరణ చేయాల్సి ఉంటుందని ఆర్థిక సంఘం అధికారులు తెలిపారు.

**ఖర్చులు.. ఆదాయం మధ్య భారీ వ్యత్యాసం**

స్థానిక సంస్థల ఆదాయ వనరులు.. ఖర్చుల మధ్య భారీ వ్యత్యాసం ఉంటోందని 5వ ఆర్థిక సంఘం తన నివేదికలో పేర్కొంది. 2023–24 ఆర్థిక సంవత్సరాన్ని పరిశీలిస్తే రాష్ట్ర ఆదాయం కన్నా జీతాలు, పెన్షన్లు, వడ్డీ చెల్లింపులకు ఖర్చు పెట్టే మొత్తం 111 శాతంగా ఉందని పేర్కొంది. 2025–26 నుంచి 2029–30 వరకు పంచాయతీరాజ్ సంస్థల రీసోర్స్ గ్యాప్ రూ.7,033 కోట్లు ఉంటుందని ఆర్థిక సంఘం లెక్క తేల్చింది. ఇదే కాలానికి పట్టణ స్థానిక సంస్థల రీసోర్స్ గ్యాప్ రూ.2,016 కోట్లుగా ఉందని, ఆస్తి పన్నుల డిమాండ్–కలెక్షన్ మధ్య భారీ వ్యత్యాసం ఉందని చెప్పింది.

**విద్యుత్ బిల్లులు చెల్లించని గత ప్రభుత్వం**

గత ప్రభుత్వం 2024 జూన్ వరకు చెల్లించకుండా వదిలేసిన గ్రామ పంచాయతీల విద్యుత్ బిల్లులు రూ.5,851.58 కోట్లు ఉన్నాయని ఆర్థిక సంఘం తన నివేదికలో పేర్కొంది. గ్రామ పంచాయతీలకు వివిధ రూపాల్లో నిధుల సమీకరణ రూ.2,617 కోట్లుగా ఉందని, ఇందులో అత్యధికంగా కేంద్ర ఆర్థిక సంఘం అందిస్తున్న గ్రాంట్స్ రూపంలోనే ఉన్నాయని తెలిపింది. ఆతర్వాత ఆస్తి పన్నులతో ఎక్కువ నిధులు సమకూరుతున్నాయని పేర్కొంది. పంచాయతీరాజ్ సిబ్బందికి ఏటా జీతాల రూపంలో రూ.393. 77 కోట్లు, మున్సిపల్ సిబ్బందికి రూ.1672.45 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తోందని సంఘం తన నివేదికలో పేర్కొంది. ఈ సమావేశంలో రాష్ట్ర 5వ ఆర్థిక సంఘం చైర్‌పర్సన్ రత్నకుమారి, సభ్యులు ప్రసాదరావు, కృపారావు, ఆర్థిక, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## జీఎస్టీ వసూళ్లలో ఆంధ్రా రికార్డ్

విజయవాడ

ఏపీలో కూటమి ప్రభుత్వం మరో సరికొత్త రికార్డు సృష్టించింది. జీఎస్టీ వసూళ్లలో గణనీయమైన వృద్ధి సాధించింది. గత ఏడాదితో పోల్చితే రికార్డు స్థాయిలో జీఎస్టీ వృద్ధి నమోదు అయింది. దేశ సగటు వృద్ధి పది శాతం కాగా.. ఏపీలో రెట్టింపు వృద్ధి ఉంది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత జిఎస్టి వసూళ్లలో వెనుకబడి ఉంది. దీంతో విపక్షం సైతం దీనిని ప్రచారాస్త్రంగా మార్చుకుంది. దానికి కారణం లేకపోలేదు. అధికారంలోకి వస్తే సంపద సృష్టిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. జీఎస్టీ వసూళ్లలో వెనుకబాటు కనిపించడంతో.. ఇదే నా సంపద సృష్టి అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించడం ప్రారంభించింది. దీనికి సమాధానం కూడా ఇవ్వలేకపోయింది కూటమి. అయితే గత ఏడాదిగా చేసిన ప్రయత్నం గత నెల నుంచి కనిపించింది. జూలై నెలలో జీఎస్టీ వసూళ్లలో పురోగతి ప్రారంభం అయింది. ఆగస్టు నెలకు సంబంధించి ఏకంగా 21% వృద్ధి కనిపించడం విశేషం.దేశంలో జీఎస్టీ వృద్ధి గత ఏడాదితో పోల్చుకుంటే 10% పెరిగింది. కానీ ఏపీకి వచ్చేసరికి 21 శాతానికి పెరగడం మాత్రం గుర్తించాల్సిన అంశం. 2025 ఆగస్టులో రూ.3989 కోట్ల రాబడి వచ్చింది జిఎస్టి ద్వారా. దేశంలో జీఎస్టీ అమల్లోకి వచ్చాక ఇదే అత్యధిక రాబడి అని అధికారులు చెబుతున్నారు. దేశంలో ఇతర రాష్ట్రాల కంటే చాలా ఎక్కువ. సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ, అండమాన్ నికోబార్ దీవులను మినహాయిస్తే జీఎస్టీ వసూళ్లలో ఏపీ అగ్రస్థానంలో ఉంది. గత ఏడాది ఆగస్టులో జిఎస్టి వసూలు రూ.3298 కోట్లు రాగా.. ఈ ఏడాది అదే ఆగస్టులో రూ.3989 కోట్లు రావడం విశేషం.2018 నుంచి జిఎస్టి అమల్లోకి వచ్చింది. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సంపద సృష్టిస్తామని చంద్రబాబు ప్రకటనలు చేశారు. క్షేత్రస్థాయిలో జీఎస్టీ వసూలు చూస్తుంటే మాత్రం ఇబ్బందికరంగా ఉన్నాయి. వాస్తవానికి 2023 ఆగస్టు తో పోలిస్తే.. 2024 ఆగస్టులో నికర జీఎస్టీ వసూలు 14.38 శాతానికి పెరిగాయి. స్థూల జీఎస్టీ వసూళ్లు అయితే 14.67% వృద్ధిని నమోదు చేశాయి. అయినా సరే రాష్ట్ర ప్రభుత్వం పై విమర్శలు తప్పలేదు. 2024 ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు జీఎస్టీ ద్వారా రూ.21,164 కోట్ల ఆదాయం వచ్చింది.. అదే 2025లో ఇది రూ.22352 కోట్లకు చేరింది.

# మండలం రెస్టారెంట్లలో మరియు హోటళ్లలో కల్తీ ఆహారం

నిల్వ ఉంచిన,కుళ్లిన పదార్థాల వినియోగం

రసాయనాలు కలిపిన వంటలు - తనిఖీలు నిల్

**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలో కొన్ని హోటళ్లు,రెస్టారెంట్లులో బిర్యానీ సెంటర్లకు వెళ్తే రంగు రంగుల విషం వడ్డిస్తున్నారు. చూడగానే నోరూరించే ఆహార పదార్థాలు పెడుతున్నారు. రోజుల తరబడి ఫ్రిజ్లో నిల్వ ఉంచిన,కుళ్లిన పదార్థాలకు రసాయనాలు, మసాలాలు దట్టించి మరీ వడ్డిస్తున్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. క్యాన్సర్ కారకాలైన రసాయన రంగులను అధిక మోతాదులో స్వీట్లలో వినియోగిస్తున్నట్లు ప్రజల నుండి పలు ఆరోపణలు వెలువెత్తు తున్నాయి. కల్తీని అరికట్టాల్సిన అధికారులు ఆ వైపు తొంగిచూడడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హోటళ్లు, బిర్యానీ సెంటర్లు ఏర్పాటు చేయాలంటే ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా లైసెన్స్ తప్పనిసరి. లైసెన్స్ లేకుండా తనిఖీల్లో దొరికితే సంబంధిత అధికారులు క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు. మండల కేంద్రంలో హోటళ్లు,బిర్యానీ సెంటర్లు,బేకరీలు, టీస్టాళ్లు,రెస్టారెంట్లు. ,ఫాస్ట ఫుడ్ సెంటర్లు ఎక్కువ గానే ఉన్నాయి. వీటిలో ఎన్నింటికి లైసెన్సులు ఉన్నాయనేది ప్రశ్నార్థకమే. ఇన్ని హోటళ్లున్నా ఏడాదికి కనీసం ఏ ఒక్క దానిపై కూడా జరిమానా విధించిన దాఖలాలు లేవు. మిఠాయి,భేకరీ తయారీ కేంద్రాలను ఏడాదిలో ఒకట్రెండు సార్లు తూతూమంత్రంగా తనిఖీలు చేస్తారన్న విమర్శలున్నాయి. దీనివల్ల కిరాణా వ్యాపారుల సైతం రెచ్చిపోతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. అధికారులు తరచూదాడులు చేస్తే నాణ్యమైన ఆహారం అందుతుందని పలువురు అంటున్నారు. కొన్ని పదార్థాలను ఫ్రిజ్లో ఉంచి,రెండు మూడు రోజుల తరువాత వండుతున్నట్లు పలువురు బహిరంగంగానే చెబుతున్నారు. ప్రజలు ఇష్టంగా తినే ఆహార పదార్థాలను కల్తీ చేసినా,నాసిరకంగా తయారు చేసి విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని స్టేట్ ఫుడ్ సేఫ్టీ టాస్క్ఫోర్స్ అధికారులు స్పష్టం చేస్తున్నారు.



# నాఆస్తి నేను పొందకుండా ముత్యమాధురి, సాల్మన్ రాజు కుట్ర

- ఆ పామాయిల్ తోట నాది
- సుప్రీంకోర్టు ఇటీవల ఆస్తిపై నాకు ఆర్డర్ కూడా ఇచ్చింది
- వీరి ఇరువురికి తోటపై ఎలాంటి హక్కు లేదు
- వారినుంచి నాకు ప్రాణహాని ఉంది
- మీడియాతో తోట యజమాని నురుకుర్తి వీరలక్ష్మి ఆవేదన

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** రంగంపేట మండలం ఈలగోలను గ్రామంలోని పామాయిల్ తోటలు తన సొంత ఆస్తి అని,వాటిపై నురుకుర్తి సాల్మన్ రాజుకు,ముత్య మాధురికి ఎలాంటి హక్కు లేదని తోట యజమాని నురుకుర్తి వీరలక్ష్మి చెప్పారు ఆమె తన తండ్రి టి.వి.వి.సత్య నారాయణతో కలిసి రాజమండ్రి ప్రెస్ క్లబ్ లో మీడియాతో మాట్లాడారు. నురుకుర్తి సాల్మన్ రాజుతో తనకు 1985లో వివాహం జరిగిందని,తమకు ,ఒక అబ్బాయి, ఇద్దరు అమ్మాయిలు పుట్టారని చెప్పారు.ఉద్యోగ రీత్యా సాల్మన్ రాజు దూరంగా ఉండేవాడని,2005లో తనను పుట్టింటికి పంపేశాడని ఆమె చెప్పారు. ఏడేళ్ళ వయసులో బాబు చనిపోయాడని ఆడపిల్లలు సాల్మన్ రాజు వద్దే ఉండేవారని తెలిపారు.తన పుట్టింటివారు ఇచ్చిన డబ్బుతో పామాయిల్ తోట 8ఎకరాల 86 సెంట్లు కోనుగోలు చేసినట్లు వీరలక్ష్మి చెప్పారు.తాను నుంచి విడిపోయిన సాల్మన్ రాజు తర్వాత కాలంలో వేరే పెళ్ళి చేసుకున్నాడని ఆమె తెలిపారు. తాను చనిపోయానని ఆడపిల్లలకు చెప్పాడని ఆమె ఆరోపించారు.తల్లి బాగోగులు చూడని ఆడ పిల్లలు,తల్లి జీవించి లేదని చెప్పే ఆడపిల్లలకు తన స్వంత ఆస్తి అయిన పామాయిల్ తోటపై హక్కు ఎలా ఉంటుందని ఆమె



అన్నారు.అయితే ఆ తోటలపై వచ్చే ఆదాయం తాను పొందకుండా సాల్మన్ రాజు 2010లో సివిల్ కేసు వేశాడని వీరలక్ష్మి చెప్పారు. దాంతో తనకు ఆదాయం కూడా రాకుండా చేశారని, ప్రభుత్వం నుంచి పెన్షన్ పొందాలని దరఖాస్తు చేసుకుంటే లక్షల విలువ చేసే పామాయిల్ తోట యజమానికి పెన్షన్ ఎలా ఇస్తారని అది రాకుండా సాల్మన్ రాజు,ముత్య మాధురి,మరో ఆడపిల్ల భాగ్య సుమ అడ్డుపడ్డారని ఆమె వాపోయారు.తన తలిదండ్రులు వృద్ధులని వారితో కలిసి జీవిస్తుంటే అక్కడ కూడా తనను ప్రశాంతంగా ఉండనివ్వ కుండా ఆస్తి కోసం దౌర్జన్యం చేస్తున్నారని,దాంతో తమ తండ్రి సొంత ఇంటిలో ఉంటే చంపేస్తారని భయపడి పోలీసుల రక్షణ లో వేరే చోట ఉంటున్నామ ని వీరలక్ష్మి చెప్పారు.ఈ ఏడాది జనవరి 6వ తేదీన ఆ తోటపై హక్కులు తనకేనని సుప్రీంకోర్టు ఆర్డర్ ఇచ్చిందని తెలిపారు.తమ పామాయిల్ తోట పక్కనే ఉండే మరో పొలం యజమాని మల్లిడి శ్రీనివాసరెడ్డిని తమ పామాయిల్ తోటలు చూడాలని కోరామని అందుకే ఆయన ఆతోటలో దొంగతనంగా పామాయిల్ గెలలు కోస్తున్న కూలీలపై కేకలు వేసి ఉంటారని ఆమె అన్నారు.ముత్య మాధురికి ఆ తోటలకు ఎలాంటి సంబంధం లేదని, అలాంటప్పుడు పామాయిల్ తోటలోకి కూలీలను ఎందుకు పంపించాలని నురుకుర్తి వీరలక్ష్మి నిలదీశారు. పామాయిల్ తోట విషయంలో ముత్య మాధురి ఆటలు సాగడం లేదని పక్కన ఉండి అడ్డుపడుతున్న మల్లిడి శ్రీనివాసరెడ్డిపై కూలీల చేత తప్పుడు ఆరోపణలతో పోలీసులకు ఫిర్యాదు చేయించి ఉంటుందని ఆమె అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులపై నెపం వేయడం సమంజసం కాదని,వారు లేకపోతే తనను బతకనివ్వరని ఆమె వాపోయారుసాల్మన్ రాజు, ముత్య మాధురి వల్ల తనకు ప్రాణహాని ఉందని ఆమె అందోళన వ్యక్తం చేశారు.పోలీసుల రక్షణ వల్లనే తాము ధైర్యంగా ఉంటున్నామని ఇకనైనా సాల్మన్ రాజు,ముత్య మాధురి తమ పద్ధతి మార్చుకుని తన పామాయిల్ తోటల జోలికి రాకుండా ఉండాలని వీరలక్ష్మి హితవు పలికారు.సాల్మన్ రాజు రిటైర్ అయిన తరువాత అతడికి ఉద్యోగ రీత్యా రూ.కోటి వస్తే అది తన రెండో భార్యకుపుట్టిన కుమారుడుకి ఇస్తానని చెబుతూ, ఇద్దరు ఆడ పిల్లలను తానే పామాయిల్ తోటలపైకి ఉసి గొల్పు తున్నాడని వీరలక్ష్మి ఆరోపించారు. తనకు ఆధారంగా ఉన్న పామాయిల్ తోటల ఆదాయం తనకు దక్కేలా అందరు న్యాయం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# కార్మికులకు హామీ ఇచ్చిన నిధులేవి

**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్ :** గత నెలలో సత్య సాయి కార్మికుల జీతాలపై జ్యోతుల నెహ్రూ చొరవతో తాత్కాలికంగా సమ్మె విరమించడం జరిగిన విషయం అందరికీ తెలిసినదే నేటికీ నెల రోజులు గడుస్తున్న ఆ మాట నెరవేరలేదు జ్యోతుల నెహ్రూ బత్తుల బలరామకృష్ణ చొరవ తీసుకున్నా,నిధులు కొరత అనే మాట వినబడుతుంది అంటే సత్యసాయి త్రాగునీటి పథకం పరిస్థితి ఏ విధంగా ఉందో చెప్పకనే చెప్తున్నట్టు కనపడుతుంది. ప్రభుత్వానికి ఈ పథకం కొనసాగించే ఆలోచన ఉందా లేదా అనేది అర్థం కావడం లేదు.ప్రజలకు త్రాగునీరు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా?ఉంటే 80 గ్రామాలకు త్రాగునీరు అందిస్తున్న ఇలాంటి ప్రాజెక్టును ఎందుకు ఇంత నిర్లక్ష్యం చేస్తుంది. ఇందులో పని చేస్తున్న కార్మికులకు 21 నెలల జీతాలు ఇవ్వకుంటే తెలిసి తెలియనట్లు ఎందుకు చోద్యం చూస్తుంది.ఇలాంటి ప్రాజెక్ట్ లకు నిధులు విడుదల



చేయడంలో ఎందుకు అలసత్వం వహిస్తోందో అర్థం అవడం లేదు. కాంట్రాక్టర్ టెండర్ వేసే ముందు ప్రతి నెల జీతాలు ఇవ్వమని ఒప్పందం చేసుకున్న కాంట్రాక్టర్ ని కూడా సమర్ధించుకుంటూ వస్తుందంటే లోపం ఎక్కడ ఉందో అర్థం కావడం లేదు. త్రాగునీటి ప్రాజెక్టులపై కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు సమీకరించి కార్మికుల జీతాలకు భరోసా కల్పిస్తారనుకుంటే ఎక్కడ అడ్డంకులు ఉన్నాయో అర్థం అవటం లేదు ఫైనాన్స్ మినిస్టర్ అనంతపురం సత్యసాయికి నిధులు విడుదల చేసినంత స్పీడుగా తూర్పు, అల్లూరి మరియు పశ్చిమగోదావరి జిల్లాలో సత్యసాయి పథకానికి నిధులు విడుదల కావడం లేదు. అంటే ఈ పథకాలు ఏం పాపం చేసుకున్నాయో అర్థం అవటం లేదు. అర్థం కాని అయోమయ పరిస్థితిలో కార్మికులు ఈ పథకాన్ని జీవితాల్ని కొనసాగిస్తున్నారు. వీటన్నిటి మధ్యలో సహనం ఓర్పు నశిస్తున్నాయని దిక్కుతోచని పరిస్థితిలో సమ్మె కొనసాగించడానికి వడివడిగా అడుగులు వేసేందుకు కార్మికులు అవుతున్నారని తెలియపరిచారు.

## మల్లిడి శ్రీనివాసరెడ్డి పై వెంటనే కేసు నమోదు చేయాలి..

- మమ్మల్ని కులం పేరుతో దూషించి..వేధిస్తున్నారు..
- దొండపాటి దుర్గ ఆవేదన



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** రాజానగరం మండలం సూర్యారావుపేట గ్రామానికి చెందిన తాను బతుకు తెరువు నిమిత్తం పొలం పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని దొండపాటి దుర్గ తెలిపింది. రంగంపేట మండలం ఈలగోలను గ్రామానికి చెందిన నురుకుర్తి సాల్మన్ రాజు కుమార్తె ముత్య మాధురి పామాయిల్ తోటలో కూలి పని చేస్తుండగా పక్క పొలానికి చెందిన మల్లిడి శ్రీనివాసరెడ్డి అనే ఆసామి తమను వీడియోలు తీసి, కులం పేరుతో దుర్భాషలాడుతూ ఇబ్బందులకు గురి చేశాడని ఆరోపించారు.రాజమండ్రి ప్రెస్ క్లబ్ లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ గతంలో ఆ పొలం తాను కౌలుకు తీసుకున్నానని అక్కడ పని చేయొద్దు అంటూ తమని ఇబ్బందులకు గురి చేయడమే గాక మా కులం అడిగిమరీ ఇబ్బంది కరంగా అసభ్య పదజాలంతో దూషించాడని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం అక్కడ పనులు ఆపేసి వెళ్లకపోతే చంపేస్తామని మా బంధు వర్గం అంతా రాజకీయాల్లోనే ఉన్నారని, అందరిని జైల్లో పెట్టిస్తానని బెదిరించారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై కేసు నమోదు చేయాలని రంగంపేట పోలీస్ స్టేషన్ కు వెళితే తమదే తప్పు అన్నట్టుగా.. కేసు పెట్టడానికి వచ్చార అని ఆరోపించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రజా స్పందన కు గత నెల 15వ తేదీన ఫిర్యాదు చేయగా తమను స్టేషన్ కు పిలిపించి కేసు వాపసు తీసుకోకపోతే మీ పైన కేసులు పెడతానని బెదిరించారని వాపోయారు. స్టేషన్లో వారికి కుర్చీలు వేసి కూర్చోబెట్టి మమ్మల్ని మాత్రం నిల్చోపెట్టి మాట్లాడడం తీవ్ర మనస్తాపం కలిగించిందని తెలిపారు. పొట్టకూటి కోసం కూలి పనులకు వెళ్లిన తమను దారుణంగా తిట్టిన అతడిపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.ఈ విషయాన్ని ఎస్సీ కమిషన్ చైర్మన్ కే.ఎస్. జవహర్ దృష్టికి కూడా తీసుకుని వెళ్లడం జరిగిందన్నారు.ఆయన స్వయంగా పోలీస్ స్టేషన్ కు ఫోన్ చేసినప్పటికీ వారిపై ఇప్పటివరకు కేసు కూడా నమోదు చేయలేదని తెలిపారు. బీసీ ప్రజా సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి రాజేశ్వరరావు మాట్లాడుతూ అక్కడ పొలానికి సంబంధించి తల్లి కూతుళ్ళ మధ్య వివాదం జరుగుతోందని ఈ విషయంలో మల్లిడి శ్రీనివాస రెడ్డి మధ్యలోకి వచ్చి ఆ పొలాన్ని ఎలాగైనా స్వాధీనం చేసుకోవాలని కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. దళితులు, బీసీలను వేధింపులకు గురి చేస్తున్న శ్రీనివాసరెడ్డి పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పామాయిల్ గెలలు తరాలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేశారని, ఆ గెలలు ఏమయ్యాయో తెలియడం లేదని అన్నారు.అనపర్తి ఎమ్మెల్యే తన వెనక ఉన్నారంటూ ఆయనకు కూడా చెడ్డ పేరు తెచ్చేలా ఈ మల్లిడి శ్రీనివాసరెడ్డి భూ దందాలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు.

## మరణించిన పలువురి కుటుంబాలను పరామర్శించిన బత్తుల వెంకటలక్ష్మి

**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** సీతానగరం మండలం, చిన కొండేపూడి గ్రామానికి చెందిన ముద్దల గోవింద్ ఇటీవల మరణించారని నాయకుల ద్వారా తెలుసుకున్న జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి వారి ఇంటికి వెళ్లి వారి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, మనోధైర్యం చెప్పారు.

ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## రఘుదేవపురం గ్రామంలో ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** జనసేన అధినేత,రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ (54)వ జన్మదిన వేడుకలు మంగళవారం రఘుదేవపురం జనసేన పార్టీ కార్యాలయం నందు దాసరి రమేష్,గెద్దాడ త్రిమూ ర్తులు అధ్యక్షతన ఘనంగా జరిగాయి. ఈ పుట్టినరోజు వేడుకలకు ముఖ్యఅతిథిగా రాజానగరం నియోజకవర్గ జనసేన పార్టీ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ హాజరై కేకు ను కట్ చేసి పార్టీ అభిమానులకు,పవన్ కళ్యాణ్ అభిమానులకు, నాయకులకు,వీర మహిళలకు పంచారు. మండలంలో పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పవన్ కళ్యాణ్ పుట్టినరోజు కార్యక్రమానికి ఎమ్మెల్యే బలరామకృష్ణ హాజరై కేకు లను కట్ చేసి పార్టీ అభిమానులతో ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో కారిచర్ల విజయశంకర్,మట్ట వెంకటేశ్వరావు,కవల గంగాధర్,కందిగట్ల అరుణకుమారి,పలువురు వీర మహిళలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.




## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** స్థానికంగా నెలకొన్న సమస్యలన్నింటికి తాము పరిష్కారం చూపిస్తామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గం లోని 42వ డివిజన్ రత్నంపేట వాంబేలోని 98 ఇళ్లకు మంచి నీటి సదుపాయం కల్పించడం జరిగింది. ఆ కుళాయిలను ప్రారంభించి అందుకు సంబంధించిన నీటి పన్ను పత్రాలను లబ్దిదారులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యుత్ లో లో వోల్టేజ్ సమస్య పరిష్కారానికి ఇటీవల ట్రాన్స్ఫార్మర్స్ వేయించినట్టు తెలిపారు. ఈ ప్రాంతంలో చేయాల్సిన పనులు చాలా ఉన్నాయని, వాటన్నింటినీ చేస్తామన్నారు. పని చేసే వారు ఎవరో గుర్తుంచుకోవాలని స్థానిక ప్రజలను కోరారు. ఇక్కడి ప్రజలకు గతంలో తెలుగుదేశం పార్టీ అండగా ఉందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. డివిజన్ ఇంఛార్జ్ మళ్ల వెంకట రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాశీ నవీన్ కుమార్, బుడ్డిగ రాధా, కెవి శ్రీనివాస్, సావిత్రి, వానపల్లి శ్రీనివాస్, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం



**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు** సంపాదనే కాకుండా సమాజ సేవలు చేయడంలో ఆర్య వైశ్యులు ముందుంటారు అనడంలో అతిశయోక్తి లేదని కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవ వేడుక మంగళవారం కొవ్వూరు పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపం నందు అంగరంగ వైభవంగా జరిగింది ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షులుగా నాలం శ్రీనివాసరావు, కార్యదర్శిగా కాకి అనిల్ సూర్య, కోశాధికారిగా కంకటాల రాంబాబు, వాసవి ఆర్గనైజింగ్ కన్వీనర్ గా పెరుమాళ్ల వీరేశ్వర రావు, గౌరవ అధ్యక్షులుగా మట్టే వరప్రసాద్, మద్దుల సోమరాజు నాని, ముఖ్య సలహాదారులుగా మద్దుల సత్యనారాయణ లచే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వెలగా శ్రీరామ్మూర్తి, ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వ్యాపార అభివృద్ధి కాకుండా సమాజ అభివృద్ధిని కోరుకుంటూ సమాజ సేవ చేస్తున్న ఆర్యవైశ్యులు అభినందనీయులని అన్నారు. ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షులుగా ప్రమాణస్వీకారం చేసిన నాలం శ్రీనివాసును కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే దుస్సాలువతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలోఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణ, తెలుగుదేశం నాయకులు కంటమణి రామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సూరపనేని చిన్ని సూర్యదేవర రంజిత్ కుమార్ పట్టణ తెలుగుదేశం అధ్యక్షులు దాయన రామకృష్ణ ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ వేమగిరి వెంకట్రావు, క్లస్టర్ ఇంచార్జ్ పెనుమాక జయరాజు, వైఎస్ఆర్సిపి యువజన నాయకులు కంటమనే రమేష్ పట్టణ వైఎస్ఆర్సిపి అధ్యక్షులు చిట్టూరి అన్నవరం, తెలుగుదేశం నాయకులు కొప్పాక విజయనంద జవహర్ మరపట్ల కళాధర్ చక్రవర్తి తదితర ఆర్యవైశ్య సంఘం నాయకులు కొవ్వూరు పట్టణంలోని ప్రముఖులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారికి గరికి పూజ 108 రకాల మహా నైవేద్యం



**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు** గణపతి నవరాత్రి వేడుకల్లో భాగంగా కొవ్వూరు పట్టణంలోని మెరకు వీధి రౌండ్ రామాలయం యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ గణపతి నవరాత్రి వేడుకలలో ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం స్వామివారికి గరికి పూజ 108 రకాల మహా నైవేద్యాన్ని సమర్పించారు మహిళలు విశేషంగా పాల్గొని స్వామివారికి గరిక పూజలు నిర్వహించారు అంగరంగ వైభవంగా జరిగిన ఈ వేడుకలలో ఆలయ కమిటీ సభ్యులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి మహా నైవేద్యాన్ని సమర్పించారు ఈ కార్యక్రమంలో రౌండ్ రామాలయం యూత్ గణపతి నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

# ఎడిటర్ వాయిస్

## గ్రాండ్ ఓల్డ్ మాన్ ఆఫ్ ఇండియా


దాదాభాయి నౌరోజీ కాంగ్రెస్ పార్టీకి వాస్తవానికి ప్రాతఃస్మరణీయులు. ఆ పార్టీ వ్యవస్థాపక సభ్యులలో ఆయన ఒకరు. మూడు పర్యాయాలు జాతీయ కాంగ్రెస్ వార్షిక సభలకు అధ్యక్షత వహించిన నాయకులు. నౌరోజీ జీవిత చరిత్ర 19 వ శతాబ్దంలో భారతీయ జాతీయవాదుల పోరాటాలను స్పష్టంగా తెలుపుతుంది. భారత జాతీయ కాంగ్రెస్ స్థాపించక ముందునుంచే స్వాతంత్ర్యం కోసం గళమెత్తారు. నౌరోజీ, ఎ. ఓ. హ్యూమ్, దిన్షా ఎదుల్జీ వాచాతో కలిసి భారత జాతీయ కాంగ్రెస్ ను స్థాపించారు. 1892 నుండి 1895 వరకు ఇంగ్లాండ్ చట్టసభ అయిన యునైటెడ్ కింగ్‌డమ్ హౌస్ ఆఫ్ కామన్స్ లో కొనసాగారు. ఆయన ఆ పదవి పొందిన మొదటి ఆసియా వ్యక్తి. దాదాభాయ్ నౌరోజీ (సెప్టెంబర్ 4, 1825 – జూన్ 30, 1917) పార్సీ మతానికి చెందిన విద్యావేత్త, మేధావి, పత్తి వ్యాపారి, తొలితరం రాజకీయ, సామాజిక నాయకులు, బ్రిటీష్ చట్టసభ సభ్యుడైన తొలి ఆసియా ఖండ వాసి అయిన దాదాభాయ్ నౌరోజీ 1825 సెప్టెంబరు 4 న, బొంబాయిలో నవసారిలో ఒక పార్సీ కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి పలన్ జీదోరోజి జొరాష్ట్రియన్ మత పురోహితులు. బరోడా మహారాజు మూడవ శాయాజీరావు గైక్వాడ్ సహాయంతో కళాశాల ఎలిఫెన్‌స్టోన్ ఇనిస్టిట్యూట్‌లో చదివారు. తరువాత అక్కడే ఆచార్య పదవిని పొందారు. మహిళలకు విద్యను ప్రోత్సహించ డానికి జరిగిన ప్రత్యేక తరగతులలో ఆయన బోధించారు. తన జొరాష్ట్రియన్ మతంలో సంస్కరణల కోసం ఆయన పాటు పడ్డారు. నౌరోజీ ఆలోచనలు, ఆర్థికశాస్త్రంపై ఆధారపడినవి. కామా అండ్ కో' అనే కంపెనీలో భాగస్వామి కావడానికి 1855 సంవత్సరంలో ఆయన లండన్ వెళ్లారు. ఆ కంపెనీ లివర్‌పూల్ లో బ్రిటన్‌లో స్థాపించబడిన మొదటి భారతీయ కంపెనీగా అవతరించింది. భారత స్థితి గతులను ఆంగ్లేయులకు విడమరిచి చెప్పారు. నౌరోజీ ఇంగ్లాండ్‌లో లిబరల్ పార్టీలో చేరారు. మూడేళ్లలో దాదాభాయ్ రాజీనామా చేసి, తన సొంత వ్యాపార సంస్థ 'దాదాభాయ్ నౌరోజీ అండ్ కో.' ప్రాంభించారు. ఇంగ్లండ్‌లో భారతీయుడు స్థాపించిన తొలి వాణిజ్య సంస్థ అదే. 1865 నుండి 1866 వరకు, లండన్ విశ్వ విద్యాలయ కళాశాలలో గుజరాతీ భాషా ఉపాధ్యాయులుగా కూడా పనిచేశారు. 1865 లోనే, భారతీయ రాజకీయ, సామాజిక మరియు సాహిత్య సమస్యలు మరియు విషయాలను చర్చించి, ఇంగ్లాండ్ ఓటర్లకు అనుకూలంగా మార్చడం ఉద్దేశ్యంతో దాదాభాయ్ నౌరోజీ 'లండన్ ఇండియన్ సొసైటీ'ని స్థాపించారు. ఆయన 'ఈస్ట్ ఇండియా అసోసియేషన్' ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. అది ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ యొక్క ప్రధాన సంస్థ, స్థాపన ప్రధాన ఉద్దేశం బ్రిటిష్ వారి ముందు భారతీయుల శక్తిని బలోపేతం చేయడం. 1874 లో బరోడా ఇన్స్టిట్యూట్ యొక్క మున్సి పోస్ట్ బాధ్యతను స్వీకరించారు. 1875 లో, అతను బొంబాయి మునిసిపల్ కార్పొరేషన్ సభ్యుడు అయ్యారు. నౌరోజీ 1886 లో మొదటిసారిగా బ్రిటిష్ పార్లమెంట్ పదవి కోసం పోటీ చేసి, ఓటమి పాలు కాగా, 1892 లో తన రెండవ ప్రయత్నంలో విజయం సాధించి, హౌస్ ఆఫ్ కామన్స్‌కు ఎన్నికైనారు. బ్రిటిష్ పార్లమెంటులో ఎన్నికైన మొదటి ఆసియా వ్యక్తిగా 1892 నుండి 1895 వరకూ పార్లమెంట్ సభ్యుడిగా యునైటెడ్ కింగ్?డమ్ హౌస్ ఆఫ్ కామన్స్ లో కొన సాగారు. బ్రిటిష్ పార్లమెంట్ లో భారత ఉప ఖండంలో వలస రాజ్యాల దోపిడీ సమస్యను మొదట లేవనెత్తారు. 1895 సంవత్సరానికి భారత వ్యయంపై రాయల్ కమిషన్ సభ్యులుగా కూడా నియమించ బడ్డారు. బరోడా మహారాజు శయాజీరావు గైక్వాడ్ కాలంలో సంస్థాన దివానుగా పని చేసారు. 1874 లో, ఆయన బరోడా ప్రధాన మంత్రి, 1885 నుండి 1888 వరకు ముంబై శాసన మండలి సభ్యుడయ్యారు. అలా ప్రజా జీవితంలో ప్రవేశించిన ఆయన "గ్రాండ్ ఓల్డ్ మాన్ ఆఫ్ ఇండియా" గా ప్రసిద్ధి గాంచారు. భారత జాతీయ కాంగ్రెస్ వ్యవస్థాపకులు సురేంద్రనాథ్ బెనర్జీతో పాటు వ్యవస్థాపకుల్లో ఒకరు. 1886 లో నౌరోజీ దాని అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. 1893 లో లాహోరులో జరిగిన జాతీయ కాంగ్రెస్ సమావేశానికి



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# సాటిలేని మేటి జ్యోతిశ్శాస్త్ర ఘనాపాఠి

కాలచక్రంతో పాటు గ్రహగతులనూ, జ్యోతిశ్శాస్త్రాన్నీ కూలంకషంగా అధ్యయనం చేసి అక్షరాలకూ, సంఖ్యలకూ బ్రహ్మముడులు వేస్తూ ఒక వ్యక్తి పేరులోంచి వారు పుట్టిన సమయాన్ని వెలికి తీసేందుకు తెలుగు భాషలోని అసంఖ్యాక గుణింతాలతో కూడిన ఒక నిర్దిష్ట సూత్రం రూపొందించి దాని ఆధారంగా జాతకాలను అధ్యయనం చేస్తూ జ్యోతి శ్శాస్త్రంలో ఓ వినూత్న ధోరణిని ప్రవేశపెట్టి ఆ శాస్త్రం విలువను ప్రపంచానికి అందిస్తూ ఎందరికో భవిష్యన్మార్గదర్శకం చేసింది ఒక ఆంధ్రుడేనే విషయం చాలా మందికి తెలియదు. అప్పటి వరకూ అనుసరిస్తున్న గణన పద్దతిలో ఖచ్చితత్వం సరిగా లేక, లోప భూయిష్టమై, తప్పుల తడకలతో నడకలు సాగిస్తున్న ప్రపంచ కాలచక్ర గతులు సరిచేసే నిమిత్తం 45 బి.సి నుంచి 5,555 ఎ.డి వరకూ ఆంగ్ల క్యాలెండర్‌ను సరిదిద్ది సరికొత్త భమిడిపాటి కేలెండర్‌ను రూపొందించిన మేటి విజ్ఞానవేత్త మన తెలుగుబిడ్డ కావడం అది నిజంగా గర్వకారణ అంశం కాక మరేమిటి? సూర్యుని చుట్టూ భూమి చేసే భ్రమణానికి పట్టే సమయం 365.25 రోజులంటూ ప్రపంచం అప్పటి వరకూ నమ్ముతున్న సూత్రాలను తిరగరాసి, ఈ భ్రమణానికి 365.2422 రోజులు పడుతుందంటూ గణిత సూత్రాల ఆధారంగా ఖచ్చితంగా నిరూపించి నిర్ధారించిన మహా శాస్త్రవేత్త, సాటిలేని జ్యోతిశ్శాస్త్ర మేటి ఘనా పాటి భమిడిపాటి రాధాకృష్ణ. భాషా వ్యాకరణ, ఖగోళ, గణితశాస్త్ర సూత్రాలతో అనుసంధానమై నిర్దిష్ట ఫలితాలను నిక్కచ్చిగా అందించే విజ్ఞాన గని అని నిరూపించి, తన వాస్తవిక దృక్పథాన్ని నిరూపించు కున్న వ్యక్తిత్వం ఆయన సొంతం. రాధాకృష్ణ వ్యాకరణ, ఖగోళ, గణిత శాస్త్రాలను అనుసంధానించి అధ్యయనం చేయడం ద్వారా జ్యోతిశ్శాస్త్ర మూలాలను మర్దించి అసామాన్య జ్యోతిశ్శాస్త్రవేత్తగా ప్రశంసా పాత్రులైనారు. జ్యోతిశ్శాస్త్రంలో పూర్వం నుంచీ ఉన్న ఆ శాస్త్ర గ్రంథాలైన సారావళి, బృహజ్జాతకం, పరాశర గ్రంథం, జాతక మార్తాండ, జాతక సర్వస్వం, జాతక చంద్రిక, కేరళీయం ఇత్యాది గ్రంథాల్లో నిర్దిష్ట అంశంపై పరస్పర విరుద్ధమైన ఫలితాలు పేర్కొనబడడం రాధాకృష్ణ గమనించారు. అనంతరం వాస్తవిక దక్పథంతో ఈ శాస్త్ర గ్రంథాల నిగ్గు తేల్చేందుకు 40 ఏళ్ల పైబడిన వారికి చెందిన 2,600 జాతకాలు, 72 మంది కవలల జాతకాలు సేకరించి పరిశోధించారు. ప్రస్తుతం వాడుకలో ఉన్న ఇంగ్లీషు



కాలెండర్‌లో తప్పు ఉందని రుజువు చేసి, దానిని సరి చేసుకొనే విధానాన్ని సూచిస్తూ 1990లో "ది భమిడిపాటి కేలెండర్"ను ఆంగ్లంలో పుస్తక రూపంలో ప్రచురించారు. జపాన్, లండన్ లాంటి విదేశాల్లో ఈ క్యాలెండర్ విడుదలై, విక్రయించ బడి సంచలనం సష్టించింది. ప్రపంచంలో ఇటువంటి ప్రయత్నం ఇదే తొలిసారి కాగా అయన అపూర్వ కృషి... విజ్ఞులు, విమర్శకుల మన్ననలందుకుంది. ఇది ఆంధ్రులందరికీ గర్వకారణం. తన మరణాన్ని సూచించేలా అన్యాపదేశంగా సెప్టెంబర్ 4వ తేదీన ఈ లోకాన్ని వదులుతానని ముందుగానే తన డైరీలో రాసుకున్న రాధాకృష్ణ రాతలు ఆయన నుదుటి మీద గీతలేనన్న వాస్తవాన్ని ఎవరూ ఊహించ లేకపోవడం గమనార్హం. భమిడిపాటి రాధాకృష్ణ 24-11-1929 వ తేదీన రాజమండ్రిలో జన్మించారు. అక్కడే శ్రీ వీరేశలింగం ఉన్నత పాఠశాల లోను, తరువాత రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలలోను విద్యాభ్యాసం చేసి, 1949లో బీ.ఎస్సీ పట్టభద్రు లయ్యారు. తండ్రి శ్రీ కామేశ్వరరావు ఖ్యాతిగాంచిన హాస్య రచయిత కాగా... ఆయన రచనాభినివేశాన్ని తన జీన్స్‌లోనూ జీర్ణించుకున్నారు రాధాకృష్ణ. భమిడిపాటి రాధాకృష్ణ (నవంబరు 24, 1929 – సెప్టెంబరు 4, 2007) లబ్ధ ప్రతిష్టులైన నాటక, సినీ కథా రచయిత, జ్యోతిష శాస్త్ర పండితుడు, సంఖ్యాశాస్త్ర నిపుణుడు. అయన హాస్య రచయిత. "హాస్య బ్రహ్మ" భమిడిపాటి కామేశ్వరరావు కుమారుడు. రాధాకృష్ణ బహుముఖ ప్రజ్ఞశాలి. ఆయన మొదటి రచన భజంత్రీలు నాటిక. దీన్ని మొదటిసారిగా 25-2-1950 వ తేదీన రాజమండ్రిలో ఆర్ట్స్ కాలేజి పూర్వ విద్యార్థి వార్షికోత్సవ సందర్భంలో ప్రదర్శించారు. అయన 3 నాటకాలు, 6 నాటికలు రచించగా ప్రతీ ఒక్కటీ వెయ్యి ప్రదర్శనలకి పైగా ప్రదర్శింపబడి నాటకరంగ ఖ్యాతిని ఇనుమడింప చేశాయి. అవి కన్నడ, తమిళ, హిందీ భాషల్లోకి అనువాదం అయినాయి. "ఇదేమిటి, కీర్తిశేషులు, మన స్తత్వాలు, భజంత్రీలు, దంత వేదాంతం" వంటి నాటికలు, నాటకాలు వ్రాశారు. రావుగోపాల రావు 'కీర్తిశేషులు' లోని ఒక పాత్ర ధరించడం ద్వారా గుర్తింపు తెచ్చుకుని సినీ పరిశ్రమలోనూ అడుగు పెట్టాడు. 28-1-1952న రాజమండ్రిలో జరిగిన సన్మాన సభలో, ఆ సభకి అధ్యక్షత వహించిన అక్కినేని నాగేశ్వర రావు ఆధ్వర్యాన, రాధాకృష్ణకు "దృశ్య కావ్య ధురీణ" అనే గౌరవ పురస్కారం జరిపారు. నిర్మాత దుక్కిపాటి మధుసూదన రావు ప్రోద్బలంతో సినీ రంగంలోకి ప్రవేశించి 150 సినిమాలకు కథలందించారు. ఇందులో కె.విశ్వనాథ్ తొలి చిత్రమైన "ఆత్మగౌరవం" కూడా ఉంది. బ్రహ్మచారి, కథానాయకుడు, కీర్తిశేషులు, మరపురాని కథ, విచిత్ర కుటుంబం, పల్లెటూరి బావ, ఎదురులేని మనిషి, గోవుల గోపన్న, సీతారామ కళ్యాణం, నారీనారీ నడుమ మురారి, కాలేజీ బుల్లోడు వంటి వాటితో సహా తెలుగు పలు చిత్రాలకు కథలు వ్రాశారు. ఎన్టీఆర్, ఏఎన్నార్ లకు ఆయన సన్నిహితులు. 1994 తర్వాత క్రమంగా ఆయన సినిమా రంగానికి దూరమయ్యారు. తనకు ఎంతో ఇష్టమైన గణిత రంగంపై మక్కువ చూపారు. భమిడిపాటి రాధాకృష్ణ క్యాలెండర్ పేరిట క్రీస్తుపూర్వం 45 నుంచి క్రీస్తుశకం 5555 వరకు అంటే ఆరు వేల సంవత్సరాల క్యాలెండర్ రూపొందించారు. జ్యోతిష రంగంలో కూడా ఆయనకు పట్టు ఉంది. సంఖ్యాశాస్త్ర పరంగానే కాకుండా చిన్నారుల నామకరణ సమయంలో బియ్యంలో రాసే అక్షరాలను బట్టి కూడా ఆయన జాతకాలు చెబుతారనే పేరు సంపాదించు కున్నారు. ఆయన 79 సంవత్సరాల వయస్సులో రాజమండ్రిలో మరణించారు.

# నిజాం నిరంకుశంపై ఓరుగల్లు అంకుశం
## ఉమ్మడి జిల్లాలో అడుగడుగునా ఉద్యమ ఆనవాళ్ళు

వరంగల్ ఉమ్మడి జిల్లా అంటే పోరాటాల పురిటిగడ్డ. నాడు నిజాం పాలనకు, దేశ్ ముఖ్ లకు వ్యతిరేకంగా రణం పల్లెలున్నాయి. ఆ పోరులో ఎంతో మంది బలయ్యారు. ఉమ్మడి జిల్లాలోని ఖిలావరంగల్ కోట కడవెండి మొదలు.. దేవురుప్పుల, విస్నూరు, పెరుమాండ్ల సంకోస, పరకాల, మొగుళ్లపల్లి, నెల్లికుదురు, కొంకపాక, బయ్యారం గార్ల, బైరాన్ పల్లి ఇలా ఏ ఊరి చరిత్ర చూసినా అప్పటి నిజాం రజాకారుల ఆకృత్యాలకు వ్యతిరేకంగా పోరాడిన దశ్యాలే కనిపిస్తుంటాయి. ఏ గ్రామాన్ని కదిలించిన పోరాట యోధుల వీరత్వం అడుగడుగునా పలకరిస్తుంటాయి. ఆ ఉద్యమ చరిత్ర కలిగిన గ్రామాల్లో నేటికీ నాటి చెరగని జ్ఞాపకాలే తప్ప ఆనవాళ్లు లేవు. ఆ వీరులను స్మరించుకునేందుకు వారి జ్ఞాపకాలకు ఓ రూపాన్ని తీసుకొచ్చేందుకు పాలకులు, దాతలు ముందుకు రావాల్సిన అవసరం ఉందనేది వారి వారసుల ఆవేదన. రజాకారులను మురికించిన "పోరు" గల్లు 77 సంవత్సరాలకు పూర్వం నాటి హైదరాబాద్ సంస్థానంలోని తెలంగాణ ప్రాంత ప్రజల పరిస్థితి ఆనాటి పెద్దల ద్వారా తెలుసుకుంటే శరీరం గుగురు పొడుస్తుంది. ఈ సాయుధ రజాకారులు సాగించిన దురంతాలు, దోపిడీలు, గృహ దనాలు, స్త్రీల మానభంగాలు, యువకులను తుపాకులతో కాల్చి చంపడాలు వీరికి నిత్య కృత్యాలైనవి. స్వామి రామానంద తీర్థ నాయకత్వంలో ఏర్పడిన స్టేట్ కాంగ్రెస్ గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా సత్య గ్రహాల ద్వారా నిరసన ప్రకటించి తెరసాల పాలయ్యారు. మరికొందరు కాంగ్రెస్ నాయకులు నిజం స్టేట్ బోర్డర్ దాటిపోయి క్యాంపులు నిర్వహించి సాయుధ పోరాటాలతో నిజాం ఆస్తులకు నష్టం కలిగించే కార్యక్రమాలు చేపట్టారు. వీరిలో సర్దార్ జమలాపురం కేశవరావు, టి. హయగ్రీవ చారి, బొమ్మగంటి సత్యనారాయణ పాత్ర గణనీయమైనది. నిజం వ్యతిరేకతను ప్రదర్శించిన ఆర్య సమాజం పాత్ర ప్రశంసించ దగినది. అందులో నారాయణరావు పవర్ (వరంగల్), జగదీష్ ఆర్య (హైదరాబాద్), గండయ్య (రంగారెడ్డి జిల్లా) అగ్ర గన్యులు. నిజాం కారు వెళుతున్న దారిలో కాపుకాసి బాంబులు వేసినారు. కానీ ఈ ప్రయత్నం విఫలమవడంతో ఈ ముగ్గురిని అక్కడికక్కడే రాజ ద్రోహం నేరం కింద నిర్బంధించి చెరసాలకు పంపించారు. 1946లో కమ్యూనిస్టు పార్టీని, ఆంధ్ర మహాసభను నిజాం ప్రభుత్వం నిషేధించింది. దీంతో కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాటం చేపట్టింది. కమ్యూనిస్టు పోరాటం ఒక దిక్కు స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహం మరో దిక్కు. ఆర్య సమాజం ప్రజలలో స్వాతంత్ర్య పిపాసను ప్రజల్చడం ఇవన్నీ కలిసి నిజం పాలకులకు దడ పుట్టించింది. దీంతో నిజాం పోలీసుల సాయుధ రజాకార్ల హింసకాండ పెరిగిపోయింది. దీనికి ప్రతీకారంగా ఊరూరా సాయుధ దళాలు ఏర్పడ్డాయి. స్త్రీలు సైతం రోకలిబండలతో, కారంపొడితో తమ పాత్ర నిర్వహించారు. కమ్యూనిస్టులను నిషేధించటంతో సాహిద దళాలు అజ్ఞాతంలోకి వెళ్లి పోవడంతో గ్రామాలలో ముసలివారు, పిల్లలు, స్త్రీలు మాత్రమే మిగిలిపోయారు. సాయుధ దళాల ఆచూకీ తెలుపుమంటూ నిజాం పోలీసులు స్త్రీలను అనేక అత్యాచారాలకు గురి చేశారు. పోలీసులను ఎదిరించే వారు లేక రజాకారుల ఆగడాలకు అడ్డు లేకుండా పోయింది. వరంగల్ జిల్లాలోని చేర్యాల ప్రాంతంలోని మద్దూరు, ముస్త్యాలా, నిర్మల్, సలాక్ పూర్, వర్ధన్నపేట నియోజకవర్గంలో చౌటపల్లి, అన్నారం, కొండాపురం, కొలన్ పల్లి వందలాది గ్రామాలలో రజాకారుల దొరల భూస్వాముల చేతుల్లో సర్వం కోల్పోయిన మహిళలందరూ ఉన్నారు. వరంగల్ జిల్లా విసునూరు గ్రామానికి చెందిన దేశ్ముఖ్ రాపాక రామచంద్రారెడ్డి ఆగడాలు చెప్పవలసినవి కావు. అతనిని ఎదిరించిన వారి నిందరినో తన గుండాల ద్వారా హతమార్చినవాడు. విసునూరు గ్రామానికి చెందిన దొడ్డి కొమరయ్యను చంపించినాడు. పాలకుర్తికి చెందిన అయిలమ్మ, వెంపటి గ్రామానికి చెందిన చంద్రమ్మలను దేశ్ ముక్ నానా ఇబ్బందులకు గురి చేసినాడు. ఈ దేశ్ ముక్ కొడుకు బాబు రెడ్డి తన కంట్లో పడిన ఏ స్త్రీని వదిలిపెట్టలేదు. ఎందరో స్త్రీలను మానభంగాలకు గురిచేశాడు. ఈ బాపురెడ్డి లాంటి దొరలు వారి దాపదారులు హైదరాబాద్ సంస్థాన ప్రజలను హింసలకు గురి చేసినారు. వరంగల్లోని ఖిలా వరంగల్ లో రజాకార్ల నాయకుడు లకిడి మాస్టర్ నాయకత్వంలో రజాకార్లు చేస్తున్న దౌర్జన్యానికి ఎదురు నిలిచిన బత్తిని మొగిలయ్య పై సాయుధ రజాకార్ల దాడి చేయగా ఒంటరిగా పోరాడి అమరుడైనాడు. 1946 లో ఆయన హత్యకు ప్రతీకారంగా వరంగల్ నగరంలోని చైతన్యవంతులైన యువకులు ఇటికాల మధుసూదన్ రావు నాయకత్వంలో చెరుకు కాంతయ్య, భూపతి కృష్ణమూర్తి, మాచర్ల లింగయ్య, ఆరెల్లి బుచ్చయ్య, ఆడలా సత్యనారాయణ మొదలగువారు రజాకారుల దౌర్జన్యానికి వ్యతిరేకంగా పోరాటం చేశారు. జలియన్వాలా బాగ్ లాంటి దంతాలు తెలంగాణ ప్రాంతంలో అనేకం జరిగినవి. పరకాల, బైరాన్ పల్లి గ్రామాలలో ఎలాంటి హెచ్చరికలు లేకుండా సాయుధ పోలీసులు, రజాకార్లు ప్రవేశించి నిరాయుధులైన ప్రజలపై తుపాకీ కాల్పులు జరిపి సుమారు 100 మందిని పొట్టన పెట్టుకున్నారు. చౌటపల్లి లో 14 మంది అమాయక యువకులను కమ్యూనిస్టులని కట్టేసి కాల్చి చంపినారు. ఇలాంటి ఉదంతాలు హైదరాబాద్ సంస్థానంలో కోకొల్లలు. 1947 జులై 4 దొడ్డి కొమురయ్య త్యాగఫలం జనగామ తాలూకా దేవరుప్పులలోని కడవెండి కి చెందిన 18 ఏళ్ల యువకుడు దొడ్డి కొమరయ్య వీర మరణం చరిత్రగా నిలిచింది. రజాకార్లు పెరమరెడ్డి మోహన్ రెడ్డిని చంపాలని నిర్ణయించుకుని ఇళ్లపై రాళ్లు వేశారు. మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రజలు కర్రలతో నాలువేస్తున్న స్థలం వద్దకు బయలుదేరారు. ఆ దాడి వార్త ఊరంతా విస్తరించింది. ఇంట్లో భోజనం చేస్తున్నా దొడ్డి కొమరయ్య వెంటనే బయలుదేరి ఊరేగింపులో చేరారు. రజాకార్లు జరిపిన కాల్పుల్లో వీరమరణం పొందారు. ఆయన మరణం ఎంతో మందిని కలిచింది. ప్రస్తుత పరిస్థితి కడవెండిలో దొడ్డి కొమరయ్యకు సంబంధించి స్థూపం ఉంది. దేవురుకులలోను పదిమంది పేర్లతోనూ స్తూపం ఏర్పాటు చేశారు. 1947 సెప్టెంబర్ 2 పోరాటయోధుల గుర్తు అమర ద్వామం పరకాల లోని విశాల మైదానంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడానికి వేలాదిగా వివిధ గ్రామాల ప్రజలు చేరుకున్నారు. ఆ ప్రజలను చూసిన అప్పటి తాసిల్దార్ (ఎమ్మార్వో) నిజాం సిపాయిలకు ఖజానా కొల్లగొట్టడానికి వస్తున్నారనే సమాచారం అందించారు. దాంతో అప్పటి సర్కిల్ ఇన్స్పెక్టర్ జియా ఉల్లా కాల్పులు జరపడంతో క్షణాల్లో ఆ ప్రాంతం మరు భూమిగా మారింది. ఈ సంఘటనలో ఒకే చోట 13 మంది పోరాటయోధులు మృతి చెందారు. అమరుల జ్ఞాపకార్థం అక్కడ అమర ధామాన్ని మాజీ కేంద్రమంత్రి సిహెచ్ విద్యాసాగర్ రావు ఏర్పాటు చేశారు. దీనిని ప్రముఖ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి అమరధామం పక్కనే పిల్లల పార్కు ఉంటుంది. దీనిని అభివృద్ధి చేయాలి. 1947 సెప్టెంబర్ 12 చెట్టుకు కట్టేసి ముగ్గురిని కాల్చి చంపారు. భూపాలపల్లి జిల్లాలోని మొగుళ్లపల్లి, లక్ష్మీపురం, రంగాపురం గ్రామాలకు చెందిన పోలీస్ పటేల్ అమరుద్దీన్ ఆగడాలను భరించ లేని రంగాపురానికి చెందిన సూర్యుని సీతారామారావు, వల్లూరి బుచ్చి రామారావు, పైడిపల్లి గ్రామానికి చెందిన మనోహర్ రెడ్డి కలిసి అమరుద్దీన్ ను హత్య చేశారు. దానికి ప్రతీకారంగా రజాకారులు ఆ ఊరిపై దాడి చేశారు. ఆ ముగ్గురి ఆచూకీ చెప్పాలంటూ ప్రజలను చిత్రవధ చేశారు. ఎదురు తిరిగిన వర్ధిల్లు వీరయ్య, ఆకుతోట మల్లయ్య, ఎండి రాజ్ మహమ్మద్ ను చెట్టుకు కట్టేసి తుపాకితో కాల్చి చంపారు. ఇప్పటికీ మీరు పేర్లు పరకాలలో నిర్మించిన అమరధామం శిలాఫలకంలో ఉన్నాయి. ఆ గ్రామాల వారి ఆనవాళ్లు ఆనాటి గుర్తులు ఏమీ లేవు. 1948 జనవరి 5 దేశ్ ముఖ్ లకు వ్యతిరేకంగా ఒక్కటై బయ్యారం మండల ప్రజలు పోరాటం చేశారు. బండ్లకుంట ప్రాంతంలో నిజాం రాక్షస నూకల తుపాకీ గుండ్లకు బయ్యారం, బండ్లకుంట, కట్టుగూడెం, జిగ్న తండా, బాలాజీ పేటకు చెందిన 20 మంది బలయ్యారు. ఒకే చితిపై వారిని దహనం చేశారు. అమృత్వానికి ప్రత్యేకగా బయ్యారంలో 1969 ఏప్రిల్ 1న వారి పేర్లతో తెలంగాణలోనే తొలి అమరవీరుల స్థూపాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అది శిధిలావస్థకు చేరుకుంది. బయ్యారంలో స్మృతి వనం ఏర్పాటు చేసి వారి పేర్లతో రాతి స్తూపం ఏర్పాటు చేసేందుకు పాలకులు, దాతలు ముందుకు రావాలి. 1948 మార్చి 15 సామూహిక దహనం చేశారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలో కొంకపాక, చౌటపల్లి గ్రామాల్లో రజాకారులు చేసిన హత్యోదంతం నేటికీ మర్చిపోని ఘటన. కొంకపాక గ్రామంలో 15 మంది పక్కనే ఉన్న చౌటుపల్లి గ్రామంలో 32 మందిని దారుణంగా కత్తులతో పొడిచి చంపారు. మృతదేహాలను ఒకచోట వేసి గుర్రాలతో తొక్కించి సామూహిక దహనం చేశారు. కొంకపాక గ్రామంలో శాతని రంగయ్య, అల్వార్ తిరుపతయ్య, రాయబారి లక్ష్మీపతి, పిల్లమర్రి వెంకటేశం, జంగా శంకరయ్య, బోయినపల్లి ఎల్లయ్య, వెంకట్రామయ్య, పాకాల రామయ్య, ఎర్రం శెట్టి మల్లయ్య, రాచూరి దూడయ్య లు అమరులయ్యారు. కొంకపాకలో అమరుల పేర్లతో శిలాఫలకం ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది స్థానికులు నివాళులు అర్పిస్తున్నారు. చౌటపల్లి లో ఇంకా నిర్మించలేదు. ఈ రెండు గ్రామాల్లో పోరాట యోధుల సుందరకార్థం స్మృతి వనం ఏర్పాటు చేయాలి. వారి పేర్లతో ప్రాక్టీస్ స్తూపం ఏర్పాటు చేసేందుకు దాతలు ముందుకు రావాలి. 1948 సెప్టెంబర్ 2 నిచివేత ఉన్నచోట ఉద్యమం గుర్తుకొస్తుందని చెప్పడానికి పెరుమాండ్ల సంకీస గ్రామం ఉదాహరణ ప్రజలను చైతన్యపరచడంలో స్థానికుడైన తుమ్మ శేషయ్య దళనాయకుడిగా కీలకపాత్ర పోషించేవారు. ఆయన నేతృత్వంలోని దళాలేవి సమీపంలో లేకపోవడంతో రజాకారులు గ్రామాన్ని చుట్టుముట్టి నిరాయుదులైన గ్రామస్తులను నిర్బంధించారు. కొందరు యువకులను సమీపంలోని బందెలదొడ్డి వరకు తీసుకెళ్లి ఒంటి కాలిపై నిలబెట్టి తుపాకులతో కాల్చారు. కొందరు అక్కడికక్కడే మరణించగా మరికొందరు గాయపడ్డారు. వీరిని కూడా అక్కడొక గడ్డివాము పైకి విసిరి నిప్పంటించారు. ఈ ఘటనలో నాడు 16 మంది ప్రాణాలు కోల్పోయారు. 1994 మే 19న ఏర్పాటుచేసిన అమరవీరుల స్తూపం తప్ప ఎలాంటి ఆనవాళ్లు లేవు. 16 మంది అమరవీరుల జ్ఞాపకంగా దాతలు స్పందించి వారి స్మృతి వనం నిర్మించాలి. భవిష్యత్తు తరాలు ఈ యోధులను స్మరించుకుంటారు. డోర్నకల్ తెలంగాణ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య కొమురయ్యతో పాటు ఊరేగింపులో పాల్గొన్న వాలంటీర్లు జంపాల లింగయ్య, వేష పల్లి కొండయ్య, పైళ్ల యాదగిరి, లాల్లమారెడ్డి కొండల్ రెడ్డి పాలకుర్తిలో విసునూరు దేశ్ముక్ కు వ్యతిరేకంగా 1932 నుంచి 1942 వరకు పోరాడి అమరుడైన యువకుడు బందగి ఉమ్మడి జిల్లాలో అడుగడుగునా ఉద్యమ ఆనవాళ్లు.

**కొలనుపాక కుమారస్వామి 996370669 వరంగల్.**

## అమలాపురం విజయదశమి ఉత్సవ కమిటీల సమావేశం



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని స్థానిక వెంకటేశ్వర స్వామి దేవస్థానం నందు విజయదశమి ఉత్సవ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏడు వీధులు కొంకాపల్లి, మహిపాల వీధి, గండు వీధి, రవణం మల్లయ్య వీధి, రవణం వీధి, నల్లా వీధి, శ్రీరాంపురంలకు సంబంధించిన ఉత్సవ కమిటీ పెద్దలు పాల్గొని దసరా ఊరేగింపు 2 అక్టోబర్ 2025 గురువారం చేసుకొనుటకు కమిటీ సభ్యులు అందరూ నిర్ణయించుకున్నారు మరియు దసరా ఉత్సవాలకి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సమిష్టిగా ముందుకు తీసుకెళ్లే విధంగా అన్ని కమిటీల వారు సహకరించుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో పనసా బుజ్జీ, అబ్బిరెడ్డి సురేష్, తిక్కిరెడ్డి నేతాజీ ,చిక్కాల రాంబాబు, ఆశెట్టి ఆదిబాబు, మామిడిపల్లి రాము, గోకరకొండ బాల, రవణం చిట్టి, రవణం నరసింహారావు, సత్యరుషి తదితరులు పాల్గొన్నారు.

## పోస్టల్ సూపరింటెండెంట్ ను కలిసిన ఎఫ్ ఎన్ పి ఓ నూతన కార్యవర్గం..



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** అమలాపురం పోస్టల్ డివిజన్ లో ఎఫ్ ఎన్ పి ఓ నూతన కార్యవర్గం డివిజన్ సూపరింటెండెంట్ ఆర్ నవీన్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసారు. నేషనల్ యూనియన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ గ్రూప్ సి అమలాపురం డివిజన్ కార్యదర్శిగా ఎం ఏకాంబరం అధ్యక్షునిగా కె ఆచార్యులు, నేషనల్ యూనియన్ ఆఫ్ యూనియన్ ఆఫ్ పోస్టుమాన్ అండ్ ఎం టి ఎస్ కార్యదర్శిగా జి సతీష్, అధ్యక్షునిగా బి.వెంకటరత్నం, గ్రామీణ్ నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ్ డాక్ సేవక్ కార్యదర్శిగా వి వి మహాలక్ష్మి, అధ్యక్షునిగా భీమార్జునరావు తో పాటు పలువురు నూతన కార్యవర్గం ను ఎస్పీ ఆర్ నవీన్ కుమార్ అభినందించారు. పోస్టల్ ఉద్యోగులు సమస్యల కోసం యూనియన్ నిరంతరం పోరాటం చేస్తుందని కొత్త కార్యవర్గం హామీ ఇచ్చింది. పోస్టల్ ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా తెలిపిన వెంటనే తక్షణమే స్పందిస్తున్న డివిజన్ పోస్టల్ సూపర్డెంట్ ఆర్ నవీన్ కుమార్ కు యూనియన్ నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నూతనంగా ఏర్పడిన కొత్తపేట సబ్ డివిజన్ నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్స్ కొత్త బ్రాంచ్ ఏర్పాటు పై ఎస్పీ హర్షం వ్యక్తం చేసారు. నూతన కార్యదర్శి నీరజ కు ఎస్పీ అభినందనలు తెపారు.

## దక్షిణ మధ్య రైల్వే జోనల్ సమావేశంలో ఎంపీ హరీష్ బాలయోగి



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** సికింద్రాబాద్ లోని రైల్వే నిలయంలో ఏర్పాటు చేసిన 76 వ జోనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సమావేశంలో అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ బాలయోగి పాల్గొన్నారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కోటిపల్లి – నర్సాపురం రైల్వే పై ఉన్న కోర్టు కేసులు తొలగిపోవడంతో రైల్వే నిర్మాణానికి మార్గం సుగమం కావడంతో పనులలో వేగం పెంచాలని కోరారు.ఆయా పనులపై చర్చించి త్వరితగతిన గోదావరి నదులపై బ్రిడ్జి స్ట్రక్చర్ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే ద్వారపూడి రైల్వే స్టేషన్ వసతుల కల్పన కోసం సూచించిన విధంగా చర్యలు తీసుకుని ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. అదేవిధంగా రాజోలు పరిధిలోని దిండి వద్ద గోదావరి నదిలో వంగిన పిల్లర్ పై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.కోనసీమ ప్రయాణీకుల అవసరాల దృష్ట్యా అమలాపురం పట్టణంలో రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు కొరకు కోరిన చర్యలు వేగవంతం చేసే విధంగా ఆయా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ఎంపీ హరీష్ బాలయోగి కోరారు.

## బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ పుట్టినరోజు వేడుకలు

### వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు,కూటమి శ్రేణులు

**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నల్లా చారిటబుల్ ట్రస్ట్ అధినేత నల్లా పవన్ కుమార్ పుట్టిన రోజు వేడుకలు అమలాపురం లోని ఆయన నివాసం వద్ద బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన నివాసం వద్ద పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కిమ్స్ ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వాళ్లకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరం లో పలువురికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అమలాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకు 150 మందికి భోజనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఎమ్మెల్సీ పేరా బత్తుల రాజశేఖర్, ఉమెన్ కాండిడేట్ మాస్టర్ గోలి సంధ్య పాల్గొని ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభించి మరియు ఉచిత వైద్య శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా నల్లా పవన్ ను ఘనంగా శాలువా తో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి, రైతుల సంక్షేమం, యువతలో ఉత్తేజం కలిగించే దిశగా నల్లా పవన్ కృషి చేస్తున్నారన్నారు. పార్టీకి ఇలాంటి నాయకులు దక్కడం గర్వకారణం" అని అన్నారు. అలాగే, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై జన్మదిన వేడుకలను ఆనందంగా జరిపారు నల్లా పవన్ కి పుష్పగుచ్ఛాలు అందించి, దీర్ఘాయుష్షు,విజయవంతమైన రాజకీయ జీవితం కలగాలని ఆకాంక్షించారు. అనంతరం నిరు పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అతిథులకు నల్లా పవన్ మొక్కలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ ఏ అయితాబత్తుల ఆనందరావు, గన్నవరం ఎం ఎల్ ఏ గిడ్డి సత్యనారాయణ, కొత్తపేట ఎం ఎల్ ఏ బండారు సత్యనందరావు, అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మెట్ల రమణబాబు, టీడీపీ నాయకులు గంధం పల్లంరాజు, అమలాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ అధికారి జయలక్ష్మి, వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కంచిపల్లి అబ్బులు, వైసీపీ రాష్ట్ర నాయకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల



గణేష్, యాళ్ల సతీష్, ఛాంబర్ అధ్యక్షులు బోనం సత్తిబాబు, ప్రముఖ న్యాయవాదులు నల్లా ప్రభాకర్ రావు, నల్లా సురేష్, మాకిరెడ్డి మనోజ్, బీజేపీ జిల్లా శ్రేణులు, కుటుంబ సభ్యులు నల్లా విష్ణు మూర్తి, నల్లా అజయ్, నల్లా సంజయ్, అరిగెల నాని, గోకరకొండ గంగన్న స్వామి, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, బీజేపీ పార్టీ జిల్లా నేతలు, రాష్ట్ర నేతలు, జనసేన పార్టీ నేతలు, టీడీపీ పార్టీ నేతలు, వైసీపీ నేతలు, కిరాణా అస్సోసియాషన్ ప్రెసిడెంట్, సెక్రటరీలు,అన్ని పార్టీలలో ఉన్న అభిమానులు, బంధువులు పెద్ద ఎత్తున పాల్గొని ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

## అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రారంభం

**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో నూతన ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బుధవారం ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక శాసన సభ్యులు అయితాబత్తుల ఆనంద రావు లాంఛనముగా ప్రారంభించారు. డి ఎన్ శెట్టి,డి వి రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒక భవనం ను తాత్కాలికంగా తీసుకొని ఒక ఆఫీసు రూమ్ ను, ఒక కంప్యూటర్ లాబ్ ను, మూడు క్లాస్ రూమ్స్ ను శాసన సభ్యులు ఆనంద రావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

కళాశాల అధ్యాపకులు డా ఏం. బాల స్వామి ఆహ్వానం పలుకగా కళాశాల ప్రిన్సిపాల్ డా వి నరసింహ స్వామి అధ్యక్షత వహించిన సభలో ప్రస్తుతం ఈ కళాశాల లో మూడు డిగ్రీ కోర్సులు ఉన్నాయని, అడ్మిషన్స్ ప్రారంభమయ్యాయని, వచ్చే విద్యా సంవత్సరం నుండి మరో మూడు కోర్సులు వస్తాయని, అనుభవం గల అధ్యాపకులు ఈ కళాశాలలో బోధిస్తున్నారని ప్రిన్సిపాల్ నరసింహ స్వామి చెప్పారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన అయితాబత్తుల ఆనంద రావు మాట్లాడుతూ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తో ఈ ప్రాంత సమస్యలు వివరించి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అవసరం ఎంతైనా ఉందని చెప్పినపుడు వెంటనే ఎ టి ఆర్ రిపోర్ట్ సమర్పించి కార్యరూపం దాల్చడానికి తోడ్పడ్డారని చెప్పారు. ప్రస్తుతం పేరూరు కౌశిక వంతెన సమీపం హైవే రోడ్ ప్రక్కన స్థలం సేకరించామని, రెండు కోట్ల రూపాయల నిధులు కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ సహకారం తో తదితర చమురు సంస్థల నుండి సేకరించామని తెలిపారు. త్వరలోనే భవనాలకు శంకుస్థాపన చేసి వచ్చే విద్యా సంవత్సరానికి పక్కా తరగతి గదులు అందిస్తామని చెప్పారు. డి సీ ఎం ఎస్ చైర్మన్ మాట్లాడుతూ పేరూరు లో ప్రారంభించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల కు అన్ని విధాలుగా సహకారం అందిస్తామని చెప్పారు. ట్రేడ్



అండ్ కామర్స్ సభ్యులు కల్వకొలను తాతాజీ మాట్లాడుతూ ఎంతో కాలం తర్వాత ఈ ప్రాంతానికి మొదటి సారిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు కావడం పేద మధ్య తరగతి విద్యార్థులు తక్కువ ఫీజు తో నాణ్యమైన విద్య పొందటానికి అవకాశం వచ్చినందుకు ఆనందరావు కు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణ బాబు, మార్కెటింగ్ కమిటీ చైర్పెర్సన్ అధికారి జయలక్ష్మి, పేరూరు గ్రామ సర్పంచ్ దాసరి అరుణా డేవిడ్, స్థల దాతలు దొమ్మేటి శ్యామ్ ప్రకాష్, బొర్రా ఈశ్వర రావు, మంతా ఫణి కుమార్, పేరూరు ఎమ్ పి టి సి సబ్యులు, హెచ్ ఎమ్ ఎన్. విజయ కుమారి, వైస్ ప్రిన్సిపాల్ పీ కరుణశ్రీ, అధ్యాపకులు డా. ఏం బాల స్వామి, డా బి ఆశీష్ బాబు, పి శేఖర్, సీనియర్ అసిస్టెంట్ తోట మురళీ కృష్ణ, కరుణ, దుర్గా ప్రసాద్, శివ ప్రసాద్, రాంబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు

## రూ.1.89 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి సుభాష్





**రామచంద్రపురం విశ్వం వాయిస్ న్యూస్ సెప్టెంబర్ 03 :-** రాష్ట్రంలో ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం నిధులు వెచ్చించి విశేషంగా కృషి చేస్తుందని,తద్వారా ప్రజల ఆరోగ్యం కాపాడటంతో పాటు పట్టణాలు, గ్రామాలు మరింత సుందరంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. రామచంద్రపురం పట్టణంలో 20 అభివృద్ధి పనులకు గాను మంజూరైన రూ.1.89 కోట్లతో రోడ్లు,డ్రైన్లు,పైప్ లైన్లు తదితర అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కమిషనర్ కెవిఆర్ రాజు, వైస్ చైర్మన్ శివాజీ, వాసంశెట్టి సత్యం, మున్సిపల్ అధికారులతో కలిసి శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణాల్లో ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయంగా పేర్కొన్నారు.కూటమి ఏడాది పాలనలో సుమారు రూ.1200 కోట్లు వెచ్చించి గుంతలు లేని రోడ్లు నిర్మించామన్నారు. అలాగే మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం,ఆర్ అండ్ బి,పంచాయతీరాజ్ నిధుల ద్వారా రామచంద్రపురం నియోజవర్గంలో కోట్లాది రూపాయలతో రోడ్లు నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు.గత ప్రభుత్వ హయాంలో రోడ్లన్నీ దీనావస్థకు చేరుకున్నాయని, అభివృద్ధి,సంక్షేమం ఊసే లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులను అధిగమించి అభివృద్ధికి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. రామచంద్రపురం నియోజవర్గ చరిత్రలో ముందెన్నడూ లేని విధంగా ఏడాది కాలంలోనే రూ.125 కోట్లు నిధులు తీసుకొచ్చి పలు అభివృద్ధి పనులు చేశామని వివరించారు.భవిష్యత్తులో మరిన్ని నిధులు తీసుకొచ్చి ప్రణాళిక బద్ధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని మంత్రి సుభాష్ హామీ ఇచ్చారు. ఒక్క రామచంద్రపురం పట్టణంలోనే సుమారు 5 కోట్లతో రోడ్లు,డ్రైన్లు, పైపులైన్లు,త్రాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. అభివృద్ధి నిరంతర ప్రక్రియగా సాగిస్తామన్నారు. వాసంశెట్టి సత్యం,చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి లు మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి సుభాష్ చేస్తున్న కృషి పట్ల కృతజ్ఞతలు తెలిపారు.ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతూ రామచంద్రపురం నియోజకవర్గాన్ని అన్ని విభాగాల్లో ముందుకు తీసుకెళుతున్నారని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శివాజీ,ఎస్ కే పి పి ట్రస్ట్ చైర్మన్ సలాది నాయుడు మాస్టర్, మున్సిపల్ డి ఈ శ్రీకాంత్, ఏఈలు సునీల్,ప్రభాకర్, కూటమి పార్టీ నాయకులు గరికపాటి సూర్యనారాయణ,అంకం శ్రీనివాస్,కడియాల రాఘవన్,కవల నానాజీ, చందమామ వాసు, మేడిశెట్టి సూర్యనారాయణ, కొమ్మన వీర్రాజు,ఫణి తేజ, ఆయా వార్డుల కౌన్సిలర్లు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పలువురికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల పురస్కారాలు

**అంబాజీపేట విశ్వం వాయిస్ న్యూస్** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలంలో పలువురుకి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకోనున్నారు. వుబలంక గ్రామానికి చెందిన అన్నా మినిస్ట్రీస్ , పి .గన్నవరం కు చెందిన మమతా స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో నేడు నియోజకవర్గస్థాయిలో పి.గన్న వరంలో నిర్వహించు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు అంబా జీపేట మండలం నుండి పి రామకుమారి స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ జడ్పీ హై స్కూల్ అంబాజీపేట బీడీ రవికుమార్ స్కూల్ అసిస్టెంట్ జడ్పీహెచ్ఎస్ ఇసుకపూడి జి హేమ మల్లేశ్వరి ఎస్జీటీ జక్కం శెట్టి వారి పాలెం డి సుధాదేవి ఎస్ జి టి ముక్కామల వై నాగలక్ష్మి , ఎస్జీటీ వాకలగరువు ఎంపికయ్యాలని ఒక ప్రకటనలో తెలిపారు వీరికి న 4 తేదీన పి .గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చేతుల మీదుగా సన్మానం అందుకోనున్నారు. ఈ సందర్భంగా వీరికి మండల విద్యాశాఖ అధికారులు , మండల యూటీఎఫ్ శాఖ అభినందనలు తెలియజేశారు.


## కాకినాడ జిల్లాలో విలీనం కోసం జె.ఏ.సీ ఆధ్వర్యంలో ప్రభాత వాకింగ్ యాత్ర






**రామచంద్రపురం నియోజకవర్గం విశ్వం వాయిస్ న్యూస్ సెప్టెంబర్ 03 :-** రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల పక్ష జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ప్రభాత వాకింగ్ యాత్ర జరిగింది. కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా మైదానంలో ప్రారంభమైన ఈ యాత్రలో యోగ వాకర్స్,స్థానిక ప్రజలు, వివిధ రాజకీయ, సామాజిక సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జె.ఏ.సీ కన్వీనర్ మాగాపు అమ్మిరాజు,కో–కన్వీనర్ బి.సిద్దూ,సీనియర్ న్యాయవాది దొమ్మలపాటి సత్యనారాయణ, జనసేన పట్టణ అధ్యక్షులు గొల్లపల్లి కృష్ణ,పాస్టర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విక్టర్ నంద, కౌన్సిలర్లు అంకం శ్రీను, పి.మధు,కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఆర్.డి.ఖాన్, తదితరులు నేతృత్వం వహించారు.వారు మాట్లాడుతూ అమలాపురం జిల్లా కేంద్రం రామచంద్రపురం నుండి 60 కి.మీ.దూరంలో ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వరదల సమయంలో రవాణా కష్టతరం అవుతోందని, పత్రాలు,సర్టిఫికెట్లు పొందడంలో రోజులు వృథా అవుతున్నాయని తెలిపారు.కాకినాడ జిల్లా కేంద్రం కేవలం 25 కి.మీ. దూరంలో ఉండి అన్ని వనరులు అందుబాటులో ఉన్నాయని గుర్తు చేశారు.2022%–%23 జిల్లాల పునర్విభజనలో ప్రజాభిప్రాయాన్ని పట్టించుకోకుండా రామచంద్రపురాన్ని కోనసీమ జిల్లాలో చేర్చడం ఘోర తప్పిదమని నేతలు విమర్శించారు. ప్రభుత్వం వెంటనే రామచంద్రపురాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మందపల్లి చిట్టిబాబు, యోగ వాకర్ సభ్యులు కె.చంద్ర శేఖర్, గిరి పరశువేది బాబ్జి,టీ.వీ 5 దుర్గా రావు,99 టీవీ బాబు,పుల్లయ్య,కట్టా శేఖర్,కలిదండి కిరణ్,నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఎరుపల్లి గ్రామ ప్రెసిడెంట్ బాధ్యతలు చేపట్టిన వైస్ ప్రెసిడెంట్



**రామచంద్రపురం మండలం విశ్వం వాయిస్ న్యూస్ సెప్టెంబర్ 03 :-** రామచంద్రపురం మండలం ఎరుపల్లి గ్రామంలో ఇటీవల గ్రామ సర్పంచ్ మల్లెమొగ్గల శ్రీధర్ మరణించిన విషయం తెలిసిందే.అయితే ఈ గ్రామానికి తదుపరి ప్రెసిడెంట్ గా చర్యలు చేపట్టడానికి వైస్ ప్రెసిడెంట్ అయిన పెద్దిరెడ్డి వెంకన్న బాబుకి బాధ్యతలు చేపట్టుటకు జిల్లా పంచాయతీ అధికారి వారు ఉత్తర్వులు మేరకు ఉన్నారు గ్రామ పంచాయతీ కార్యాలయం నందు గ్రామ పంచాయతీ కార్యదర్శి సర్పంచ్ తో ప్రమాణ స్వీకారం చేయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎక్స్ సర్పంచ్ సాక్షి వేణుగోపాలకృష్ణ,చిల్లా గోపాలకృష్ణ,ఎంపీటీసీ సభ్యులు సాక్షి శివ కృష్ణ, రెడ్డి గోవిందు,పల్ల ఆదినారాయణ కూటమి ప్రభుత్వ నాయకులు పంచాయతీ సచివాలయ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఈ నెల 7న భీమేశ్వర స్వామి వారి ఆలయం మూసివేత



**రామచంద్రపురం మండలం విశ్వం వాయిస్ న్యూస్ సెప్టెంబర్ 03** :-భాద్రపద పౌర్ణమి రోజున రాహు గ్రస్త సంపూర్ణ చంద్ర గ్రహణం సందర్బంగా ఈ నెల 7న అనగా ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు నివేదన పూర్తిచేసి దేవాలయం మూసివేయబడుతుంది. అనంతరం సోమవారం ఉదయం పుణ్యాహవచనది కార్యక్రమాలు పూర్తి చేసి ఉదయం 07:30 నిమషాలుకి తిరిగి సర్వదర్శనాలకు అనుమతించి,దేవాలయం తెరవబడును భక్తులు గమనించి తమ సహాయ సహకారాలు అందించాలని కోరుతున్నామని దేవాలయ సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వాహణాధికారిని అల్లు వెంకట భవాని కోరారు.

## జూహిత ఉన్నతికి అన్ని విధాలా సహకరిస్తాం

**ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**

**భవాని చారిటబుల్ ట్రస్ట్ తరపున 25 వేల రూపాయలు ఆర్థిక సాయం**

**ఒలింపిక్స్ లో పతకం సాధించడమే నా లక్ష్యం : జూహిత గుణ**



**రాజమహేంద్రవరం , విశ్వంవాయిస్ న్యూస్:** ఇటీవల అహ్మదాబాద్ లో జరిగిన కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ లో స్వర్ణ పతకం సాధించిన జూహిత గుణ ఉన్నతికి తాము అన్ని విధాలుగా సహకారం అందిస్తామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక లాలా చెరువు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో చదువుతున్న జూహిత గుణ ఇటీవల అహ్మదాబాద్ లో జరిగిన కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ లో స్వర్ణ పతకం సాధించిన సంగతి విధితమే. బుధవారం ఉదయం ఆమె నగరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులు ఘన స్వాగతం ఏర్పాటు చేశారు. రైల్వే స్టేషన్ నుంచి పాఠశాల వరకు ఘనంగా ఊరేగింపు గా తీసుకొచ్చారు. పాఠశాల వద్ద సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ జూహిత గుణను ప్రత్యేకంగా అభినందించారు. మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో చదువుతూ జాతీయ స్థాయికి నగర ఖ్యాతిని తీసుకు వెళ్లిన జహీత గుణ అభినందనీయురాలని శ్రీనివాస్ అన్నారు. ఆమె కృషికి తల్లిదండ్రుల తోడ్పాటు ఎంతైనాఅభినందనీయమన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయిని, ఉపాధ్యాయుల యొక్క ప్రోత్సాహం కూడా విలువైనదని, ఈ రోజుల్లో నైపుణ్యం తో పాటు ప్రోత్సాహం లేనిదే ఎవరూ రాణించలేరు అన్నారు. జూహిత తల్లి పార్వతి సచివాలయం మహిళా పోలీసు గాను, తండ్రి దేవి ప్రసాద్ ప్రైవేట్ గాను ఉద్యోగం చేస్తున్నారు. జుహీత కు తాను తన వంతు గా ఎప్పటికీ ప్రోత్సహిస్తూ ఉంటానని,తమ భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 25 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందచేస్తున్నట్టు ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రకటించారు. త్వరలో విద్యాశాఖ మంత్రి నగర పర్యటనకు రానున్నారని ఆ సందర్భంగా జుహీతా ను వారికి పరిచయం చేయనున్నట్లు ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం పదివేల రూపాయలు బహుమతి ప్రకటించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాశీ నవీన్ కుమార్,ప్రెస్ క్లబ్ పెద్దలు కుడుపూడి పార్థసారథి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యు విజయలక్ష్మి, ఎస్ఎంసి చైర్మన్ కందికొండ రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ బాటిళ్ల సేకరణకు ఐరన్ బాటిల్



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** నగరంలోని ప్లాస్టిక్ బాటిళ్లు సేకరించేందుకు నగర పాలక సంస్థ శ్రీకారం చుట్టింది. దాని కోసం నమూనాగా ఒక పెద్ద ఐరన్ బాటిల్ను తయారు చేయించి నగర పాలక సంస్థ ఆవరణలో ఏర్పాటు చేసింది. దానిని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పరిశీలించి పలు సూచనలు చేశారు. నగరంలో ప్రధాన కూడళ్లు, పార్కులు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు చేసి నగరంలో ప్లాస్టిక్ నివారణకు కృషి చేయాలన్నారు. రానున్న పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని నగరాభివృద్ధి, నగరం నిత్యం పరిశుభ్రంగా ఉండేందుకు ఇటువంటి వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని సూచించారు. ప్రజలు కూడా నగరాభివృద్ధి, పారిశుద్ధ్యం విషయంలో సహకరించాలని కోరారు. తెలుగుదేశం పార్టీ నాయకులు కాశీ నవీన్ కుమార్, నక్కా చిట్టిబాబు, బుడ్డిగ రాధా, బుడ్డిగ రవి తదితరులు ఆయన వెంట ఉన్నారు.

## పొలిటికల్ సైన్స్ విభాగంపై అపోహలు వద్దు



**రాజానగరం, విశ్వం వాయిస్ న్యూస్:** ఆదికవి నన్నయ యూనివర్సిటీ రాజమహేంద్రవరం మెయిన్ క్యాంపస్ లో కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ లోని పొలిటికల్ సైన్స్ విభాగం మూసి వేస్తారంటూ జరుగుతున్న ప్రచారం అవాస్తమని, పొలిటికల్ సైన్స్ విభాగం యధావిధిగా కొనసాగుతుందని రిజిస్ట్రార్ ఆచార్య కె.విస్వామి తెలిపారు. బుధవారం యూనివర్సిటీలో దీనికి సంబంధించి ఒక ప్రకటనను ఆయన విడుదల చేశారు.ఆదికవి నన్నయ యూనివర్సి టీలో పొలిటికల్ సైన్స్ విభాగం మూసివేస్తారంటూ,తరలిస్తారంటూ జరుగుతున్న ప్రచారం అవాస్తవమని అన్నారు. పొలిటికల్ సైన్స్ విభాగంలోని కొన్ని అంతర్గత సమస్యల కారణంగా ముందుగా 2025-26విద్యా సంవత్సరానికి అడ్మిషన్స్ తాత్కాలికంగా ఆపివేయడానికి ఒక ప్రతిపాదన చేసినప్పటికీ, తరువాత విద్యార్థుల అభ్యర్థనల మేరకు విభాగాన్ని యధావిధిగా కొనసాగించేందుకు నిర్ణయించుకున్నామన్నారు.విశ్వ విద్యాలయం విద్యార్థులకు అధిక ప్రాధాన్యతి స్తుందని,వారి శ్రేయస్సు కోసం పని చేస్తుందన్నారు.

# బాలిక ప్రాణం తీసిన ప్రేమ వ్యవహారం ...!



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** బుద్దిగా చదువుకుని ప్రయోజకులు కావాల్సిన జీవిత లక్ష్యాన్ని విస్మరించిన కొందరు యువజనులు ప్రేమ వ్యవహారం బారిన పడి ప్రాణాలు పోగొట్టు కుంటున్నారు. ఇటు తల్లిదండ్రులకు కడుపుకోతను, అటు విద్యా సంస్థలకు మాయని మచ్చలాంటి చెడ్డ పేరును మిగులుస్తున్నారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం మండల కేంద్రం శంఖవరంలోని ఓ విద్యా సంస్థలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతున్న యువతి (16) ప్రేమ వ్యవహారం వెలుగు చూసి తల్లి, దండ్రులు మందలించడంతో బలవంతపు మరణానికి తెగించింది. రోజూ రహస్యంగా చరవాణీని వెంట బెట్టుకుని కళాశాలకు వస్తున్న నేపథ్యంలో గమనించిన విద్యా సంస్థ ప్రిన్స్ పాల్ ఇకపై తీసుకుని రావద్దని రెండు సార్లు ఆ విద్యార్థిని హెచ్చరించారు. అయినా ఆమె ఫోన్ విడిచి పెట్టకుండా వెంటబెట్టుకొని రావడంతో ఇక లాభం లేదనుకుని ఫోన్ స్వాధీనం చేసుకుని పరిశీలించారు. ఫలితంగా ప్రేమ వ్యవహారం తోపాటు, ఉండకూడని చిత్ర, దృశ్యాలు ఆ చరవాణీలో ఉన్నట్టు గుర్తించారు. దీంతో ఆ యువతీ, యువకుల తల్లిదండ్రులను కళాశాలకు రప్పించి విషయాన్ని వారి దృష్టిలో ఉంచి, పరిష్కారాన్ని కూడా ఇరుపక్షాల తల్లి తండ్రులకే విడిచి పెట్టారు. ఫలితంగా బాలికను తల్లిదండ్రులు ఇంటి వద్ద మందలించారు. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన ఆమె మంగళవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లి, దండ్రుల మందలింపు ఫలితంగానే వారి కుమార్తె బలవన్మరణానికి పాల్పడినట్టు అన్నవరం పోలీసు స్టేషన్ అదనపు ఎస్సై ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువ ప్రేమికుల ఇరు కుటుంబాల మధ్య పరిష్కార సదవగాహన కుదిరి పరస్పరం సమాధాన పడినట్టు వినికిడి.

## ఎమ్మెల్యే గొల్లపల్లి అశోక్‌ను కలిసిన నూతన ఎస్పీ వరదరాజన్



**యానాం, విశ్వంవాయిస్:** యానాం నూతన సూపర్నిడెంట్ ఆఫ్ పోలిస్ గా బాధ్యతలు స్వీకరించిన వరదరాజన్ బుధవారం స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ను మర్యాదపూర్వకంగా కలసి దుస్సాలివాతో సత్కరించారు. అనంతరం ఎస్పీ నీ ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సత్కరించి , యానం లో శాంతి భద్రతలు కి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ముఖ్యంగా గంజాయి విక్రయం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశాలు జారీచేశారు. అదేవిదంగా ఇతర ప్రాంతాల నుండి యానం వచ్చిన పర్యాటకులను ఇబ్బందులు పడకుండా చూడాలని తెలిపారు. వాహనాలమీద వేగంగా వెళ్ళే యువకులను నియంత్రించాలని ఆదేశాలు జారీచేశారు. సమావేశంలో సి ఐ అడలర్షన్ ఎస్ ఐ. పునీత్ రాజ్ , ఇళంగో పాల్గొన్నారు.

# నేత్రదానం మనందరికి ఆదర్శం కావాలి




**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్** నేత్రదానం చేయాలని, నేత్రదానం మనందరికి ఆదర్శం కావాలని డాక్టర్ శెట్టిబత్తుల శ్రీరామ కుమార్ పిలుపును ఇచ్చారు. జాతీయ అంధత్వ నివారణ, దృష్టి లోప నివారణ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆగష్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వ తేదీ వరకు 40 వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను నిర్వహిస్తు న్నట్టు ఆయన పేర్కొన్నారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజక వర్గంలోని మండల కేంద్రం శంఖవరంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేత్రదానం జన ప్రచారాన్ని ఆస్పత్రి ప్రధాన వైద్యులు రాజీవ్ కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన "విశ్వం వాయిస్" మీడియాతో మాట్లాడారు. మన ఎవరి కళ్ళూ నశించి పోడకూడదు. అంధుల చూపు కొరకు మరణానంతరం మన కళ్ళను మనం దానం చేయాలి. ఒకరు నేత్ర దానం చేయడం ద్వారా మరో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించ వచ్చని ఆయన పేర్కొన్నారు. మరణానంతరం 6-8 గరాల వ్యవధిలో నేత్రాలను దానం చేయాలి. నేత్ర దానాన్ని కుటుంబ సాంప్రదాయం గా, పవిత్రమైన భాధ్యతగా పాటించాలని సూచించారు. నేత్రాలను ఎలా దానం చేయాలనే వివరాల కోసం దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, ప్రభుత్వ ఆస్పత్రులను, వైద్య కళాశాలలను, ఎస్.వి.ఓ ఆసుపత్రులను, ఐ బ్యాంకులను సంప్రదించాలని రాజీవ్ కోరారు. కంటి బ్యాంకులోని వెయిటింగ్ లిస్ట్ ప్రకారం అవసరమున్న రోగికి కబురు పెట్టి, అత్యవసర కేసుల్లో నిర్ణీత నిబంధనల ప్రకారం చర్య తీసుకుంటారని, దానం చేసిన నేత్రాలను ఎన్నడూ అమ్మరని స్పష్టం చేశారు. కార్నియా పొందిన వ్యక్తి పేరు ఎల్లప్పుడు రహస్యంగా ఉంచుతారు. అయితే, నేత్రదానం చేసిన కుటుంబం వారు ఈ కళ్ళని, కంటి చూపులేని ఇద్దరు వ్యక్తులకు నేత్ర జ్యోతిని వెలిగించేందుకు వినియోగించారని తెలుసుకొని మరింత సంతోషించాలి. దురదృష్టవశాత్తు, మీకు చాలా దగ్గర వ్యక్తి, లేదా పరిచయస్థులు ఎవరైన మరణిస్తే, వెంటనే అతి దగ్గరలోని కంటి బ్యాంక్ కి ఫోన్ చేయండి. మీ దగ్గర బంధువులను, మిత్రులను నేత్రదానం చేయునట్లు ఒప్పించాలని, మీ చుట్టు ప్రక్కల ఎవరైనా వ్యక్తి చనిపోతే ఆ వ్యక్తి కుటుంబ సభ్యులను నేత్రదానం చేయునట్లు ప్రోత్సహించండని శ్రీరామ్ రాజీవ్ కుమార్ పిలుపును ఇచ్చారు. ప్రతీ పౌరుడూ నేత్రదానం గురించి, ప్రతి వీధిలో, ప్రతి ఊరిలో, ప్రతి సమాజ సంక్షేమ సమితిలో అన్ని విధాలా ప్రచారం చేయాలని. మీరు దీని గురించి ప్రజలకు చెప్పడం వల్ల ఈ ఉద్యమానికి మద్దతు లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. కంటి బ్యాంక్ మిత్రులు అవ్వండి, తరచు కంటి బ్యాంక్ కార్యకలాపాలలో పాల్గొనండి. సెప్టెంబర్ 8 వరకూ జరిగే నేత్రదానం పక్షోత్సవాల నిర్వహణలో సహకరించమని శంఖవరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యులు శెట్టిబత్తుల శ్రీరామ్ రాజీవ్ కుమార్ పిలుపును ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ద్వితీయ వైద్యులు మోహన్ సాయిరెడ్డి, ఆస్పత్రి సిబ్బంది, బడి విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజ్యసభ సభ్యులు సానాసతీష్ కార్యాలయంలో వినాయక చవితి వేడుకల్లో లలిత సహస్ర పారాయణం



**సామర్లకోట, విశ్వంవాయిస్:** కాకినాడ జిల్లా సామర్లకోట మండలం కొప్పవరం గ్రామంలోని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కార్యాలయంలో జరుగుతున్న వినాయక చవితి వేడుకల్లో భాగంగా బుధవారం ఉదయం నీలాద్రి భజన మండలి ఆధ్వర్యంలో లలిత సహస్ర పారాయణం నిర్వహించారు. కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయక పందిరిలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్యాలయ ఇన్‌చార్జ్ మేకా లక్ష్మణ్ మూర్తి ఆధ్వర్యంలో, నాయకులు అరిగెల శ్రీనివాసరావు బున్నీ పర్యవేక్షణలో, నీలాద్రి భజన మండలి సభ్యులు పారాయణంలో పాల్గొన్నారు. పారాయణంలో పాల్గొన్న భజన మండలి సభ్యులకు మేకా లక్ష్మణమూర్తి, అరిగెల శ్రీనివాసరావు బున్నీలు తాంబూల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కోటిపల్లి సతీష్, చింతపల్లి అర్జున్, జిన్నూరి బాబ్జి, జెడ్.ఆర్ యు సి సి సభ్యులు సిముత్యాల అనిల్, సంగాడి బంగారు రాజు బ్రదర్స్, బర్ల శ్రీనివాసు, బండి నరేంద్ర, కాకరపల్లి చలపతిరావు, అంకమ్మ రెడ్డి రామానాయుడు, ఐ. టిడిపి సతీష్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సమస్యలపై వీధి వ్యాపారులతో సమీక్ష

**రామచంద్రపురం విశ్వం వాయిస్ న్యూస్ సెప్టెంబర్ 03** :-రామచంద్రపురం మున్సిపల్ పరిధి పట్టణంలో ట్రాఫిక్ సమస్యలపై తోపుడు బండ్లు వ్యాపారులతోనూ వివిధ శాఖలు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్అండ్ బి,మున్సిపల్ సానిటరీ తదితర అధికారులతో రామచంద్రపురం మున్సిపల్ సమావేశ మందిరంలో వాసంశెట్టి సత్యం ఆధ్వర్యంలో డీఎస్పీ రఘువీర్,మున్సిపల్ కమిషనర్ రాజు, సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటనారాయణ,ఎస్సై నాగేశ్వరరావు తదితరులతో వీధి వ్యాపారులు తోపుడు బండ్లు డ్రైను అవతల వ్యాపారాలు నిర్వహించుకుని, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసు అధికారులు ప్రత్యేక సూచనలు చేశారు.

## అంబేద్కర్ కోనసీమ జిల్లా .... కొత్తపేట నియోజకవర్గం ఈతకోట బాధితులను బండారు శ్రీనివాస్ పరామర్శ




**విశ్వం వాయిస్ న్యూస్ రావులపాలెం** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి.రావులపాలెం మండలం ఈతకోట గ్రామంలో కొందరు యువకుల ఆకతాయి అల్లరితో స్కూల్ నుండి వస్తున్న చిన్నారి గాయపడింది. చిన్నారిని తక్షణమే కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ ఆసుపత్రికి వెళ్లి చిన్నారిని పరామర్శించారు. చిన్నారి కుటుంబానికి ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను ఆదేశించారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా బండారు శ్రీనివాస్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు నియోజకవర్గం వ్యాప్తంగా అభిమానులు ఘనంగా నిర్వహించారని అన్నారు.ఈతకోటలో జరిగిన ఆకతాయి అల్లర్లు బాధాకరమని విచారం వ్యక్తం చేశారు.మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఈ ఘటనకు రాజకీయ రంగు పులమడం తగదని మండిపడ్డారు.కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలకు వస్తున్న ఆదరణను జీర్ణించుకోలేక... పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలను మచ్చ తెచ్చే విధంగా ప్రయత్నం కమలహాసన్ నటనతో ఆరోపణలు చేస్తున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు.

## ఈతకోట ఘటనలో బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**అభిమానం హద్దు దాటరాదు.... నిందితులపై కఠినచర్యలు.... శాంతిభద్రతపై రాజీలేదు.....**



**విశ్వం వాయిస్ న్యూస్ రావులపాలెం** మంగళవారం ఈతకోటలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా జరిగిన సంఘటనలో బాధితులైన వారిని బుధవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పరామర్శించి ఈ ఘటనలో గాయపడిన చిన్నారిని హాస్పిటల్ లో మరో ఇరువురు బాధితులను ఈతకోట ఆయన పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ జరిగిన సంఘటనను తాను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. నటులపై అభిమానులు చూపించే అభిమానమనేది సమాజంలో ఆ నటులపై గౌరవాన్ని పెంచేలా ఉండాలన్నారు. సేవా కార్యక్రమాలతో సమాజంలో అభిమాననటుల గౌరవాన్ని పెంచాలి తప్ప, ఇటువంటి దుశ్చర్యలతో వారిపై గౌరవాన్ని తగ్గించేలా ప్రవర్తించకూడదని వ్యాఖ్యానించారు. అభిమానం పేరుతో కొంతమంది ఆకతాయి పనులు చేస్తే ఆ సంఘటనలతో మొత్తం అభిమానులందరికీ చెడ్డ పేరు వచ్చే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. ఇటువంటి సంఘటనలను ఎవరూ ప్రోత్సహించరాదన్నారు. ఘటనకు పాల్పడిన ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శాంతి భద్రతలకు ఏ పేరుతో విఘాతం కలిగించిన చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు.కొందరు చేసిన ఇటువంటి చర్యలకు పవన్ కళ్యాణ్ గారిని నాయకులను అపారధించడం సరికాదన్నారు.

## గణపతి నవరాత్రి ఎనిమిదవ రోజు సాంస్కృతిక కార్యక్రమాలు




**విశ్వం వాయిస్ న్యూస్ రావులపాలెం** మండల కేంద్రమైన స్థానిక రావులపాలెంలో భద్ర మహంకాళి అమ్మ వారి రోడ్డులో భక్తులచే నిర్వహిస్తున్న వినాయకుని మండపంలో ఈరోజు గణపతి నవరాత్రి 8వ రోజు పురస్కరించుకుని పూజలు నిర్వహించి సాయి ట్యూషన్ సెంటర్ మరియు ఇతర చిన్నారులతో ఆటపాటలతో సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించిశ్రీ గణపతి కమిటీ లడ్డు పాట నిర్వహించి చిన్నారివిజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ వారు భక్తులు సాయి ట్యూషన్ సెంటర్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి నగర కార్యాలయం సందర్శించిన మాజీ మంత్రి ధర్మాన



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** సెంట్రల్ జైలులో ఎంపీ మిథున్ రెడ్డిని కలవడానికి వచ్చిన మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు స్థానిక వి.ఎల్.పురం,మార్గాని ఎస్టేట్స్ లోని సిటీ వైసిపి కార్యాలయాన్ని బుధవారం మధ్యాహ్నం సందర్శించారు. ఆయనతో పాటు రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆలూరు నియోజవర్గ శాసనసభ్యులు బి. విరూపాక్షి,రామచంద్రపురం వైసిపి కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ తదితరులు విచ్చేసారు. వారికి మాజీ ఎంపీ, వైస్సార్ సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ బి.సి సంఘాల జేఏసీ రాష్ట్ర నాయకులు మార్గాని నాగేశ్వరరావు స్వాగతం పలికారు. ఈసందర్బంగా దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.డాక్టర్ వైఎస్సార్ సేవలను స్మరించారు.పలు అంశాలపై చర్చించారు.

## నిరాశ్రయులను దాతలు ఆదుకోవాలి

- వృద్ధులకు సహాయం చాలా అవసరం
- తాతపూడి జయశ్రీ
- మానవీయ వృద్దుల ఆశ్రమంలో బ్రైట్ స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు





**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్:** స్థానిక రాజమహేంద్రవరం మానవీయ ఐక్య సేవ అసోసియేషన్ వృద్దుల ఆశ్రమంలో బ్రైట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చాపల సత్యం మాస్టర్,సత్యనారాయణ మూర్తి,రామ్ మోహన్ రావు ల జ్ఞాపకార్థం దాతలు చాపల సుదీప్తి, కౌశిక్, అనూష,జీవన్ల ఆర్థిక సహాయంతో వృద్ధులకు బెడ్ షీట్స్ మరియు బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేసాము అని సంస్థ కార్యదర్శి తాతపూడి జయశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా తాత పూడి జయశ్రీ వివరాలు తెలుపుతూ ఈ కార్యక్రమానికి ఆర్థిక సహాయం చేసినటు వంటి దాతలకు కృతజ్ఞతలు, వృద్ధాశ్రమాల్లో నిరాశ్ర యుల ను దాతలు ఆదుకోవాలి తెలిపారు. ఈ కార్యక్రమంలో కె పద్మ,సి హెచ్ ప్రదీప్,టి శ్రీనివాస్, చిట్టిబాబు,ఆశ్రమ నిర్వాహకులు తానేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి గణపతి విగ్రహాన్ని దర్శించిన తెదేపా నాయకులు జొన్నలగడ్డ సుబ్బరాయి చౌదరి...



**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు** వినాయక చవితి వేడుకలను పురస్కరించుకొని కొవ్వూరు పట్టణంలోని అచ్చుయమ్మ కాలనీ నాలుగో వీధి నందు శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మట్టి వినాయక విగ్రహాన్ని కొవ్వూరు నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ ద్వి సభ్య కమిటీ సభ్యులు జొన్నల గడ్డ సుబ్బరాయ చౌదరి, తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ కార్యదర్శి పొట్రు శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఎనమదల సుబ్రహ్మణ్యం లు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి మాట్లాడుతూ మట్టి వినాయకుడిని పూజించడం వలన పర్యావరణాన్ని కాపాడుకోగలమని అన్నారు. వినాయక మండపాలలో మట్టి వినాయక ప్రతిమలను ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు

# కనకదుర్గా సాయి మందిరం దేవీ నవరాత్రులకు రాట ముహూర్తం ఘనంగా





**పూజా కార్యక్రమం నిర్వహించిన జోన్నడ దంపతులు**

**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** రాజమహేంద్రవరం స్థానిక కోరుకొండరోడ్డు వీవర్స్ కాలనీ సెంటరులో వేంచేసి ఉన్న శ్రీకనకదుర్గా సాయి మందిరం శ్రీదేవీ నవ రాత్రులు ఘనంగా నిర్వహించేందుకు జొన్నాడ వీర వెంకట సుబ్బారావు శ్రీదేవి దంపతులు బుధవారం ఉదయం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రాట ముహూర్తం వైభవంగా నిర్వహించారు. ఈ ఏడాది మరింత ఘనంగా దేవీ నవరాత్రులు నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.రాట ముహూర్తం కార్యక్రమంలో రుడా మాజీ చైర్ పర్సన్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి,కంటిపూడి శ్రీనివాస్,దేవీచౌక్ ఉత్సవ కమిటీ ప్రతినిధి గంధం భైరవస్వామి దుద్దుపూడి శ్రీనివాస్, పద్మావతి, బి.వెంకటేశ్వరరావు, జొన్నాడ దుర్గ,జొన్నాడ భజే నారాయణ,చంద్ర సప్లై కంపెనీ ప్రసాద్,ఎన్. సత్యనారాయణ మేమురెడ్డి,మాజీ కార్పొరేటర్లు జవ్వాది మురళీకృష్ణ,పాలవలస వీరభద్రం,బలగాని సురేష్,పినిశెట్టి రాజు, కుడుపూడి రాము, బి.సూర్యనారాయణ,సిరిగిరి శ్రీనివాస్,వి. హరిగణేష్, ఎన్.వి.వి.సత్యనారాయణ,కాలెపు శ్రీదేవి,కాలెపు అరుణ,కాలెపు దేవి,గంగుల రమాదేవి,దుద్దే వాణిశ్రీ, మార్ని బాల, బి.అరుణా దేవి,కుడుపూడి దేవి,తోట జయలక్ష్మి,కర్రి సురేఖ తదితరులు పాల్గొన్నారు.

# వార్డు సచివాలయాల పనితీరుపై పూర్తి పర్యవేక్షణ ఉండాలి

- నోడల్ అధికారులతో సమీక్షలో కలెక్టర్ పి.ప్రశాంతి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** వార్డు సచివాలయాల పనితీరును నోడల్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని జిల్లా కలెక్టర్, కమిషనర్(ఎఫ్ ఏ సి) పి.ప్రశాంతి సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో నోడల్ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయి పర్యటనల సమయంలో చెత్త సేకరణతో పాటు రోడ్లు, డ్రెయిన్లు, త్రాగునీటిపై వచ్చు సమస్యలపైనా దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా ఐవీఆర్ఎస్ కాల్స్ లో వచ్చు ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని పేర్కొన్నారు. అలాగే డ్రెయిన్లు ఆక్రమణలకు గురి కాకుండా చూడవలసిన బాధ్యత నోడల్ అధికారులదేనని స్పష్టం చేశారు. ఖాళీ స్థలాలలో పిచ్చి మొక్కలు లేకుండా చూడాలని.. ఇందుకోసం స్థల యజమానులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. కాలువలు, కుంటలలో ఆయిల్ బాల్స్ వేసి, రసాయనాలు పిచికారి చేయించాలని.. అవసరమైతే డ్రోన్ సాయంతో స్ప్రేయింగ్ చేయించవలసిందిగా సూచించారు. స్థానిక రెసిడెన్షియల్ సొసైటీ సభ్యులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ అవగాహన కల్పించాలని కలెక్టర్ అన్నారు. నగరపాలక సంస్థపై ప్రజల్లో సంతృప్తి శాతం పెరిగేలా అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా సూచించారు. సమావేశంలో అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, ఇతర నోడల్ అధికారులు, పాల్గొన్నారు.

# మిధున్ రెడ్డికి బెయిల్ రాకూడదనే చార్జిషీట్ దాఖలు చేయడం లేదు

మిథున్ రెడ్డి దోషి అని పోలీసు అధికారులు ప్రచారం చేయడం తగదు

మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** లిక్కర్ స్కాంలో ఎంపీ మిథున్ రెడ్డిని దోషిగా ప్రచారం చేయడం లేదని,అతడు దోషి అని పోలీసు అధికారులు ఎలా నిర్ధారిస్తారని వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రశ్నించారు. రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ లో ఉన్న ఎంపీ మిథున్ రెడ్డితో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు,మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఆలూరు ఎమ్మెల్యే బి. విరూపాక్షి ,డిసిసిబి మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు బుధవారం ములాఖత్ అయ్యారు.బయటకు వచ్చిన అనం తరం మీడియాతో వారు మాట్లాడారు.మాజీ మంత్రి ధర్మాన ప్రసాద రావు మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రత్యర్థులు అందరినీ దోషులుగా చూపించాలని ప్రయత్నిస్తోందని మండిప డ్డారు. చంద్రబాబు ప్రభుత్వం ఎన్ని కుతంత్రాలు చేసినా మిథున్ రెడ్డికి బెయిల్ వస్తుందని అన్నారు.మిథున్ రెడ్డికి రాజకీయంగా మంచి భవిష్యత్తు ఉందని అరెస్టులు రాజకీయాల్లో సహజమేనని ధర్మాన ప్రసాదరావు వ్యాఖ్యానించారు. బెయిల్ రాకుండా చేయడం కోసమే ఛార్జ్ షీట్ వేయట్లేదని ఆయన విమర్శించారు. ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి మాట్లాడుతూ చంద్రబాబును జైలుకు పంపారమే కక్షతోటే మిథున్ రెడ్డిని జైలుకు పంపారని ఆరోపించారు.ఇది కక్షపూరిత చర్య అని, లిక్కర్ స్కామ్ తో తనకు ఏ విధమైన సంబంధం లేదని మిథున్ రెడ్డి చెప్పారని ఆయన గుర్తు చేశారు. జనసేన నాయకులు మహిళలపై దాడులకు పాల్పడుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.కూటమికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.

# ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో జస్టిస్ సుదర్శనరెడ్డికి ఓటు వేయాలి

- తెలుగు ఎంపీలంతా ఆత్మ ప్రబోధానుసారం గెలిపించుకోవాలి
- మాజీ ఎంపీ జి.వి.హర్షకుమార్



రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్: ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల ఎంపీలు,ఆంధ్ర తెలంగాణ ప్రాంతానికి చెందిన ప్రజా ప్రతినిధులు పార్టీలకు అతీతంగా ఆత్మ ప్రబోధానుసారం ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ సుదర్శనరెడ్డికి ఓట్లు వేయాలని మాజీ ఎంపీ జీవీ హర్ష కుమార్ పిలుపు నిచ్చారు. రాజీవ్ గాంధీ కళాశాల సమావేశ మందిరంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలుగు వ్యక్తి జస్టిస్ సుదర్శనరెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మన అందరి మీద ఉందన్నారు. ఆంధ్రతెలంగాణకు చెందిన ఎంపీలు ఆత్మ ప్రబోధానుసారం ఓటువేసి సుదర్శన రెడ్డిని గెలిపిస్తే దేశ రాజకీయాలు మలుపు తిరుగుతాయని అన్నారు. రెండు రాష్ట్రాలకు కేంద్రం అన్యాయం చేస్తుందని,. ఉత్తరాది రాష్ట్రాల ఆధిపత్య ధోరణి ఇంకా కొనసాగుతోందని హర్షకుమార్,వ్యాఖ్యానించారువైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి చంద్రబాబులు కేసులకు భయపడి మోదీకి మద్దతు పలుకుతున్నారని ఆయన విమర్శించారు.సుదర్శన్ రెడ్డికి రెండు రాష్ట్రాల ఎంపీలు ఓటు వేస్తే ఆయన కచ్చితంగా గెలుస్తారని అన్నారు.వ్యవస్థలన్నింటిని ప్రధాని మోడీ తన గుప్పెట్లో పెట్టుకుంటున్నారని హర్షకుమార్ విమర్శించారు. దేశంలో నక్సలిజాన్ని ఎవరు వ్యతిరేకించడం లేదని, అయితే నక్సల్స్ పేద ప్రజల కోసం పోరాడుతారని అభిప్రాయం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఉంటుందని, బీహార్లో రాహుల్ ప్రచారం చూస్తుంటే ఆయన పరిణితి స్పష్టంగా కనబడుతోందని అభినందనలు తెలిపారు. స్వాతంత్ర ఉద్యమంలో బిజెపి,ఆర్ఎస్ఎస్ పాత్ర ఏమీ లేదని ఆయన అన్నారు.రాజీవ్ గాంధీ మరణించేవరకు సోనియాగాంధీ ప్రత్యక్ష రాజకీయాల్లో లేరని, ఎంపీగా గెలిచిన తరువాత కూడా ప్రధానమంత్రి పదవిని కూడా త్యాగం చేసిన గొప్ప మహిళ సోనియాగాంధీ అని హర్షకుమార్ కొనియాడారు. తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టి.కే.విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఎన్డీఏ అభ్యర్థికి ఎందుకు మద్దతు ఇస్తున్నారో తెలియడం లేదని విమర్శించారు..జస్టిస్ సుదర్శన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డికి అత్యంత ఆప్తుడని ఆయన చెప్పారు. జగన్మోహన్ రెడ్డి లాంటి నాయకుడిని తాము ఎప్పుడూ చూడలేదని ఆయన మండిపడ్డారు. రాజకీయాలలో విలువలు లేని వ్యక్తి నరేంద్ర మోడీ అని అద్వానికి మురళీ మనోహర్ జోష్కి ఏ నిబంధనలు పెట్టారో మోదీకి కూడా అదే నిబంధనలు అమలు చేసి 75 ఏళ్ళకే పదవి బాధ్యతలు నుంచి తప్పుకోవాలని విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు.వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి మాటమీద నిలబడే వ్యక్తి కాదని, ఆయన మడమ తిప్పను అంటారు. కానీ ఆయన మడమ తరచుగా తిప్పేస్తూ ఉంటారని ఆయన ఎద్దేవా చేశారు.విలేకరుల సమావేశంలో జి.వి.శ్రీరాజ్ పాల్గొన్నారు.

## సుగాలి ప్రీతి కేసును సి.బి.ఐ చెదించలేదు..

- ఆయాషామీరా కేసులో చేతులు దులుపుకున్న సి బి ఐ
- సుగాలి ప్రీతి కేసులో న్యాయం జరుగుతుందా..?
- మేడా శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** భారత్ లో సి బి ఐ,కి కేసు బదలాయింప బడింది అంటేనే ముద్దాయిలకు, అనుమానితులకు , నేరగాళ్ళ కు ఊరట కల్పించి నట్టే కదా ! ఇప్పటి వరకు జరిగిన మహిళా హత్యా చార కేసుల్లో సంపన్న ముద్దాయిలను శిక్షించ గలిగారా ! నిరుపేద, సామాన్య ముద్దాయిలను శిక్షించ గలిగారా ! భారత్ లోను , ముఖ్యంగా ఆంధ్ర – తెలంగాణా ల్లోను నేర పరిశోధన వ్యవస్థ బూజు పట్టుకు పోయింది . ఎవరు నేరస్తుడో, ఎవరు నిర్దోషో తేల్చి చెప్పటం అంత సాధ్యం కాదు.. అని ఒక ప్రకటన లో మేడా సవాలు చేశారు.

## ఆటో డ్రైవర్లు నెలవారీ ఈఎంఐలు కట్టలేక, కుటుంబాలు భారం

- ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి..
- నెలకు రూ.10 వేలు ప్రభుత్వం ఇవ్వాలి
- టి.కె.డిమాండ్



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** మహిళలకు ఉచిత బస్సు సదుపాయంతో గిరాకీ లేక నష్టపోతున్న ఆటోడ్రైవర్ల కు ప్రభుత్వం నెలకు రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఐఎన్టీయూసి, జిల్లా కాంగ్రెస్,అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టి.కె. విశ్వేశ్వరరెడ్డి ఉచిత సదుపాయాలు కల్పించడం వల్ల మహిళలు ఆటోలు ఎక్కడం లేదని, దీంతో ఆటో డ్రైవర్లు నెలవారీ ఈఎంఐలు కట్టలేక, కుటుంబాన్ని పోషించు కోలేక ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.ధర్నాకు వెళితే ఆటోలు సీజ్ చేస్తామని పోలీసులు బెదిరించడంతో ఆటో డ్రైవర్లు తమ ధర్నాకు రావడానికి భయపడ్డారని, అందుకే వారు హాజరుకాలేదని విశ్వేశ్వరరెడ్డి చెప్పారు. జిల్లా ఐఎన్టీయూసి అధ్యక్షుడు జె టి.రామారావు మాట్లాడుతూ ఉచిత బస్సు సదుపాయంతో నష్టపోతున్న ఆటో డ్రైవర్లు రోడ్డున పడ్డారని వారిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సిపిఐ నాయకుడు కొండలరావు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ఆందోళనకు సిపిఐ మద్దతు తెలియచేస్తోందని చెప్పారు.అఖిలపక్ష కమిటీ అధ్యక్షుడు దేశిరెడ్డి బలరామనాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు నెలకు రూ.10 వేలు ఇచ్చేవరకు ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. ధర్నా అనంతరం వారంతా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేరున రాసిన వినతి పత్రాన్ని సబ్ కలెక్టర్ కార్యాలయం సూపరింటెండెంట్ కు అందచేశారు.కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మోతా శారద, కాంగ్రెస్ నాయకులు పట్నాల శ్రీనివాసరావు, డాక్టర్ వడయార్,డాక్టర్ రాజశేఖర్,జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బిల్డర్ బాబి తదితరులు పాల్గొన్నారు.

## ఎపి వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జిల్లా ఇంచార్జ్‌గా రవికుమార్

- రూరల్ ఇంచార్జ్ గా పోతుల వెంకటేష్ నియామకం



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్ :** జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఆంజనేయులు అన్నారు. రాజమండ్రి ఆనంద్ రీజెన్సీలో ఏపీడబ్ల్యూజేఎఫ్ తూర్పుగోదావరి జిల్లా సమావేశం రవికుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇతర రాష్ట్రాలలో పెన్షన్ సదుపాయం అమలవుతున్నప్పటికీ ఆంధ్రప్రదేశ్లో మాత్రం అమలు చేయడం లేదన్నారు. జర్నలిస్టులకు అక్రిడేషన్లు సకాలంలో ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఏపీడబ్ల్యూజేఎఫ్ చిత్త శుద్ధితో పనిచేస్తుందని, ఇప్పటికే అనేకసార్లు రాష్ట్రవ్యాప్తంగా ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపట్టామని చెప్పారు. భవిష్యత్తులో కూడా మరిన్ని కార్యక్రమాలు చేపడతామని ఆయన అన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో ఫెడరేషన్ కు పూర్వ వైభవం తీసుకొచ్చే విధంగా యూనియన్ నాయకులు కృషి చేయాలని త్వరలోనే జిల్లా మహాసభ నిర్వహించే కొత్త కార్యవర్గం ఏర్పాటుకు కృషి చేయాలని ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.నవీన్ రాజ్ అన్నారు.

**జిల్లా కన్వినింగ్ కమిటీ కన్వీనర్ గా వెలుగూరి రవికుమార్ నీయామకం:**

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తూర్పుగోదావరి జిల్లా కన్వీనింగ్ కమిటీ ఏకగ్రీవంగా ఏర్పడింది.ఈ కమిటీ కన్వీనర్ గా వెలుగూరి రవికుమార్ తోపాటు కమిటీ సభ్యులుగా మరో 15 మందిని నియమించారు. రాజమహేంద్రవరం అర్బన్ మరియు రూరల్ ఇంచార్జ్ గా పోతుల వెంకటేష్ ఇతర నియోజకవర్గం కమిటీ సభ్యులు గా సిహెచ్ త్రినాధ్, ఎన్ రాంబాబు, శ్రీనివాసాచారి,గోపాలపురం నుంచి రమేష్, కొవ్వూరు నుంచి జీ. కె. తదితరులు నియమితులయ్యారు.

## వైభవంగా శ్రీ లక్ష్మీగణపతి స్వామివారికి ఊంజల్ సేవ



**రాజమహేంద్రవరం,విశ్వంవాయిస్ న్యూస్:** స్థానిక 23వ వార్డు నందివాడవారి వీధిలోని శ్రీ వజ్ర గణపతి ఆలయ మందిరం శ్రీలక్ష్మీ గణపతి నవరాత్రి మహోత్సవాలు,శ్రీ సాయి గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ 24 వ వార్షికోత్సవంలో భాగంగా శ్రీసాయి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి శ్రీ లక్ష్మీ గణపతి స్వామివారికి ఊంజల్ సేవ వైభవంగా జరిగింది.పూసరపు వీరేంద్రకుమార్ ఆషా దంపతులు స్వామివారికి భక్తి శ్రద్ధలతో ఊంజల్ సేవ నిర్వహించారు.అనంతరం స్వామివారికి ఏకదశ హారతులు ఇచ్చారు.భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉదయం సోమిశెట్టి భీమేశ్వరరావు అన్నపూర్ణ దంపతులు నిత్య పూజ కార్యక్రమాలు నిర్వహించారు.శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు చందా సత్రం మాజీ చైర్మన్, మాజీ కార్పొరేటర్ వాకచర్ల కృష్ణ,పేరూరి మహేంద్రనాథ్ సరిదే ధన వెంకటేశ్వరరావు కనమర్లపూడి చంద్రకాంత్ మారడుగుల సుబ్బయ్య వానపల్లి మురళీకృష్ణ నంబూరి కృష్ణ చైతన్య సోమిశెట్టి భీమేశ్వరరావు జ్యోతిరామ్ విఠల్ మోరే,వాకచర్ల భరత్ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నిత్యవసర వస్తువులు కృత్రిమ కొరత సృష్టిస్తే తగిన చర్యలు తీసుకుంటాం

**పౌరసరఫరాల అధికారి ఎ ఉదయభాస్కర్**

**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** మార్కెట్లో నిత్య వసర వస్తువులు కృత్రిమ కొరత సృష్టించకుండా, ధరలను నియంత్రిస్తూ వినియోగ దారులకు మేలు చేసేలా కృషి చేయాలని జిల్లా పౌరసరఫరాల అధి కారి ఏ ఉదయ భాస్కర్ అన్నారు బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా ధరల నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాపార సంస్థల ప్రతినిధుల్ని కమిటీ సభ్యులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ముఖ్యంగా ఉల్లిపాయల ధరలు రాష్ట్రంలోని పరిస్థితుల దృష్ట్యా పెంచకూడదని ధరలను అదుపులో ఉంచాలని, ఉల్లిపాయలు గాని మరి ఏ ఇతర సరుకులు గాని నల్ల బజారుకు తరలించరాదని వ్యాపారస్తులందరూ విధిగా ధరల పట్టికను ప్రదర్శించాలని వ్యాపారాలు నిర్వాహణకు కావలసిన లైసెన్సులను ప్రభుత్వ నిబంధనలను పాటించాలని లేనిపక్షంలో కేసులు బనాయించడం జరుగుతుందన్నారు.



ప్రజలకు సరసమైన ధరల్లో వస్తువుల అందించేలా చూడాలన్నారు ప్రభుత్వ నిర్దేశిత ధరలను షాపులు ముందు స్పష్టంగా ప్రదర్శించాలన్నారు. ప్రజలకు న్యాయమైన ధరలకు సరుకులు అందించడంలో పూర్తిగా సహకారం అందించాలన్నారు. నకిలీ, నిల్వ దాచి పెట్టే వ్యాపారాలను అరికట్టాలన్నారు అక్రమంగా అధిక ధరలు వసూలు చేసే వ్యాపారాలను నియంత్రించాలన్నారు. జిల్లా మార్కెటింగ్ అధికారి విశాలాక్షి మాట్లాడుతూ ప్రభుత్వం ధరలు నియంత్రణకు కట్టుబడి ఉందని వ్యాపారస్తులు అందరూ సహకరించాలని కోరారు. జిల్లా తూనికల కొలతల అధికారి విశ్వేశ్వరరావు జిల్లా ఆహార భద్రత అధికారి రామయ్య వ్యాపారస్తులంతా తమ శాఖల నుండి లైసెన్స్ పొందాలని లైసెన్సు వెంటనే తీసుకోవాలని లేని ఎడల భారీ జరిమానాలు విధించడం జరుగుతుందని తెలియజేశారు. వ్యాపార సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ తప్పకుండా ప్రభుత్వ ఆదేశాలను పాటి స్తామని అవసరమైన లైసెన్సుల గూర్చి స్పష్టమైన నిర్దిష్ట మైన అవగాహన కల్పిస్తే అన్ని లైసెన్సు లు తీసుకుంటామని పలువురు వ్యాపారులు ముక్తకంఠంతో తెలిపారన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ ఉద్యాన శాఖల అధికారులు వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వం వెంటనే ఆదుకోకుంటే క్రాఫ్ హాలిడే ప్రకటిస్తాం.

**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్ విద్యుత్తు రంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేసిన ఆక్వా రైతుల**

**విద్యుత్తు అధికారులతో ఆవేదన వెళ్లగక్కిన ఆక్వా రైతులు. అన్ని సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎస్ఈ హామీ ఇచ్చారు,**




నష్టాల ఊబిలోకి మారిన ఆక్వా పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోకుంటే అవసరమైతే ఆక్వా క్రాఫ్ హాలిడే ప్రకటిస్తామని ఆక్వా రైతులు తేల్చిచెప్పారు.. నాణ్యమైన విద్యుత్తు ఇవ్వకపోగా స్మార్ట్ మీటర్లు పేరుతో మరో ఇబ్బంది తప్పేటట్టు లేదని, ఇప్పటికే ట్రంప్ సుంకాల దెబ్బ, తెగుళ్లు, ఎక్స్‌ఫోర్టర్స్ మోసాలు ఇలా అనేక సమస్యలతో ఆక్వా రైతాంగం పరిస్థితి కోలుకోలేని స్థితిలోకి వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు తీవ్రంగా నష్టపోయి ఆక్వా పరిశ్రమ అధఃపాతాళానికి వెళ్లేలా పరిస్థితి మారిందని విద్యుత్తు శాఖ అధికారులకు రైతులు తెలిపారు.. అమలాపురం క్షత్రియ కళ్యాణ మండపం వద్ద బుధవారం ఆక్వా రైతులతో విద్యుత్తు శాఖ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ఎస్ఈ రాజేశ్వరి, డీఈ అన్నవరం తదితర అధికారులు హాజరై రైతులతో చర్చించారు. ఈ సంర్భంగా రైతులు తాము ఎదుర్కొంటోన్న విద్యుత్తు సమస్యలను అధికారులకు ఏకరవు పెట్టారు. ఆక్వా చెరువులకు లోడు సమస్య తీవ్రంగా వేధిస్తోందని, నాణ్యమైన విద్యుత్తు కొరవడి ఖరీదైన మోటార్లు కాలిపోతున్నాయని చెప్పారు. అదేవిధంగా గత ప్రభుత్వంలో అనేక సాకులతో నిలిపివేసిన విద్యుత్తు కనెక్షన్లను వెంటనే పునరుద్ధరిస్తామని ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు హామి ఇచ్చిన ప్రకారం పునరుద్ధరించాలని రైతులు కోరారు. దీనికి రైతుల నుంచి వచ్చిన ప్రతీ సమస్యను పరిష్కారానిక కృషిచేస్తానని హామీ ఇచ్చారు..

ఆక్వా చెరువుల వద్ద విద్యుత్తు వినియోగంకు స్పెషల్ లైన్‌కాస్ట్ (ఎస్పీఎల్) చార్జీలు విపరీతమైన రూ. ఆరు లక్షలు, పదిలక్షలు, ఏడు లక్షలు అంటూ ఎస్టిమేషన్ వేసి ఇవ్వడం జరిగేదని, అయితే టర్న్ కీ పద్ధతిలో రైతులే నేరుగా ట్రాన్స్‌ఫార్మలు, ఇతర విద్యుత్తు సామాగ్రి ఎస్టిమేట్ వాల్యూకు పదిశాతం చెల్లించి మిగిలిన బయట కొనుగోలు చేయడం ద్వారా ఎస్టిమేషన్ కాస్ట్ తగ్గుతుందని దీనికి ఎస్ఈ అంగీకరించడం పై రైతులకు కొంత ఉపశమనం కలుగుతుందని సంతోషం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో స్టేట్ ఆక్వా ఫెడరేషన్ సలహాదారుడు త్సవటపల్లి నాగభూషణం, కోనసీమ జిల్లా మాజీ అధ్యక్షులు రుద్రరాజు నానీరాజు, ఫీడ్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి రమేష్‌రాజు, కోనసీమ ఆక్వా నూతన కార్యదర్శి చవటపల్లి మణికుమార్, బసవా మురళి, మేడిద శంకరం, మోటూరి నాని, శ్రీనురాజు, సత్తి శ్రీను, తోరం రాము, నంద్యాల సురేంద్ర, కాకిలేటి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో 4.50 లక్షల ఎకరాలు సాగులోఉండగా దానిని 10 లక్షల ఎకరాల దిశగా ముందుకు సాగాలని నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారని, అయితే ప్రభుత్వ ఆదాయ వృద్ధిలో 36 శాతం ఉన్నదానిని 50 శాతంకు తీసుకెళ్తామని చెప్పడం అభినందనీయమని, కానీ ఇటీవల కాలంలో ట్రంప్ ట్యాక్స్ ను సాకుగా చూపి ఎక్స్‌ఫోర్టర్స్ రైతులు పొందాల్సిన వేలాది కోట్ల సొమ్మును పక్కదారి పట్టించారని ఆక్వా ఫెడరేషన్ సలహాదారుడు త్సవటపల్లి నాగభూషణం ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన మొదట్లో నీలి విప్లవం కింద రూ.17 వేల కోట్లు ఆక్వాకు పెట్టి దానిలో భాగంగా విదేశాలనుంచి కలిపే రా మెటీరియల్ విదేశీ సుంకం నుంచి ఉపశమనం కల్పించినప్పటికీ ఇక్కడ ఉన్న సోయా, రైస్ బాన్ భారీగా తగ్గినప్పటికీ దీని ప్రకారం టన్నుకు రూ. 25 నుంచి రూ. 35 వేలు తగ్గాల్సి ఉండగా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఆక్వా పరిశ్రమకు ప్రధానంగా ఉన్న బ్రూడ్ స్టాక్ 50 నుంచి 5 శాతంకు, బ్లడ్ వార్మ్స్, వీదేశీ ఫీడ్‌పై 50 శాతం కస్టమ్స్‌ను 5 శాతంకు తగ్గించినప్పటికీ మేత కంపెనీలు కానీ, తగ్గించాల్సింది పోయి పట్టించుకోకపోవడం బాధాకరం అన్నారు. బ్రూడ్ స్టాక్ మూడు నెలల జీవిత కాలం అయినప్పటికీ నాలుగు నుంచి ఆరు నెలలుపాటు కన్వర్షన్ చేయడం వల్ల నాణ్యత లోపించి రైతులు అపార నష్టం చవిచూస్తున్నారని సత్వరమే ఎంపెడా, ఫిషరీస్, సీఏఏ సత్వరమే రైడ్ చేసి నాణ్యమైన సీడ్ ఉత్పత్తికి కృషిచేయాలని ఆయన కోరారు.

సీడ్ దశనుంచి ఎక్స్‌పోర్ట్ వరకు అన్యాయం జరుగుతుందని నానీ రాజు అన్నారు

ఆక్వా పరిశ్రమను నమ్ముకున్న రైతాంగానికి అన్నింటా ఇబ్బందులే ఎదురవుతున్నాయని అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆక్వా రైతు సంఘం మాజీ అధ్యక్షుడు రుద్రరాజు నానీరాజు అన్నారు. హేచరీల్లో సీడ్ దశ నుంచి అనేక సవాళ్లను ఎదుర్కొని ఎక్స్‌ఫోర్ట్ చేసే వరకు అన్నింటా రైతులకు అన్యాయమే జరుగుతుందన్నారు. ఆక్వా పరిశ్రమలోని ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు..

# పి 4 కార్యక్రమంపై మార్గదర్శులకు అవగాహన సదస్సు

**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** అమలాపురం పట్టణంలోని డా.బి.ఆర్.అంబేద్కర్ కమ్యూనిటీ హాలు నందు పి 4 కార్యక్రమంపై మార్గదర్శులకు అవగాహన సదస్సును నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శాసన సభ్యులు అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పేదరికం లేని రాష్ట్రంగా తీర్చి దిద్దే లక్ష్యంతో ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు పి 4 కార్యక్రమాన్ని రూపొందించారని, సమాజంలో ఉన్న పేద కుంటుంబాలను దత్తత తీసుకుని, వారిని బంగారు కుటుంబాలుగా మార్పుచేయుడానికి మీవంతు సహాయ సహకారాలు అందించాలని మార్గదర్శులకు పిలుపునిచ్చారు. సాయం చేసే మనసున్న ప్రతి ఒక్కరూ మార్గదర్శులేనని, కనీసం ఒక కుటుంబాన్ని దత్తత తీసుకుని వారి పిల్లలకు ఉన్నత చదువులు చెప్పించాలని, పి 4 బృహత్తర కార్యక్రమంలో సంపన్నులు అందరూ మార్గదర్శులుగా మారి, బంగారు కుటుంబాలకు అవసరమైన ఆర్థిక సహాయం గాని, విద్య, వైద్య, న్యాయ సలహా వంటి సహాయాలు అందించి, వారి కుటుంబాలను పేదరికం నుండి బయటకు తీసుకువచ్చి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో మార్గదర్శుకులు ముందుండాలని విజ్ఞప్తి చేశారు. సమాజంలో దాతృత్వంతో సేవలు అందిస్తున్న



మార్గదర్శులను శాసన సభ్యులు అయితాబత్తుల ఆనందరావు సత్కరించారు. ఈ కార్యక్రమంలో అమలాపురం నియోజకవర్గ ప్రత్యేక అధికారి దుండి రాంబాబు , అమలాపురం మున్సిపల్ కమీషనర్ వి.నిర్మల్ కుమార్ , అమలాపురం ఎంపీడీవో డి వి ఎల్ ఎన్ మూర్తి, డిసిఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి , మార్కెట్ కమిటీ చైర్మన్ అధికారి జయ వెంకట లక్ష్మి, మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్ , వార్డు సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసి సభ్యులు, మార్గదర్శులు, మున్సిపల్ సిబ్బంది మరియు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# జీఎస్టీ వసూళ్లలో ఆంధ్రా రికార్డ్

**విజయవాడ :** ఏపీలో కూటమి ప్రభుత్వం మరో సరికొత్త రికార్డు సృష్టించింది. జీఎస్టీ వసూళ్లలో గణనీయమైన వృద్ధి సాధించింది. గత ఏడాదితో పోల్చితే రికార్డు స్థాయిలో జీఎస్టీ వృద్ధి నమోదు అయింది. దేశ సగటు వృద్ధి పది శాతం కాగా.. ఏపీలో రెట్టింపు వృద్ధి ఉంది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత జిఎస్టి వసూళ్లలో వెనుకబడి ఉంది. దీంతో విపక్షం సైతం దీనిని ప్రచారాస్త్రంగా మార్చుకుంది. దానికి కారణం లేకపోలేదు. అధికారంలోకి వస్తే సంపద సృష్టిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. జీఎస్టీ వసూళ్లలో వెనుకబాటు కనిపించడంతో.. ఇదేనా సంపద సృష్టి అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించడం ప్రారంభించింది. దీనికి సమాధానం కూడా ఇవ్వలేకపోయింది కూటమి. అయితే గత ఏడాదిగా చేసిన ప్రయత్నం గత నెల నుంచి కనిపించింది. జూలై నెలలో జీఎస్టీ వసూళ్లలో పురోగతి ప్రారంభం అయింది. ఆగస్టు నెలకు సంబంధించి ఏకంగా 21% వృద్ధి కనిపించడం విశేషం.దేశంలో జీఎస్టీ వృద్ధి గత ఏడాదితో పోల్చుకుంటే 10% పెరిగింది. కానీ ఏపీకి వచ్చేసరికి 21 శాతానికి పెరగడం మాత్రం గుర్తించాల్సిన అంశం. 2025 ఆగస్టులో రూ.3989 కోట్ల రాబడి వచ్చింది జిఎస్టి ద్వారా. దేశంలో జీఎస్టీ అమల్లోకి వచ్చాక ఇదే అత్యధిక రాబడి అని అధికారులు చెబుతున్నారు. దేశంలో ఇతర రాష్ట్రాల కంటే చాలా ఎక్కువ. సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ, అండమాన్ నికోబార్ దీవులను మినహాయిస్తే జీఎస్టీ వసూళ్లలో ఏపీ అగ్రస్థానంలో ఉంది. గత ఏడాది ఆగస్టులో జిఎస్టి వసూలు రూ.3298 కోట్లు రాగా.. ఈ ఏడాది అదే ఆగస్టులో రూ.3989 కోట్లు రావడం విశేషం.2018 నుంచి జిఎస్టి అమల్లోకి వచ్చింది. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సంపద సృష్టిస్తామని చంద్రబాబు ప్రకటనలు చేశారు. క్షేత్రస్థాయిలో జీఎస్టీ వసూలు చూస్తుంటే మాత్రం ఇబ్బందికరంగా ఉన్నాయి. వాస్తవానికి 2023 ఆగస్టు తో పోలిస్తే.. 2024 ఆగస్టులో నికర జీఎస్టీ వసూలు 14.38 శాతానికి పెరిగాయి. స్థూల జీఎస్టీ వసూళ్లు అయితే 14.67% వృద్ధిని నమోదు చేశాయి. అయినా సరే రాష్ట్ర ప్రభుత్వం పై విమర్శలు తప్పలేదు. 2024 ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు జీఎస్టీ ద్వారా రూ.21,164 కోట్ల ఆదాయం వచ్చింది.. అదే 2025లో ఇది రూ.22352 కోట్లకు చేరింది. అదే సమయంలో ఇంధన రంగంలో కూడా వృద్ధి పెరిగింది. ఆగస్టు నెలలో జీఎస్టీ వసూళ్ల వివరాలు చెప్పేందుకు ముందుకు వచ్చారు వాణిజ్య పనుల శాఖ చీఫ్ కమిషనర్ బాబు. గత ఏడాదితో పోలిస్తే వసూళ్లు బాగా పెరిగాయని.. పెట్రోల్ అమ్మకాలు పెరగడం వల్ల కూడా ప్రభుత్వానికి ఆదాయం పెరిగిందని చెప్పుకొచ్చారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు జీఎస్టీ పెరుగుతూ వచ్చిందని గుర్తు చేశారు. వాస్తవానికి కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత జీఎస్టీ వసూళ్లు కొన్ని నెలల పాటు తగ్గాయి. దీనిపై విమర్శలు రావడంతో సీఎం చంద్రబాబు స్పందించారు. వరుసగా సమీక్షలు నిర్వహించారు. అవి ఫలితం ఇవ్వడం ప్రారంభించాయి. జీఎస్టీ లో పెరుగుదల మొదలైంది.

## దక్షిణ మధ్య రైల్వే జోనల్ సమావేశంలో పాల్గొన్న ఎంపీ హరీష్ బాలయోగి

**కోటిపల్లి – నర్సాపురం రైల్వే పనులు వేగం పెంచండి**





**హైదరాబాద్ / సికింద్రాబాద్ విశ్వం వాయిస్ న్యూస్** సికింద్రాబాద్ లోని రైల్వే నిలయంలో ఏర్పాటు చేసిన 76 వ జోనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సమావేశంలో అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ బాలయోగి పాల్గొన్నారు. బుధవారం సికింద్రాబాద్ లో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కోటిపల్లి – నర్సాపురం రైల్వే పై ఉన్న కోర్టు కేసులు తొలగిపోవడంతో రైల్వే నిర్మాణానికి మార్గం సుగమం కావడంతో పనులలో వేగం పెంచాలని కోరారు. ఆయా పనులపై చర్చించి త్వరిగతిన గోదావరి నదులపై బ్రిడ్జి స్ట్రక్చర్ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ద్వారపూడి రైల్వే స్టేషన్ వసతుల కల్పన కోసం సూచించిన విధంగా చర్యలు తీసుకుని ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. అదేవిధంగా రాజోలు పరిధిలోని దిండి వద్ద గోదావరి నదిలో వంగిన పిల్లర్ పై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కోనసీమ ప్రయాణీకుల అవసరాల దృష్ట్యా అమలాపురం పట్టణంలో రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు కొరకు కోరిన చర్యలు వేగవంతం చేసే విధంగా ఆయా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ఎంపీ హరీష్ బాలయోగి కోరారు.

## శ్రీ కాశి అన్నపూర్ణమ్మ సేవా సంస్థ మూడవ వార్షికోత్సవం రావులపాలెం




**విశ్వం వాయిస్ న్యూస్ రావులపాలెం** మండల కేంద్రమైన రావులపాలెంలో సమాజ సేవలో మూడు వసంతాలు పూర్తి చేసుకున్న శ్రీ కాశి అన్నపూర్ణమ్మ సేవా సంస్థ వార్షికోత్సవం వేమన రెడ్డి కళ్యాణమండపంలో నాయకులు అధికారులు పురజనులు మధ్య అంగరంగ వైభవంగా అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన కొత్తపేట మాజీ శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి సేవా సంస్థనుఅభినందిస్తూ నేను ఈ సేవా సమితిలో ఓ సభ్యుడుగా ఉండటం నాకు ఎంతో ఆనందంగా ఉందని సభ్యులు మరింత ఉత్సాహంతో ఇంకా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఈ సేవా సంస్థలో ఉన్న ప్రతి సభ్యుని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. సేవా సంస్థకు ఎప్పుడు ఏ అవసరం వచ్చిన నేను ముందుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన విశిష్ట అతిథి గొలుగూరి వెంకటరెడ్డి (విక్టరీ వెంకట రెడ్డి )మాట్లాడుతూ సంఘ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి ఇలాంటి మంచి కార్యక్రమాలు తలపెట్టిన మీ అందరూ చాలా గొప్ప వారని మంచి మనసున్న వారని సేవ చేయాలంటే డబ్బు హోదా అక్కరలేదని మంచి మనసుఉంటే చాలని ఆర్థికంగా అనారోగ్యంగా ఇబ్బంది పడుతున్న ఎంతో మందిని మీరు ఆదుకోవడం చూస్తే చాలా సంతోషంగా ఉందని ఇలాంటి ఇంకా ఎన్నో మంచి కార్యక్రమాలు మీరు చేయాలి అనిమనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని కృతజ్ఞతలు అభినందనలు కమిటీ వారికి తెలియజేశారు. సేవాసమితి ప్రెసిడెంట్ అయిన గొలుగూరివెంకటసతీష్ రెడ్డి మాట్లాడుతూ చిన్నగా మొదలైన ఈ సేవా సమితి ఇంత అద్భుతంగా సేవలందించడానికి మూలకారులైన ప్రతి సభ్యునికి కృతజ్ఞతలు తెలియజేసారు. సేవా సంస్థ సెక్రటరీ మల్లిడిమాధవీ రెడ్డి మాట్లాడుతూ మున్ముందు ఇంకా ఎన్నో సేవా కార్యక్రమాలుచేస్తామని దానికి మీరందరూ సహాయ సహకారాలు అందించాలని మీ ఆశీస్సులు మాకు కావాలని మాట్లాడుతూ ఈ సంస్థలోసేవలందిస్తున్న ప్రతి ఒక్కరిని సన్మానించి వారికి కృతజ్ఞతలు తెలియజేశారు . ఈ సంస్థకి పెద్దగా ఎంతో సహాయ సహకారాలు అందిస్తూ మమ్మల్ని ప్రోత్సహిస్తున్న పడాల సోమిరెడ్డి వారికి వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అందరికీభోజనాలు ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో రావులపాలెం వైస్ ప్రెసిడెంట్ మునిరెడ్డి, నాయకులు,సేవా సమితి కమిటీ సభ్యులు , మహిళలు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసినప్రతి ఒక్కరికి కాశి అన్నపూర్ణమ్మ సేవాసమితి సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఘనంగా గణపతి నవరాత్రుల దీపోత్సవం ...



**మండపేట టౌన్... విశ్వం వాయిస్ న్యూస్...** గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండపేట పార్థసారధి నగర్ చిన్న మజీద్ వెనుక కొండయ్య బీడులో శ్రీ లక్ష్మీ గణపతి డ్రాగన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ మండపం వద్ద బుధవారం రాత్రి దీపోత్సవం వైభవంగా జరిగింది. వైఎస్సార్సీపీ యువజన విభాగం నియోజకవర్గ కన్వీనర్ చోడే శ్రీకృష్ణ జాహ్నవి స్వరూప దంపతులు దీపోత్సవంను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ మాట్లాడుతూ 19 ఏళ్లుగా నిర్విఘ్నంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న డ్రాగన్ యూత్ సభ్యులను అభినందించారు. దీపోత్సవంలో భాగంగా మట్టి విగ్రహాలను తయారుచేసి దీపాలతో అలంకరించారు. పార్థసారథి నగర్, గాంధీనగరం పరిసర ప్రాంతాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు.

మరిన్ని వార్తా విశేషాలకై... www.viswamvoice.com

# ఇక బ్రెడ్డు, బన్ను, చపాతీ, పరోటా చౌక

న్యూఢిల్లీ

సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ధరల భారం దించుతూ జీఎస్టీ మండలి కీలక నిర్ణయాలు తీసుకుంది. స్వాతంత్ర్య దినోత్సవంనాడు ప్రధాని ప్రకటించిన దీపావళి కానుక దసరాకు ముందే వచ్చింది. చపాతీ, పరోటా, బ్రెడ్డు, బన్నులపై జీఎస్టీని పూర్తిగా తొలగించాలని బుధవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అధ్యక్షతన భేటీ అయిన జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయించింది. అంతేకాదు కుటుంబాలకు ఆధారమైన ఆరోగ్య, జీవిత బీమాపై ప్రస్తుతమున్న 18 శాతం జీఎస్టీని ఎత్తివేయనుంది. దీంతో ఆ మేరకు వాటి ప్రీమియంలు తగ్గనున్నాయి. ఇకపై జీఎస్టీలో 5, 18 శాతం పన్ను శ్లాబులే ఉంటాయి. 12 శాతం, 28 శాతం శ్లాబుల్లోని వస్తువులు 5, 18 శాతం శ్లాబుల్లోకి మారనున్నాయి. బంగారం, వెండి, వజ్రాభరణాలపై ప్రత్యేక పన్ను రేటు 3 శాతం ఇక ముందూ కొనసాగనుంది. ప్టెంబర్ 22 నుంచే (దేవీ నవరాత్రి వేడుకలు మొదలయ్యే రోజు) కొత్త రేట్లు అమల్లోకి రానున్నాయి. కేంద్రం ప్రతిపాదనలకు అన్ని రాష్ట్రాలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపినట్టు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. "సామాన్యుడిని దృష్టిలో పెట్టుకుని ఈ సంస్కరణలు చేపట్టాం. సామాన్యులు రోజువారీ వినియోగించే అధిక శాతం వస్తువులపై పన్ను రేట్లు గణనీయంగా తగ్గనున్నాయి. కార్మికుల ఆధారిత రంగాలకు చక్కని మద్దతు లభిస్తుంది. రైతులు, వ్యవసాయ రంగం, ఆరోగ్య రంగం ప్రయోజనం పొందుతాయి. ఆర్థిక వ్యవస్థలోని కీలక చోదకాలకు ప్రాధాన్యం ఇచ్చాం"అని మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. వ్యాపార నిర్వహణ సైతం సులభతరం అవుతుందని, నిబంధనల అమలు సరళంగా మారుతుందన్నారు. తాజా పన్ను శ్లాబుల క్రమబద్ధీకరణతో రూ.48,000 కోట్ల ఆదాయం తగ్గిపోనుందని, ద్రవ్యపరంగా దీన్ని ఎదుర్కోగలమని కేంద్ర రెవెన్యూ కార్యదర్శి అరవింద్ శ్రీవాస్తవ తెలిపారు. ఈ నిర్ణయాలతో దేశీ వినియోగం మరింత పెరుగుతుందన్నది కేంద్ర ప్రభుత్వం అంచనా. మన జీడీపీలో 61.4 శాతం వినియోగం రూపంలోనే




సమకూరుతుండడం గమనార్హం. జీఎస్టీ సంస్కరణలు అమల్లోకి వచ్చిన రెండో ఏడాదిలో జీడీపీ వృద్ధి 0.5 శాతం మేర అదనంగా నమోవుతుందని ఆర్థిక వేత్తల అంచనా. భారత ఉత్పత్తులపై అమెరికా విధించిన 50 శాతం టారిఫ్‌లు దేశ ఆర్థిక వృద్ధిని 0.20%–%0.50 శాతం ప్రభావితం చేస్తాయన్న ఆందోళనలు నెలకొనగా.. జీఎస్టీ సంస్కరణలతో ఈ ప్రభావం సమసిపోనుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**వీటి ధరలు దిగొస్తాయ్..**

ప్రస్తుతం బ్రాండెడ్ బ్రెడ్, బ్రెడ్ ఉత్పత్తులపై 5%–%18 శాతం మేర జీఎస్టీ అమల్లో ఉండగా ఇది తొలగిపోనుంది. పరాటాపై 18 శాతం, చపాతీ, యూహెచ్‌టీ పాలపై 5 శాతం రేటును ఎత్తివేయనున్నారు. నిత్యావసరాలైన టూత్‌పేస్ట్, టూత్ బ్రష్‌లు, టాల్కమ్ పౌడర్, షాంపూలు, సబ్బులు, హెయిర్ ఆయిల్, బటర్, నెయ్యి, మాంసం, బిస్కెట్లతో పాటు షుగర్ కన్ఫెక్షనరీ, జామ్, ఫ్రూట్ జెల్లీలు, డ్రై నట్స్, ఐస్‌క్రీమ్, పండ్ల రసాలు, కార్న్‌ఫ్లేక్స్ తదితర ఉత్పత్తులపై 18 శాతం జీఎస్టీ 5 శాతానికి తగ్గిపోనుంది. ఇక వంటింటి వస్తువులు, గొడుగులు, సైకిళ్లు, వెదురు ఫర్నీచర్ వస్తువులు, ఫీడింగ్ బాటిళ్లు, టూత్ పౌడర్‌పై పన్ను 12 శాతం నుంచి 5 శాతానికి దిగిరానుంది. ఇంటి నిర్మాణంలోకి వినియోగించే సిమెంట్‌పైనా పన్ను 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గనుంది. 350 సీసీ ఇంజన్ సామర్థ్యం వరకు ఉన్న ద్విచక్ర మోటారు వాహనాలు, ఏసీలు, డిష్‌వాషర్లు, టీవీలు (32 అంగుళాలకు పైన) తదితర ఎలక్ట్రానిక్స్ వస్తువులపైనా ధరల భారం 28 శాతం నుంచి 18 శాతానికి దిగిరానుంది.

ప1,200 సీసీ, 4,000 ఎంఎం పొడవు మించని పెట్రోల్, ఎల్‌పీజీ, సీఎన్‌జీ వాహనాలు, 1,500 సీసీ వరకు ఉన్న డీజిల్ వాహనాలపైనా పన్ను రేటు 18 శాతానికి తగ్గనుంది. 1,200 సీసీ నుంచి 4,000 ఎంఎం కంటే పొడవైన మోటారు వాహనాలు, 350సీసీకి పైన ద్విచక్ర వాహనాలు, ఎయిర్‌క్రాఫ్ట్‌లు (వ్యక్తిగత వినియోగానికి), రేసింగ్‌కార్లు, క్యాసినోలు/గ్యాంబ్లింగ్/గుర్రపు పందేలు/లాటరీలపై 40 శాతం పన్ను రేటు అమలవుతుంది. ఎలక్ట్రిక్ వాహనాలపై ఎప్పటి మాదిరే 5 శాతం పన్ను కొనసాగనుంది.

**పొగాకు ఉత్పత్తులపై ప్రస్తుతానికి 28 శాతం**

సిగరెట్లు, గుట్కాలు, పాన్ మసాలా, జర్దా తదితర పొగాకు ఉత్పత్తులపైనా 40 శాతం పన్ను రేటును ప్రతిపాదించారు. అయినప్పటికీ ప్రస్తుతానికి వీటిపై 28 శాతం జీఎస్టీ, దీనిపై కాంపన్సేషన్ సెస్సును కొనసాగించనున్నారు. రాష్ట్రాలకు ఆదాయ నష్టాన్ని భర్తీ చేసేందుకు తీసుకున్న రుణాలను తిరిగి పూర్తిగా చెల్లించేంత వరకు ఇది కొనసాగుతుందని ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రకటించారు. ఆ తర్వాత వీటిపైనా 40 శాతం పన్ను రేటు అమలు కానుంది. ఇది ఎప్పటి నుంచి అన్నది జీఎస్టీ మండలి తర్వాత నిర్ణయిస్తుంది.

**పౌరుల జీవనం మెరుగుపడుతుంది**

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పన్ను తగ్గింపులు, జీఎస్టీ సంస్కరణలకు జీఎస్టీ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయాలు సామాన్యులకు, రైతులు, ఎంఎస్ఎంఈలు, మధ్యతరగతి ప్రజలు, మహిళలు, యువతకు ప్రయోజనం కలిగిస్తాయి. ఈ విస్తృత స్థాయి సంస్కరణలు పౌరుల జీవనాన్ని మెరుగుపరుస్తాయి. వ్యాపార నిర్వహణ అన్నది, ముఖ్యంగా చిన్న వర్తకులు, వ్యాపారులకు సులభతరం అవుతుంది"

# రెండు వారాల్లోగా 18 కోట్లు కట్టండి

న్యూఢిల్లీ

గత వైసీపీ హయాంలో ఇసుక తవ్వకాలు చేపట్టిన జేపీ వెంచర్స్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. అక్రమంగా ఇసుక తవ్వినందుకు నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ విధించిన రూ.18 కోట్ల జరిమానాను రెండు వారాల్లో డిపాజిట్ చేయాలని ఆదేశించింది. ఎన్జీటీ విధించిన జరిమానాపై గతంలో విధించిన స్టేను తొలగిస్తూ, బుధవారం జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్‌సింగ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ ఆదేశాలు జారీచేసింది. ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్, జీసీకేసీని ప్రతివాదులుగా చేర్చాలని నోటీసులు జారీ చేసింది.



**లోతైన పరిశీలన జరపండి**

వైసీపీ హయాంలో రాష్ట్రంలో జరిగిన ఇసుక అక్రమ తవ్వకాలపై లోతైన పరిశీలన చేయాలని సుప్రీంకోర్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అక్రమ తవ్వకాలకు సంబంధించి అన్ని రకాల ఆధారాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిగణనలోకి తీసుకొని నష్టం అంచనాలపై రెండు వారాల్లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని కోరింది. కాగా, గత ప్రభుత్వ హయాంలో 2021–24వరకు 2,743 హెక్టార్ల పరిధిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరిగాయని ప్రభుత్వం సుప్రీం కోర్టులో ఆఫిడవిట్ దాఖలు చేసింది. సగటున ఒక మీటర్‌లోతున అక్రమ తవ్వకాలు జరిగినట్లు పేర్కొంది. ఈ లెక్కలపై సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. దీనిపై కోర్టు స్పందిస్తూ..."పిటిషనర్ నాగేంద్రకుమార్ సమర్పించిన అఫిడవిట్‌లో 6,500 హెక్టార్లలో అక్రమ తవ్వకాలు జరిగాయని ఉంది. 2,743 హెక్టార్లలోనే తవ్వకాలు జరిగాయని ప్రభుత్వం అంటోంది. రెండింటి మధ్య ఇంత తేడా ఎందుకు?" అని సుప్రీంకోర్టు రాష్ట్ర సర్కారును ప్రశ్నించింది. తాము గూగుల్ ఎర్త్‌ప్రో ఆధారంగా శాటిలైట్ చిత్రాలను పరిశీలించి ఈ నిర్ధారణకు వచ్చామని ప్రభుత్వం ప్రతినిధి కోర్టుకు నివేదించారు. పిటిషనర్ కూడా గూగుల్ ఎర్త్‌ప్రో టెక్నాలజీ ఆధారంగానే అక్రమతవ్వకాలను గుర్తించారని, ఇంత వ్యత్యాసం ఎలా వచ్చిందని కోర్టు మరోసారి ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో పిటిషనర్ అఫిడవిట్‌ను పరిగణనలోకి తీసుకొని అన్ని అంశాలను పరిశీలన చేయాలని ఆదేశించింది. ఈ అంశాన్ని పర్యవేక్షించాలని కేంద్ర పర్యావరణ, అటవీశాఖలను ఆదేశించింది. వాదనల సందర్భంగా ఇసుక అక్రమ తవ్వకాలదారుల నుంచి రికవరీ అంశం ఎంతవరకు వచ్చిందని బెంచ్ ప్రశ్నించింది. జరిమానా చెల్లించకుండా హైకోర్టుకు వెళ్లిన అక్రమ ఇసుకదారుల కేసులో రెండు వారాల్లోగా తీర్పు వెల్లడించాలని హైకోర్టుకు సూచించింది. ఇదే అంశంపై ప్రభుత్వం స్పందిస్తూ.. బాధ్యులైన కంపెనీలు, వ్యక్తులకు నోటీసులు జారీ చేశామని తెలిపింది. దీనిపై న్యాయమూర్తులు తీవ్రంగా స్పందించారు. "గత కొంతకాలంగా ఇదే మాట చెబుతున్నారు. నోటీసులు ఇవ్వడమేనా? రికవరీ చేయడం ఉందా?" అని గట్టిగా ప్రశ్నించారు. ఇప్పటి వరకు ఎంతమందికి నోటీసులు ఇచ్చారని కోర్టు ప్రశ్నించింది.

## 100 కోట్ల మందిలో మానసిక రుగ్మతలు



ఇంటర్నెట్ డెస్క్:

ప్రపంచ వ్యాప్తంగా 100 కోట్లకుపైగా ప్రజలు మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారని, ప్రతి ఏడుగురులో ఒకరికి ఈ సమస్య ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. వీరిలో ఆందోళన డిప్రెషన్‌తో బాధపడుతున్నవారి సంఖ్యే ఎక్కువని పేర్కొంది. యువతలో మరణాలకు ఆత్మహత్య ప్రధాన సమస్యగా కనిపిస్తోందని తెలిపింది. మొత్తంగా ఈ మానసిక సమస్యలు ప్రాణ నష్టంతోపాటు ఆర్థికంగా అపార నష్టాన్ని కలిగిస్తున్నాయని డబ్ల్యూహెచ్‌ఓ అంచనా వేసింది. 'వరల్డ్ మెంటల్ హెల్త్ టుడే', 'మెంటల్ హెల్త్ అట్లాస్ 2024' పేరుతో ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా నివేదిక విడుదల చేసింది. గ్లోబల్ హెల్త్ ఎస్టిమేట్స్ 2021 డేటాబేస్ విశ్లేషణ ఆధారంగా ఈ నివేదిక రూపొందించింది. యువతలో మరణాలకు ఆత్మహత్య ప్రధాన కారణంగా కనిపిస్తోందని, ప్రతి వంద మరణాల్లో ఒకటి ఆత్మహత్యగా ఉంటోందని పేర్కొంది. 20 ప్రయత్నాల అనంతరం ఈ బలవన్మరణాలకు పాల్పడుతున్నట్లు గుర్తించింది.

**ఎరక్కపోయి బైక్ ఎక్కాడు.. బ్రిటన్‌లో చిక్కుకున్నాడు..**

ప్రతి 200 మందిలో ఒకరికి స్కిజోఫ్రెనియా, ప్రతి 150 మందిలో ఒకరు బైపోలార్ డిజార్డర్‌తో బాధపడుతుండటం ఆందోళనకర కలిగించే విషయమని తాజా నివేదిక వెల్లడించింది. మానసిక రుగ్మతల వల్ల కగిలే నష్టాలను ఇందులో అంచనా వేసినట్లు డబ్ల్యూహెచ్‌ఓ వెల్లడించింది. వీటి కారణంగా ప్రాణనష్టమే కాకుండా ఆర్థికంగానూ తీవ్ర పరిణామాలు ఉంటున్నాయని తెలిపింది. ఉత్పాదకత కోల్పోవడం వల్ల పరోక్షంగా సమాజానికీ నష్టమేనని పేర్కొంది. ఈ నేపథ్యంలో మానసిక, ప్రజారోగ్య పరిరక్షణపై ప్రభుత్వాలు తక్షణమే దృష్టి సారించి, వాటికి అనుగుణంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని డబ్ల్యూహెచ్‌ఓ చీఫ్ టెడ్రోస్ అధనోమ్ గెబ్రెయేసస్ సూచించారు.

## భారత్‌కు ట్రంప్ మరోసారి భారీ షాక్!

వాషింగ్టన్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌కు మరో భారీ షాక్ ఇచ్చేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై ఉత్పత్తుల విభాగంలో 50శాతం టారిఫ్‌ను విధించారు. ఇప్పుడు అదే బాటలో సేవల విభాగంపై టారిఫ్‌లు విధించేందుకు సిద్ధమైంది. వాణిజ్య పరంగా భారత్‌పై మరింత ఒత్తిడి తెచ్చేలా ట్రంప్ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే భారత ఎగుమతులపై భారీ సుంకాలు విధించిన ట్రంప్ ప్రభుత్వం, ఇప్పుడు భారత ఐటీ సేవలు, విదేశీ రిమోట్ వర్కర్లపై సుంకాలు విధించనుంది. అందుకు ఊతం ఇచ్చేలా అమెరికా ట్రేడ్ అండ్ మాన్యుఫాక్చరింగ్ సలహాదారు పీటర్ నవారూ.. అన్ని ఔట్‌సోర్సింగ్ సేవలపై టారిఫ్ విధించాలి' అనే అభిప్రాయం వ్యక్తం చేయడం అందుకు బలం చేకూర్చుతోంది. దీంతో విదేశీ సేవలపై కూడా వస్తువుల్లాగే టారిఫ్ విధించాలి అనే ఆలోచనలో ట్రంప్ ప్రభుత్వం ఉన్నట్లు పలు అంతర్జాతీయ మీడియా కథనాలు వెలుగులోకి వచ్చాయి. ఈ విధానాలు అమలైతే అమెరికా కంపెనీలు ఔట్‌సోర్సింగ్ ఖర్చులు పెరగడంతో.. భారత్ సంబంధిత కంపెనీలతో కుదుర్చుకునే కాంట్రాక్ట్‌ల విషయంలో వెనక్కితగ్గుతాయి. ప్రాజెక్టుల ఆలస్యం, లాభాల తగ్గుదల, సరఫరా గొలుసుల అంతరాయం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. భారత ఐటీ కంపెనీలు అమెరికా ఆధారిత వ్యాపారాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని నిపుణులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. భారత్ నుంచి అమెరికాకు వెళ్లే ఇంజినీర్లు, కోడర్లు, ఐటీ కన్సల్టెంట్లు, విద్యార్థులు ఎక్కువ మంది వెళుతుంటారు. ఇన్ఫోసిస్,టీసీఎస్,విప్రో,హెచ్‌సీఎల్ వంటి సంస్థలు హెచ్1బీ వీసాల ప్రధాన స్పాన్సర్లు. ఈ వీసాల ద్వారా అమెరికాలో పనిచేసే అవకాశం లభిస్తుంది. కానీ ఇప్పుడు..హెచ్1బీ వీసా వ్యవస్థను పునరుద్ధరించేందుకు ట్రంప్ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ పరిణామాలు భారత్ తన ఐటీ రంగాన్ని విస్తరించేందుకు,వివిధ దేశాలతో వ్యాపార సంబంధాలు పెంచేందుకు, అమెరికా ఆధారాన్ని తగ్గించేందుకు ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరాన్ని సూచిస్తున్నాయి. ట్రంప్ పాలనలో భారత ఐటీ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, భవిష్యత్తులో ప్రపంచ వాణిజ్య దృశ్యాన్ని మలుపు తిప్పే అవకాశం కలిగి ఉన్నాయి.

## సామాన్యులకు ఊరటనిస్తూనే ఆర్థిక రంగం బలోపేతం

-మొదటిపేజీ తరువాయి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి నిర్ణయం తీసుకున్నాయని ఆయన చెప్పారు. జీఎస్టీలో భారీ సంస్కరణలు తీసుకురాబోతున్నట్లు ఎర్రకోట వేదికగా తాను స్వాతంత్ర్య దినోత్సవాన ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా మోదీ గుర్తు చేశారు.

# భారత రక్షణ వ్యవస్థ మరింత పటిష్ఠం

న్యూ డిల్లీ : పాక్‌తో ఉద్రిక్తతల వేళ భారత రక్షణ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే ప్రపంచంలోనే అత్యం త శక్తిమంతమైన గగనతల రక్షణ వ్యవస్థగా పేరుగాంచిన ఎస్–400 ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్ సిస్టమ్ అదనపు యూనిట్స్‌ని రష్యా నుంచి మరిన్ని కొనుగోలు చేసేందుకు సిద్ధమైంది. ఈ విషయమై మాస్కోతో చర్చలు ప్రారంభించింది. ఈ మేరకు రష్యా అధికారులను ఊటంకిస్తూ అక్కడి మీడి యా వెల్లడించింది. భారత్ అదనపు ఎస్–400 వ్యవస్థల కొనుగోళ్లకు రష్యా తో చర్చలు జరుపుతున్నట్లు పేర్కొంది. భారత్ ఇప్పటికే ఎస్–400 వ్యవస్థలను ఉపయోగిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే పాకిస్థాన్‌తో ఘర్షణల సమయంలో ఈ ఎస్–400 గగనతల రక్షణ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసింది. పాకిస్థాన్ డ్రోన్లు, మిసైల్స్‌తో దాడికి ప్రయత్నించగా ఎస్–400 సహాయంతో వాటిని భారత్ విజయవంతంగా కూల్చివేసింది. సరిహద్దుల్లో మోహరించిన ఎస్–400 మిస్సైల్ సిస్టమ్ అడ్డుకున్న విషయం తెలిసిందే. ఖచ్చితత్వంతో సరిహద్దు నుంచి వైమానిక ముప్పును ఎదుర్కోవడంలో ఈ వ్యవస్థ సమర్థవంతంగా పని చేసిన నేపథ్యంలో.. భారత్ తన వైమానిక రక్షణ సామర్థ్యాన్ని మరింత విస్తరించేందుకు నిర్ణయం తీసుకుంది.చైనా నుంచి పెరుగుతున్న సైనిక ముప్పును ఎదుర్కొనే లక్ష్యంతో ఎస్–400 ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్ వ్యవస్థలను కొనుగోలు చేసేందుకు రష్యాతో ఇండియా 5 బిలియన్ల డాలర్ల ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ ఒప్పందం 2018లో కుదిరింది. ఈ ఒప్పందం కింద మొత్తం ఐదు ఎస్–400 వ్యవస్థలను కొనుగోలు చేయాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల సరఫరాలో జాప్యం జరిగింది. ఈ నేపథ్యంలో భారత్‌కు ఇవ్వాల్సిన మిగిలిన రెండు యూనిట్లను 2026లోగా అందజేసేందుకు కట్టుబడి ఉన్నామని రష్యా ఇటీవలే ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఎస్–400 ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్ సిస్టమ్ అదనపు యూనిట్స్ కోసం రష్యాతో భారత్ చర్చలు ప్రారంభించింది.ఎస్–400 రక్షణ వ్యవస్థ అంటే ఏంటి?ఎస్–400 ట్రయాంఫ్ అనేది భూమిపై నుంచి గగనతలానికి ప్రయోగించే క్షిపణి వ్యవస్థ. దీన్ని ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి కూడా మోహరించవచ్చు. ఆకాశంలో దూసుకొచ్చే శత్రువుల జెట్స్, రాకెట్లను ఇది భూమిపై నుంచే కూల్చివేయగల సామర్థ్యం వీటికి ఉంది. విమానాలు, మానవరహిత వైమానిక విమానాలు, క్రూయిజ్ క్షిపణులను ధ్వంసం చేస్తుంది. ఇది టెర్మినల్ బాలిస్టిక్ క్షిపణి రక్షణ సామర్థ్యాన్ని కూడా కలిగి ఉంటుంది. సోవియట్ యూనియన్ కుప్పకూలిన తక్షణమే వీటిని 1993లో అభివృద్ధి చేయడం ప్రారంభించారు. మిస్సైల్ స్టోరేజ్ కంటైనర్లు, లాంచర్లు, రాడార్లు ఇలా వివిధ రకాల ఆయుధాలతో దీన్ని తయారు చేశారు. 2007వ సంవత్సరంలో ఇది వినియోగంలోకి వచ్చింది. రష్యాకు చెందిన ఈ ఎస్–400 మిస్సైళ్లు.. సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైళ్ల రక్షణ వ్యవస్థలో మోస్ట్ అడ్వాన్స్‌డ్ ఆయుధాలుగా పేర్కొంటారు.ఎస్–400 ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన మొబైల్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్. దీన్ని సులభంగా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించేందుకు అవకాశం ఉంటుంది. దాన్ని ఓ వాహనంపై అమర్చవచ్చు. ఒకేసారి మల్టిపుల్ టార్గెట్స్‌ని ధ్వంసం చేస్తుంది. ఒకేసారి 36 టార్గెట్‌లను ట్రాక్ చేసే సామర్థ్యం దీనికి ఉంది. అలాగే, 12 టార్గెట్స్‌పై ఒకే సారి దాడి చేస్తుంది. 600 కిలోమీటర్ల దూరం నుంచే ట్రాక్ చేస్తూ.. 400 కిలోమీటర్ల పరిధిలోనే శత్రువుల మిస్సైల్స్‌ను కూల్చే సత్తా వీటి సొంతం. విమానాలు, డ్రోన్లు, క్రూయిజ్ మిసైల్స్, బాలిస్టిక్ మిసైల్స్ ఇలా వేర్వేరు లక్ష్యాలను ఒకేసారి టార్గెట్ చేసి ఛేదిస్తుంది. వీటి రియాక్షన్ టైమ్ చేలా వేగంగా ఉంటుంది. ఎస్–400 యాంటీ మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్‌ను ఫైర్ చేసేందుకు ఐదు నిమిషాల్లోనే రెడీ చేయొచ్చు. ఇందులో 3డీ ఫేజ్‌డ్ అరే రాడార్ ట్రాకింగ్ సిస్టమ్ ఉంటుంది. స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్రకారం, 2020–2024 మధ్య కాలంలో భారత్ ఆయుధ దిగుమతుల్లో 36 శాతం వాటా రష్యాదే. బ్రహ్మోస్ క్షిపణులు, సుఖోయ్–30 ఎంకేఐ యుద్ధ విమానాలు, టీ–90 ట్యాంకులు, ఏకే–203 రైఫిళ్ల తయారీ వంటి ఎన్నో కీలక రక్షణ ప్రాజెక్టుల్లో ఇరు దేశాలు దశాబ్దాలుగా కలిసి పనిచేస్తున్నాయి. ఇప్పుడు మరో భారీ డీల్‌కు ఇరు దేశాలు సిద్ధమవడం విశేషం.

# ఈ గింజలు తింటే ఆరోగ్యానికి ఎన్ని లాభాలో?



గుమ్మడికాయ గింజలు ఒక నేచురల్ సూపర్‌ఫుడ్. వీటిలో విటమిన్స్, మినరల్స్, ప్రోటీన్, జింక్, మెగ్నీషియం, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. రోజువారీ డైట్‌లో వీటిని చేర్చుకోవడం వల్ల బరువు తగ్గడం, షుగర్ కంట్రోల్, ఇమ్యూనిటీ పెరుగుదల, మంచి నిద్ర, హార్ట్ హెల్త్ వంటి అనేక ప్రయోజనాలు పొందవచ్చు. రోజువారీ డైట్‌లో గుమ్మడికాయ గింజలు చేర్చుకోవడం వల్ల బరువు తగ్గడంతో పాటు ఇమ్యూనిటీ పెంచుకోవచ్చు. వీటిలో విటమిన్స్, మినరల్స్, హెల్తీ ఫ్యాట్స్, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా విటమిన్ సి, మెగ్నీషియం, ప్రోటీన్, జింక్, ఐరన్, పొటాషియం లాంటి న్యూట్రియెంట్స్ వీటిలో ఎక్కువగా ఉంటాయి. గుమ్మడికాయ గింజల ఆయిల్ యూరిన్ రిలేటెడ్ ప్రాబ్లమ్స్‌ను తగ్గిస్తుంది. ఇవి ప్రోస్టేట్ గ్రంథి వాపును కూడా తగ్గించడంలో హెల్ప్ చేస్తాయి. మెన్ ఫెర్టిలిటీ ప్రాబ్లమ్స్‌లో గుమ్మడికాయ గింజలు చాలా ఇంపార్టెంట్. వీటిలో జింక్, మెగ్నీషియం ఎక్కువగా ఉండడం వల్ల స్పెర్మ్ కౌంట్ పెరుగుతుంది. గుమ్మడికాయ గింజలలోని విటమిన్ సి ఇమ్యూనిటీని పెంచుతుంది. వైట్ బ్లడ్ సెల్స్ ప్రొడక్షన్ పెంచి బాడీని ఇన్ఫెక్షన్స్ నుంచి కాపాడుతుంది. పడుకునే ముందు కొన్ని గింజలు తింటే బాగా నిద్ర పడుతుంది. వీటిలోని ట్రిప్టోఫాన్ అనే అమైనో యాసిడ్ త్వరగా నిద్రలోకి జారుకోవడానికి హెల్ప్ చేస్తుంది. జింక్, రాగి, సెలీనియం లాంటి మినరల్స్ స్లీప్ క్వాలిటీని ఇంప్రూవ్ చేస్తాయి. గుమ్మడికాయ గింజలు బ్లడ్ షుగర్ లెవల్స్‌ను కంట్రోల్ చేయడంలో హెల్ప్ చేస్తాయి. వీటిలో ఉండే హైపోగ్లైసీమిక్ లక్షణాలు బ్లడ్ షుగర్, కొలెస్ట్రాల్ రిస్క్‌ను తగ్గిస్తాయి. డయాబెటిస్ రిస్క్‌ను తగ్గించడంలో కూడా ఇవి హెల్ప్ చేస్తాయి. గుమ్మడికాయ, అవిసె గింజలు కలిపి తినడం వల్ల డయాబెటిస్

# ఇలాంటి లక్షణాలు కనిపిస్తే థైరాయిడ్ ఉన్నట్లే..



ప్రస్తుత కాలంలో ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి.. ఇలాంటి తరుణంలో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు చర్యలు తీసుకోవడం మంచిది.. అలాంటి అనారోగ్య సమస్యల్లో థైరాయిడ్ ఒకటి.. ఇది చాలా మందిని వేధిస్తుంటుంది.. వాస్తవానికి థైరాయిడ్ వ్యాధి లక్షణాలు శరీరం అంతటా కనిపిస్తాయి. రోగి శరీరంలో కొవ్వు పెరగడం.. లేదా బరువు తగ్గడం ప్రారంభమవడం థైరాయిడ్ లక్షణాలే.. ఇది కాకుండా, గొంతులో వాపు కనిపిస్తుంది. ఇలాంటి లక్షణాలను అశ్రద్ధ చేయకూడదని వెంటనే.. వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని సూచిస్తున్నారు ఆరోగ్య నిపుణులు.. థైరాయిడ్ గ్రంథి పెరుగుదల, దాని పరిమాణం తగ్గడం రెండూ తీవ్రమైన అనారోగ్యానికి కారణమవుతాయి. వీటికి సకాలంలో చికిత్స చేయకపోతే పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉంటుంది.. ఒక్కోసారి పరిస్థితి తీవ్రమైనదిగా మారొచ్చు..

థైరాయిడ్ వ్యాధి అంటే.. మీ థైరాయిడ్ గ్రంథి సరిగ్గా పనిచేయడం లేదని అర్థం. దీనిలో హైపోథైరాయిడిజం (తక్కువ థైరాయిడ్ చర్య) లేదా హైపర్ థైరాయిడిజం (అధిక థైరాయిడ్ చర్య)గా వైద్య నిపుణులు అంచనావేస్తారు.. రెండు సందర్భాలలోనూ లక్షణాలు కనిపిస్తాయి. అయితే, చాలా థైరాయిడ్ కేసులను మందులతో చికిత్స చేయవచ్చు. కొన్ని ప్రత్యేక పరిస్థితులలో శస్త్రచికిత్స అవసరం అవుతుందంటున్నారు. వైద్య నిపుణులు.. థైరాయిడ్ గ్రంథి మన మెడ ముందు భాగంలో సీతాకోకచిలుక ఆకారంలో ఉండే గ్రంథి. ఈ గ్రంథి థైరాయిడ్ హార్మోన్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ గ్రంథి థైరాక్సిన్, ట్రైఅయోడోథైరోనిన్ వంటి థైరాయిడ్ హార్మోన్లను ఉత్పత్తి చేసి విడుదల చేయడానికి పనిచేస్తుంది. శరీరానికి ఈ రెండు హార్మోన్లు కూడా అవసరం. థైరాయిడ్ హార్మోన్ల ప్రధాన విధులు ఏంటంటే.. జీవక్రియ వేగాన్ని నియంత్రించడం, ఆహారాన్ని శక్తిగా మార్చడం.. దీనిలో ఏదైనా ఆటంకం ఏర్పడితే, మొత్తం శరీరం ప్రభావితమవుతుంది. థైరాయిడ్ వ్యాధి హైపోథైరాయిడిజం (థైరాయిడ్ తక్కువ చురుకుదనం) లేదా హైపర్ థైరాయిడిజం (థైరాయిడ్ అధిక చురుకుదనం) కు కారణమవుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. థైరాయిడ్ అధికంగా ఉండటం, లోపం రెండూ వేర్వేరు లక్షణాలను కలిగి ఉంటాయి.అలసట, నీరసం, బరువు పెరగడం, విపరీతమైన చలి.. లేదా చలిని తట్టుకోలేకపోవడం, నిరాశ, మలబద్ధకం హైపోథైరాయిడిజం సాధారణ లక్షణాలు.హైపర్ థైరాయిడిజం వల్ల హృదయ స్పందన రేటు పెరగడం, బరువు తగ్గడం, ఆందోళన, చిరాకు, విరేచనాలు, అధిక చెమట, వేడిని తట్టుకోలేకపోవడం వంటివి సంభవిస్తాయి. ఈ రెండు పరిస్థితులలోనూ థైరాయిడ్ గ్రంథి పెద్దదిగా మారవచ్చు. అయితే, హైపర్ థైరాయిడిజంలో దీని ప్రమాదం మరింత ఎక్కువగా ఉంటుంది. థైరాయిడ్ వ్యాధి వెనుక కొన్ని కారణాలున్నాయి. మహిళలు ఈ వ్యాధితో బాధపడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. వ్యాధి కుటుంబ చరిత్ర, అధిక అయోడిన్ కంటెంట్ ఉన్న మందులు, అయోడైజ్ చేయని ఉప్పు.. దీనితో పాటు, ఆటో ఇమ్యూన్ వ్యాధులు, రక్తహీనత, టైప్-1 సెలియాక్ వ్యాధి, అడిసన్స్ వ్యాధి, లూపస్, ఆర్థరైటిస్, స్జోగ్రెన్స్ సిండ్రోమ్ కారణంగా కూడా ప్రమాదం పెరుగుతుందని చెబుతున్నారు నిపుణులు.. అయితే.. ఇలాంటి లక్షణాలు వైద్యుడిని సంప్రదించి సకాలంలో పరీక్ష చేయించుకోవాలని సూచిస్తున్నారు.

# రాత్రి గ్లాసుడు నీళ్లలో అంజీర్‌లను నానబెట్టి.. ఉదయాన్నే ఖాళీ కడుపుతో తిన్నారంటే..?



బాదం, వాల్‌నట్స్ వంటి డ్రై ఫ్రూట్స్ తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదన్న సంగతి అందరికీ తెలిసిందే. కానీ కొంతమంది ఈ ఆరోగ్యకరమైన డ్రై ఫ్రూట్స్ జాబితాలో అంజీర్‌లను చేర్చడానికి పెద్దగా ఇష్టపడరు. కానీ ఈ అంజీర్ పండ్లు ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను అందించడమే కాకుండా పోషకాలతో కూడా సమృద్ధిగా ఉంటాయి. వాటిలో ఉండే ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు మలబద్ధకం వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందడంలో సహాయపడతాయి. అందుకే అంజీర్‌లను ఏ విధంగానైనా తినవచ్చు. కానీ ఆయుర్వేదం, పోషకాహార నిపుణుల అభిప్రాయం ప్రకారం.. వాటిని రాత్రిపూట నీటిలో నానబెట్టి, ఉదయం ఖాళీ కడుపుతో తినడం వల్ల నిర్దిష్ట ప్రయోజనాలు లభిస్తాయి. ఎండుద్రాక్షల మాదిరిగానే వీటిని కూడా నీళ్లలో నానబెట్టి తీసుకోవడం వల్ల కొన్ని రోజుల్లోనే మీ ఆరోగ్యంలో గణనీయమైన మార్పు కనిపిస్తుంది. అంజీర్ పండ్లలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. అంజీర్ పండ్లలో క్లోరోజెనిక్ ఆమ్లం కూడా ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గిస్తుందని అనేక అధ్యయనాలు నిరూపించాయి. అంతేకాకుండా నానబెట్టిన అంజీర్ పండ్లను తీసుకోవడం వల్ల టైప్-2 డయాబెటిస్ ఉన్నవారిలో రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. అంజీర్ పండ్లలో ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి మలబద్ధకాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. అందుకే పేగు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అంజీర్ పండ్లను తినాలని ఆరోగ్య నిపుణులు సిఫార్సు చేస్తున్నారు. మలబద్ధకంతో బాధపడుతున్న రోగులు నానబెట్టిన అంజీర్ పండ్లను తినడం వల్ల ఎంతో ప్రయోజనం పొందుతారు. ఈ రోజుల్లో చాలా మంది బరువు పెరగడం గురించి ఎక్కువగా ఆందోళన చెందుతున్నారు. దీంతో బరువు తగ్గడానికి జిమ్‌కు వెళ్లడం నుంచి డైట్ పాటించడం వరకు వివిధ మార్గాలను ప్రయత్నిస్తున్నారు. కానీ వీటికి బదులుగా ఖాళీ కడుపుతో నానబెట్టిన అంజీర్ పండ్లను తినడం వల్ల ఈ సమస్య సులభంగా పరిష్కరించబడుతుంది. అంజీర్ పండ్లలో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఈ అంజీర్ పండ్ల వినియోగం ఎముకలను ఆరోగ్యంగా, బలంగా ఉంచడంలో సహాయపడుతుంది. అంజీర్ పండ్లు ఎముకలను బలోపేతం చేయడంలో పాలు మాదిరి ప్రయోజనకరంగా ఉంటాయి. ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో నానబెట్టిన అంజీర్ పండ్లను తినడం వల్ల ఎముకలు బలపడతాయి. అంజీర్ పండ్లలో మంచి మొత్తంలో పొటాషియం ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. అదనంగా వాటిలో ఉండే యాంటీఆక్సిడెంట్లు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. తద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి.

# అరటి పువ్వుతో అద్భుతమైన ఆరోగ్యం



అరటిపండ్లతో కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి మనందరికీ తెలిసిందే. కానీ అరటి చెట్టు నుంచి వచ్చే అరటి పువ్వు కూడా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. పోషకాహార నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఇందులో చాలా పోషకాలు ఉన్నాయి. అరటి పువ్వు శరీర ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది . అంతే కాదు ఇందులో ఫైబర్, ప్రోటీన్, కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, ఐరన్ పుష్కలంగా ఉన్నాయి. ఇది అనేక తీవ్రమైన వ్యాధుల నుంచి కూడా రక్షణ కల్పిస్తుంది. అరటి పువ్వుతో వివిధ ప్రాంతాల్లో ఎన్నో రుచికరమైన వంటలు తయారు చేసుకుంటూ ఉంటారు. అంతేకాదు ఆయుర్వేదంలో దీనిని ఔషధంగా కూడా ఉపయోగిస్తారు. టైప్ 2 డయాబెటిస్ రోగులకు అరటి పువ్వు ఒక దివ్య ఔషధం. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడం ద్వారా డయాబెటిస్‌ను నియంత్రించడంలో సహాయపడుతుంది. అందుకే డయాబెటిస్ ఉన్నవారు ఈ పువ్వును క్రమం తప్పకుండా తినాలని వైద్యులు సూచిస్తున్నారు. అరటిపండ్లలో మెగ్నీషియం, యాంటీఆక్సిడెంట్లు, యాంటీ-డిప్రెసెంట్ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి మానసిక ఒత్తిడిని తగ్గించడం ద్వారా మానసిక స్థితిని మెరుగుపరచడంలో సహాయపడతాయి. అంతేకాదు ఒత్తిడిని ఎదుర్కోవడంలో ప్రభావవంతంగా పని చేస్తుంది. నిరాశ సంబంధిత సమస్యల నుంచి కూడా మిమ్మల్ని దూరంగా ఉంచుతుంది. అరటి పువ్వు ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థను నిర్వహించడానికి సహాయపడుతుంది. ఇది కడుపు సంబంధిత వ్యాధులను దూరంగా ఉంచడంలో సహాయపడుతుంది. కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు వంటి కడుపు సంబంధిత సమస్యలతో బాధపడుతుంటే అరటి పువ్వును క్రమం తప్పకుండా తినడం చాలా మంచిది. ఐరన్ అధికంగా ఉండే అరటి పువ్వు రక్తహీనతను నివారించడానికి ప్రభావవంతమైన ఔషధంగా పనిచేస్తుంది. అంతేకాదు, రక్తహీనతకు సంబంధించిన ఇన్ఫెక్షన్ల నుంచి కూడా దూరంగా ఉండటానికి ఇది సహాయపడుతుంది. మీరు కూడా రక్తహీనతతో బాధపడుతుంటే అరటి పువ్వును క్రమం తప్పకుండా తినడం మంచిది.

# లివర్ ఆరోగ్యానికి బెస్ట్ డీటాక్స్ డ్రింక్స్



గోరువెచ్చని నీటిలో నిమ్మకాయను పిండుకొని త్రాగడం కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి సులభమైన మార్గం. నిమ్మకాయలో విటమిన్ సి ఉంటుంది, ఇది శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్. ఇది కాలేయాన్ని శుభ్రపరచడానికి, పిత్తాన్ని ఉత్పత్తి చేయడానికి, జీర్ణక్రియను మెరుగుపరచడానికి సహాయపడుతుంది. ఉదయం ఖాళీ కడుపుతో నిమ్మకాయ నీరు త్రాగడం వల్ల కాలేయ నిర్విషీకరణతో పాటు మీ జీర్ణక్రియ కూడా మెరుగుపడుతుంది. గ్రీన్ టీ: గ్రీన్ టీలో కాటెచిన్ అనే యాంటీఆక్సిడెంట్ ఉంటుంది, ఇది కాలేయ కణాలను రక్షిస్తుంది. దీన్ని రోజూ తీసుకుంటే, కాలేయ ఎంజైమ్‌లు బాగా పనిచేస్తాయి అలాగే ఇది కాలేయంలో కొవ్వు పేరుకుపోకుండా చూసుకుంటుంది. బీట్‌రూట్ రసం: తాజా బీట్‌రూట్ రసం వారానికి రెండు-మూడు సార్లు తాగడం వల్ల మీ కాలేయం బలపడుతుంది. అలాగే పేగు ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. కాలేయం, పేగులు ఒకదానితో ఒకటి అనుసంధానించబడి ఉంటాయి. కాబట్టి బీట్‌రూట్ రసం ఈ రెండింటికీ ప్రయోజనకరంగా ఉంటుంది. పసుపు టీ: పసుపుతో తయారుచేసిన టీ కాలేయానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులో ఉండే కర్కుమిన్ అనే మూలకం కాలేయం వాపును తగ్గిస్తుంది. అలాగే ఇది యాంటీఆక్సిడెంట్‌గా కూడా పనిచేస్తుంది. పసుపు కాలేయం పిత్తాన్ని ఉత్పత్తి చేయడానికి, చెడు కణాలను రిపేర్ చేయడానికి సహాయపడుతుంది. అలాగే హానికరమైన పదార్థాల నుండి కాలేయాన్ని రక్షిస్తుంది. అల్లం-పుదీనా నీరు: అల్లం, పుదీనాను మరిగించి తయారు చేసిన ఈ పానీయం ఆరోగ్యానికి అనేక రకాలుగా ప్రయోజనాలను అందిస్తుంది. ఇందులో ఉండే అల్లం కాలేయ వాపును తగ్గిస్తుంది. పుదీనా జీర్ణక్రియ, పిత్త ఉత్పత్తికి సహాయపడుతుంది. అలాగే ఈ రెండింటిని కలిపి తీసుకోవడం వల్ల ఇవి శరీరం నుంచి విషాన్ని తొలగించడంలో సహాయపడతాయి.

# బిజినెస్

## నింగినంటిన బంగారం ధరలు



భారత మార్కెట్‌లో బంగారం ధరలు ఆకాశాన్ని అంటాయి. దేశ చరిత్రలోనే ఎప్పుడూ లేని స్థాయిలో 10 గ్రాముల పసిడి ఏకంగా రూ.1,06,000 ఎగువన నమోదయ్యింది. అమెరికా అధిక టారిఫ్‌లకు తోడు డాలర్‌తో రూపాయి విలువ రికార్డ్ స్థాయిలో పతనం కావడం బంగారం ధరలకు ఆజ్యం పోస్తోంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.400 పెరిగి రూ.1,06,070కు చేరింది. 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర రూ.1,05,200గా నమోదయ్యింది. గడిచిన ఏడు సెషన్లలో ఈ లోహం ధర ఏకంగా రూ.5,900 ఎగిసింది. 2024 డిసెంబర్ 31న రూ.78,950 వద్ద నమోదయిన బంగారం.. ప్రస్తుత ఏడాదిలో ఇప్పటి వరకు రూ.34.35 శాతం పెరిగింది. మంగళవారం కిలో వెండిపై రూ.100 పెరిగి రూ.1,26,100కి చేరింది. గడిచిన మూడు సెషన్లలో కిలో వెండిపై రూ.7,100 పెరగడం గమనార్హం. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు ఈ లోహం ధర ఏకంగా 40.58 శాతం ఎగిసింది. 2024 డిసెంబర్ ముగింపు నాటికి 89,700గా పలికింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక్క ఔన్స్ పసిడి ధర 3,477.41 డాలర్లకు చేరింది. అమెరికా టారిఫ్‌ల అనిశ్చితి, ఫెడ్ స్వతంత్రతపై ఆందోళనలు, వడ్డీ రేట్ల తగ్గింపు అంచనాలు, భౌగోళిక ఆందోళనలు బంగారు ధరలను పెంచాలని నిపుణులు భావిస్తున్నారు.

## ఔషధాలపై 200 శాతం టారిఫ్‌లు!




విదేశీ ఔషధాలపై 200 శాతం టారిఫ్‌లను విధించే యోచనలో ఉన్నామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. కోవిడ్-19 మహమ్మారి సమయంలో ఎదురైన ఔషధ లోటు సంక్షోభం నేపథ్యంలో దేశీయ ఔషధ ఉత్పత్తిని పెంచాలని భావిస్తున్నామన్నారు. ఇప్పటికే ఆటోమొబైల్స్, స్టీల్ వంటి వస్తువులపై విధించిన టారిఫ్‌లను ఔషధ రంగానికి విస్తరించే పనిలో ఉన్నారని స్పష్టమవుతోంది. చాలా ఔషధాలపై ఎలాంటి సుంకాలు లేకుండా ఇప్పటి వరకు అనుమతిస్తోంది. అయితే ఫార్మాపై సుంకాల పెంపు అమలకు ఏడాది నుంచి ఏడాదిన్నర వరకు మినహాయింపు ఇచ్చే అవకాశం ఉంది. తద్వారా కంపెనీలు స్థానిక తయారీ, ఇతర ఏర్పాట్లపై దృష్టి సారించడానికి వీలుంటుంది. ఔషధాలపై 200 శాతం సుంకాల అమలు 2026 చివరి నుండి ప్రారంభం కావచ్చని అమెరికా వర్గాలు భావిస్తున్నాయి. ఈ టారిఫ్‌లు అమెరికాలో ఔషధ ధరలను భారీగా పెంచనున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత నిల్వలు 6 నుంచి 18 నెలలు సరిపడ ఉన్నాయని అంచనా. అమెరికా ఈ నూతన టారిఫ్ ప్రతిపాదనలు భారత్, చైనా నుంచి వచ్చే ఔషధాలపై ఎక్కువ ప్రభావం చూపనున్నాయి.

# అమెజాన్‌లో ఉద్యోగులకు కొత్త ఫోన్ వినియోగ పాలసీ

ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్, ఖర్చులను తగ్గించుకునే చర్యల్లో భాగంగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై కంపెనీ అందించిన ఫోన్లను ఉద్యోగులు ఎంతమేరకు వ్యక్తిగత అవసరాలకు వాడుతున్నారో లెక్క చెప్పాలని ఆదేశించింది. ఈ కొత్త నిబంధన ఇప్పుడు ఉద్యోగుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది., కంపెనీ ఇచ్చిన ఫోన్లను పనికి ఎంత శాతం, సొంతానికి ఎంత శాతం ఉపయోగిస్తున్నారో ఉద్యోగులు ప్రతినెలా నివేదించాల్సి ఉంటుంది. ఈ నివేదిక ఆధారంగా, ఉద్యోగులకు ఇచ్చే 50 డాలర్ల నెలవారీ రీయింబర్స్‌మెంట్‌లో సర్దుబాట్లు చేయనున్నారు. అంటే, వ్యక్తిగత వాడకం పెరిగితే రీయింబర్స్‌మెంట్ తగ్గుతుందన్న మాట. సీఈఓ ఆండీ జాస్సీ నేతృత్వంలో కంపెనీలో కఠినమైన పని సంస్కృతిని తిరిగి తీసుకువచ్చే ప్రయత్నాల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఫోన్ల వాడకంపై నిఘా ఒక్కటే కాదు, కంపెనీలో అనేక విషయాల్లో మైక్రో మేనేజ్‌మెంట్ పెరిగిందని




'బిజినెస్ ఇన్‌సైడర్' నివేదిక పేర్కొంది. రిటైల్ విభాగంలోని ఉద్యోగులు ఏదైనా వ్యాపార పర్యటనకు వెళ్లాలంటే, దానివల్ల కంపెనీకి వచ్చే లాభాలు, నిర్దిష్ట లక్ష్యాలను ముందుగానే వివరించి అనుమతి తీసుకోవాల్సి వస్తోంది. అలాగే భోజన ఖర్చుల వివరాలను కూడా క్షుణ్ణంగా నమోదు చేయాల్సి వస్తోంది. "ఇదే నా సొంత డబ్బయితే ఎలా ఖర్చుపెట్టేవాడిని" అని ప్రతి ఉద్యోగి ఆలోచించాలని ఆండీ జాస్సీ పదేపదే సూచిస్తున్నారు. అయితే, కంపెనీ తీసుకుంటున్న ఈ కఠిన చర్యలపై ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. కంపెనీ ఫోన్‌ను ఒక సాధారణ ప్రయోజనంగా భావించే తాము, ఇప్పుడు దాని వాడకంపై కూడా ఇంతలా నిఘా పెట్టడాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు. ఈ పరిణామాలు తమ ఉద్యోగ భద్రతపై ఆందోళన కలిగిస్తున్నాయని వారు అంటున్నారు. ఈ విషయంపై అమెజాన్ ప్రతినిధి స్పందిస్తూ, ఇది కంపెనీ ప్రాథమిక సూత్రమైన ఆర్థిక క్రమశిక్షణలో భాగమేనని తెలిపారు. "వేగవంతమైన పనితీరు కనబరిచే సంస్కృతికి తిరిగి వెళ్లే ప్రయత్నమిది" అని ఆయన వివరించారు. ఏదేమైనా, టెక్ దిగ్గజం తీసుకుంటున్న ఈ నిర్ణయాలు ఉద్యోగుల్లో మాత్రం కలవరం రేపుతున్నాయి.

## లగ్జరీ ఈవీలపై జీఎస్టీ పెంచే యోచనలో ప్యానెల్



జీఎస్టీ సంస్కరణలకు సంబంధించి బుధవారం జీఎస్టీ కౌన్సిల్ సమావేశం మొదలు కానుంది. ఈ సమావేశంలో 46,000 డాలర్ల(రూ. 40 లక్షలకు పైన) ఖరీదైన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల(ఈవీ)పై భారీ సుంకాలను పెంచాలని ప్యానెల్ ప్రతిపాదించినట్టు తెలుస్తోంది. ఈ నిర్ణయం వల్ల టెస్లా, మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ, బీవైడీ వంటి కంపెనీలు తీవ్రంగా ప్రభావితం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ పన్ను వ్యవస్థను సంస్కరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అధిక సుంకాల కారణంగా అమెరికాతో సంబంధాలు దెబ్బతింటున్న నేపథ్యంలో ప్రజలు దేశీయ వస్తువులనే ఎక్కువగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోనున్నారు. అందుకోసం షాంపూల నుంచి ఎలక్ట్రానిక్స్ వరకు ప్రతిదీ చౌకగా లభించేలా వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)లో శ్లాబుల సంఖ్యలను రెండుకు తగ్గించారు. ఈ క్రమంలోనే జీఎస్టీ కౌన్సిల్ ప్రధాని మోడీ సూచనలకు అనుగుణంగా అనేక వస్తువులపై జీఎస్టీలో కోతకు అంగీకరించింది. అయితే, దీన్ని భర్తీ చేసేందుకు ఈవీ కార్లపై పన్నులను పెంచాలని సిఫార్సు చేసింది. అందులో భాగంగా రూ. 20-40 లక్షల మధ్య ఉన్న ఈవీలపై ప్రస్తుతం 5 శాతం ఉన్న జీఎస్టీని 18 శాతానికి పెంచాలని సూచించింది. అలాగే, రూ. 40 లక్షల కంటే ఎక్కువ ఖరీదైన ఈవీలపై 28 శాతానికి పెంచాలని ప్రతిపాదించింది. లగ్జరీ కార్లను ఉన్నత వర్గాలే కొనుగోలు చేస్తాయని, కంపెనీలు సైతం వాటిని దేశీయంగా తయారు చేయకుండా ఎక్కువగా దిగుమతి చేసుకుంటాయని వివరించింది. కానీ, ప్రభుత్వం 28 శాతం జీఎస్టీ శ్లాబును పూర్తిగా తొలగించాలని నిర్ణయించడంతో ఈవీలపై పన్నును 18 శాతానికే పరిమితం చేయాల్సి ఉంటుంది. లేదా లగ్జరీ వస్తువుల కోసం సూచించిన 40 శాతం పన్ను పరిధిలోకి చేర్చాల్సి ఉంటుంది. ఈ అంశాలను జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయిస్తారని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

## మరింత చౌకగా భారత్‌కు రష్యా ముడిచమురు




ఓవైపు రష్యాతో చమురు వాణిజ్యాన్ని తగ్గించుకోవాలని భారత్‌పై అమెరికా ఒత్తిడి చేస్తున్నది. అయితే అమెరికా బెదిరింపులు, విమర్శలు కొనసాగుతున్నప్పటికీ, భారతీయ చమురు కంపెనీలకు రష్యా ముడి చమురు మరింత చౌకగా లభిస్తోంది. రష్యా గ్రిడ్ నుంచి చమురు ఆఫర్ పొందిన వ్యక్తులు దీని గురించి వెల్లడిస్తూ.. ఇటీవల బ్రెంట్ చమురు కంటే 3-4 డాలర్లు తక్కువకే లభించినట్టు చెప్పారు. ఇవే ధరలు సెప్టెంబర్ ఆఖరి వారంతో పాటు అక్టోబర్ నెల సరఫరాకు కూడా వర్తిస్తుంది. గతవారం రష్యాకు చెందిన ఉరల్స్ గ్రేడ్ చమురు బ్యారెల్‌కు 2.5 డాలర్ల తక్కువకే వచ్చింది. అంతకుముందు జూలైలోనూ 1 డాలర్ డిస్కౌంట్‌తో చమురు లభించింది. మరోవైపు అమెరికా నుంచి రవాణా అయ్యే చమురు సాధారణ రేట్ల కంటే ఎక్కువగా, బ్రెంట్‌తో పోలిస్తే 3 డాలర్లు ఎక్కువగా ఉందని అనలిస్టులు చెబుతున్నారు. రష్యా ఎగుమతి చేసే చమురులో ఉరల్స్ గ్రేడ్ ముఖ్యమైనది. దీన్ని రాష్య నుంచి ప్రపంచంలోని అనేక దేశాలకు సరఫరా చేస్తారు. గత కొంతకాలంగా సముద్ర మార్గంలో ఈ చమురును భారత్ అత్యధికంగా దిగుమతి చేసుకుంది. కాగా, అమెరికా ఎంత ఒత్తిళ్లకు గురి చేసినప్పటికీ భారత్‌కు రష్యానే అతిపెద్ద చమురు సరఫరా దేశంగా కొనసాగుతోంది. జూలై నెలలో రూ. 31,775 కోట్ల విలువైన చమురును రష్యా నుంచి మనదేశం కొనుగోలు చేసింది. ఇది మనదేశ దిగుమతుల్లో 31.4 శాతం వాటాను దక్కించుకోగా, ఆ తర్వాత ఇరాక్ 17.1 శాతం, అరేబియా 16.1 శాతం, యూఏఈ 11.8 శాతం కలిగి ఉన్నాయి.

# ఎడాపెడా సిక్సర్లు.. పాక్ 10వ నంబర్ ఆటగాడి ప్రపంచ రికార్డు



యూఏఈ ట్రై సిరీస్‌లో భాగంగా ఆఫ్ఘనిస్తాన్‌తో నిన్న (సెప్టెంబర్ 2) జరిగిన మ్యాచ్‌లో పాక్ ఆటగాడు హారీస్ రౌఫ్ పలు రికార్డుల్లో భాగమయ్యాడు. ఈ మ్యాచ్‌లో పాక్ ఆఫ్ఘనిస్తాన్? చేతుల్లో ఓడినా రౌఫ్ పలు ఘనతలు సాధించాడు. స్పెషలిస్ట్ ఫాస్ట్ బౌలర్ అయిన రౌఫ్.. బౌలింగ్‌లో కాకుండా బ్యాటింగ్‌లో రికార్డుల్లో భాగం కావడం విశేషం. ఈ మ్యాచ్‌లో 10వ స్థానంలో (లక్ష్య ఛేదనలో) బ్యాటింగ్‌కు వచ్చిన రౌఫ్.. 16 బంతుల్లో 4 సిక్సర్ల సాయంతో 34 పరుగులతో అజేయంగా నిలిచాడు. రౌఫ్ మెరుపు ఇన్నింగ్స్ పాక్‌ను గెలిపించలేకపోయినా అతన్ని మాత్రం రికార్డుపుటల్లోకెక్కించింది. అంతర్జాతీయ టీ20ల చరిత్రలో 10 లేదా 11వ స్థానంలో వచ్చి అత్యధిక సిక్సర్లుగా (4) బాదిన ఆటగాడిగా రౌఫ్ విండీస్ ఆటగాడు అకీల్ హొసేన్‌తో కలిసి ప్రపంచ రికార్డును షేర్ చేసుకున్నాడు. అలాగే చివరి వికెట్‌కు సూఫియాన్ ముఖీమ్‌తో కలిసి (7 నాటౌట్) రౌఫ్ నెలకొల్పిన అజేయమైన 40 పరుగుల భాగస్వామ్యం పాక్ తరఫున 10వ వికెట్‌కు అత్యధిక భాగస్వామ్యంగా రికార్డైంది. గతంలో ఈ రికార్డు షోయబ్ అక్తర్-వాహబ్ రియాజ్ (31లి) పేరిట ఉండేది. ఈ మ్యాచ్‌లో రౌఫ్ చేసిన స్కోర్ (34 నాటౌట్) పాక్ ఇన్నింగ్స్‌లో టాప్ స్కోర్‌గా నిలిచింది. పాక్ టీ20ల చరిత్రలో 10 లేదా 11వ నంబర్ ఆటగాళ్ళు ఓ ఇన్నింగ్స్‌లో టాప్ స్కోరర్‌గా నిలవడం ఇదే మొదటిసారి. మ్యాచ్ విషయానికొస్తే.. ఆఫ్ఘనిస్తాన్ ఆల్‌రౌండ్ షోతో సత్తా చాటి పాక్‌కు ఊహించని షాకిచ్చింది. ఈ మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్తాన్ పాక్‌ను 18 పరుగుల తేడాతో ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్తాన్.. సెదీఖుల్లా అటల్ (64), ఇబ్రహీం జద్రాన్ (65) అర్ధ సెంచరీలతో రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. పాక్ బౌలర్లలో ఫహీమ్ అష్రాఫ్ (4-0-27-4) అద్భుతంగా బౌలింగ్ చేశాడు. అనంతరం ఆఫ్ఘన్ బౌలర్లు చెలరేగడంతో పాక్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 151 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఫజల్ హక్ ఫారూకీ, కెప్టెన్ రషీద్ ఖాన్, మొహమ్మద్ నబీ, నూర్ అహ్మద్ తలో 2 వికెట్లు తీసి పాక్‌ను దెబ్బకొట్టారు.

# ధృవ్ జురెల్‌ను తప్పించిన సెలెక్టర్లు



వెస్ట్ జోన్‌తో రేపటి నుంచి (సెప్టెంబర్ 4) ప్రారంభం కాబోయే దులీప్ ట్రోఫీ-2025 రెండో సెమీ ఫైనల్‌కు ముందు సెంట్రల్ జోన్ జట్టుకు షాక్ తగిలింది. ఆ జట్టు వికెట్ కీపర్ బ్యాటర్ ధృవ్ జురెల్ డెంగ్యూ కారణంగా టోర్నీ నుంచి తప్పించబడ్డాడు. జురెల్ గత కొన్ని రోజులుగా డెంగ్యూతో బాధపడుతూ కోలుకోలేకపోతున్నాడు. దీంతో సెలెక్టర్లే స్వయంగా రంగంలోని దిగి అతన్ని తప్పించారు. జురెల్‌కు ప్రత్యామ్నాయంగా విదర్భ రంజీ కెప్టెన్ అక్షయ్ వాద్కర్‌ను ప్రకటించారు. వాస్తవానికి ఈ టోర్నీ ప్రారంభానికి ముందు జురెల్‌నే సెంట్రల్ జోన్ కెప్టెన్‌గా ప్రకటించారు. అయితే నార్త్‌ఈస్ట్ జోన్‌తో మ్యాచ్ సమయానికి అతనికి జ్వరం ప్రారంభం కావడంతో ఆ మ్యాచ్ ఆడలేకపోయాడు. జురెల? స్థానంలో రజత్ పాటిదార్ ఆ మ్యాచ్‌లో కెప్టెన్‌గా వ్యవహరించాడు. తాజాగా జురెల్ టోర్నీ మొత్తం నుంచే వైదొలగడంతో పాటిదార్ సెంట్రల్ జోన్ పూర్తి స్థాయి కెప్టెన్‌గా కొనసాగనున్నాడు. నార్త్‌ఈస్ట్ జోన్‌తో జరిగిన మ్యాచ్‌లో సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్ లీడ్ ఆధారంగా సెమీస్‌కు అర్హత సాధించింది. ఆ మ్యాచ్‌లో సెంట్రల్ జోన్ తరఫున దనిశ్ మాలేవార్ (203 రిటైర్డ్ ఔట్), రజత్ పాటిదార్ (125), యశ్ రాథోడ్ (87 నాటౌట్), ఆర్యన్ జుయెల్ (60 రిటైర్డ్ హర్ట్) చెలరేగి ఆడారు. జురెల్‌కు ప్రత్యామ్నాయంగా ప్రకటించిన అక్షయ్ వాద్కర్‌కు వాస్తవానికి సెంట్రల్ జోన్ తొలుత ప్రకటించిన జట్టుకే ఎంపిక చేయాల్సి ఉండింది. అయితే టీమిండియాకు ఆడిన ఆటగాళ్లు అధికంగా అందుబాటులో ఉండటం? చేత అప్పట్లో అతన్ని పరిగణలోకి తీసుకోలేదు. భీకర ఫామ్‌లో ఉండిన వాద్కర్‌ను పట్టించుకోకపోవడంతో అప్పట్లో పెద్ద ఎత్తున చర్చలు జరిగాయి. చాలా మంది వాద్కర్‌ను ఎంపిక చేయకపోవడాన్ని ప్రశ్నించారు. వాద్కర్ తాజాగా ముగిసిన రంజీ ట్రోఫీలో విదర్భను ఛాంపియన్‌గా నిలబెట్టాడు. ఆ సీజన్‌లో అతను 10 మ్యాచ్‌ల్లో 2 సెంచరీలు, 2 హాఫ్ సెంచరీల సాయంతో 722 పరుగులు చేశాడు. అలాగే వికెట్ కీపర్‌గానూ (24 డిస్మిసల్స్) సత్తా చాటాడు.

### తప్పుకున్న కుల్దీప్

సెమీస్‌కు ముందు సెంట్రల్ జోన్‌కు మరో షాక? కూడా తగిలింది. క్వార్టర్ ఫైనల్లో ఆడిన కుల్దీప్ యాదవ్ టీమిండియాకు ఎంపికైన కారణంగా జట్టును నుంచి వైదొలిగాడు. అతని స్థానంలో అప్పటికే స్టాండ్ ప్లేయర్‌గా జట్టులో ఉండిన ఫాస్ట్ బౌలర్ యశ్ ఠాకూర్‌ను ఎంపిక చేశారు.

# స్పోర్ట్స్

## యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ క్వార్టర్స్‌లోకి యుకి భాంబ్రి



**న్యూయార్క్:** భారత టెన్నిస్ ప్లేయర్ యుకి భాంబ్రి తొలిసారి గ్రాండ్ స్లామ్ టోర్నీల్లో క్వార్టర్స్ మ్యాచ్‌లోకి ప్రవేశించాడు. యూఎస్ ఓపెన్ డబుల్స్ మ్యాచ్‌లో యుకి భాంబ్రి, తన భాగస్వామి మైఖేల్ వీనస్‌తో కలిసి మూడవ రౌండ్ మ్యాచ్‌లో గెలుపొందారు. జర్మనీ జోడి, నాలుగవ సీడ్ జంట కెవిన్ క్రావిట్జ్, టిమ్ పుట్జ్‌పై 6-4, 6-4 స్కోరుతో యుకి భాంబ్రి జోడి విజయం సాధించింది. ఈ మ్యాచ్‌ను గంటా 23 నిమిషాల్లో ముగించారు. క్వార్టర్స్‌లో ఇండియన్ ప్లేయర్ జోడి .. క్రొయేషియాకు చెందిన నికోలా మెక్‌టిక్, అమెరికన్ ప్లేయర్ రాజీవ్ రామ్‌తో తలపడనున్నారు. 33 ఏళ్ల యుకీ భాంబ్రి గతంలో గ్రాండ్‌స్లాట్ టోర్నీల్లో ఎప్పుడూ ఫస్ట్ రౌండ్ దాటి వెళ్లలేదు. ఈ యేడాది ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్‌లో అతను మూడవ రౌండ్ వరకు వెళ్లాడు.



# ఇలియానా రీ ఎంట్రీ

గోవా బ్యూటీ ఇలియానా గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దేవదాసు సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన ఈ నటి ఆ తర్వాత రాఖీ, పోకిరి, జల్సా వంటి సూపర్‌హిట్‌లను అందుకోవడమే కాకుండా స్టార్ నటిగా గుర్తింపు తెచ్చుకుంది. ఒకప్పుడు స్టార్ నటిగా రూల్ చేసిన ఈ భామ ప్రస్తుతం సినిమాలు మానేసి ఫ్యామిలీతో సమయం గడుపుతున్న విషయం తెలిసిందే. 2023లో మైఖేల్ డోలన్ అనే వ్యక్తిని వివాహం చేసుకున్న ఇలియానా ఇద్దరు బిడ్డలకు జన్మనిచ్చింది. అయితే గత కొన్ని రోజులుగా ఫ్యామిలీతోనే గడుపుతున్న ఈ భామ.. తాజాగా మళ్లీ సినిమాలు చేయబోతున్నట్లు ప్రకటించింది. ఈ ప్రస్తుతం తాను తన ఇద్దరు కొడుకుల సంరక్షణలో బిజీగా ఉన్నానని, అందుకే సినిమాలకు విరామం తీసుకున్నానని ఇలియానా చెప్పింది. అలాగే అభిమానులు నన్ను ఎంతగా మిస్ అవుతున్నారో నాకు తెలుసు. నటన అంటే నాకెంతో ఇష్టం. తెరపై కనిపించడం, విభిన్నమైన పాత్రలు పోషించడం, సెట్‌లో ఉండే సందడి%%% ఇవన్నీ నాకు చాలా ఇష్టం. నా కెరీర్‌లో ఎంతోమంది గొప్ప వారితో కలిసి పనిచేసే అవకాశం రావడం నా అదృష్టం అని ఇలియానా అన్నారు. అయితే పిల్లల బాధ్యతకు తాను మొదటి ప్రాధాన్యం ఇస్తున్నానని, అందుకే కొద్ది రోజులు ఆగి మళ్లీ వస్తానని ఆమె తెలిపారు. తిరిగి వచ్చే ముందు మానసికంగా, శారీరకంగా సిద్ధం కావడానికి కొంత సమయం పడుతుంది. ఏ పని చేసినా దానికి పూర్తిగా న్యాయం చేయాలనుకుంటాను అని ఆమె ఇలియానా తెలిపారు.




# హారర్ ‘కిష్కింధపురి’.. ట్రైలర్ చూశారా?

బెల్లంకొండ శ్రీనివాస్.. కొన్నాళ్ల క్రితం ‘భైరవం’ సినిమాతో వచ్చాడు. బాక్సాఫీస్ దగ్గర ఆ మూవీ తేలిపోయింది. ఇప్పుడు హారర్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సిద్ధమయ్యాడు. అదే ‘కిష్కింధపురి’. సెప్టెంబరు 12న థియేటర్లలోకి సినిమా రానుంది. ఈ క్రమంలోనే ప్రమోషన్స్ చేస్తున్నారు. ఇప్పుడు ట్రైలర్ రిలీజ్ చేశారు. ఇందులో అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ కాగా కౌశిక్ పెగళ్ల దర్శకుడు. ట్రైలర్ బట్టి చూస్తుంటే విజువల్స్, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ ఆకట్టుకుంటున్నాయి. దెయ్యాలపై ఆత్రుత ఉన్నవాళ్లందరినీ ఓ దెయ్యాల భవంతికి తీసుకెళ్లి, దాని వెనకున్న కథేంటి అని చెప్పి ఆ ప్లేస్ చుట్టూ ఓ వాకింగ్ చేయిస్తారు. ఈ ప్రయాణంలో వీళ్లందరూ ఎలాంటి అనుభవాలు ఎదుర్కొన్నారు? చివరకు ఏమైందనేదే కాన్సెప్ట్‌లా అనిపిస్తుంది. ఫైట్స్ లాంటి కమర్షియల్ అంశాలు ఉన్నప్పటికీ.. హైపర్ ఆది, సుదర్శన్ లాంటి వారిలో కామెడీ కూడా చేయించినట్లు ఉన్నారు. ట్రైలర్ చివర్లో అనుపమని దెయ్యంలా చూపించడం, దెయ్యాన్ని ఎదుర్కొనే శక్తిమంతుడిగా హీరోని చూపించడం కాస్త ఆసక్తికరంగా అనిపిస్తుంది.




# వివాదంలో కళ్యాణి ప్రియదర్శన్ సినిమా..

మలయాళ బ్యూటీ కళ్యాణి ప్రియదర్శన్, నస్లేన్ ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ మూవీ ‘లోకా: చాప్టర్–1 చంద్ర’. డామినిక్ అరుణ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాకు దుల్కర్ సల్మాన్ నిర్మించారు. ఈ మూవీ భారీ అంచనాల మధ్య ఆగస్టు 28న ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంటూ దూసుకుపోతుంది. ఈక్రమంలో.. ‘లోకా’ చిత్రంలోని డైలాగ్స్ వివాదాస్పదమైనట్లు పలు వార్తలు వైరల్ అవుతున్నాయి. క్లైమాక్స్‌లో విలన్ మాట్లాడుతూ..’బెంగళూరుకి చెందిన అమ్మాయిలని పెళ్లి చేసుకోను. ఎందుకంటే వాళ్లు వ్యక్తిత్వం లేనివాళ్లు’ అంటూ ఓ డైలాగ్ చెప్పినట్లుగా వార్తలొస్తున్నాయి. అదే కాకుండా ఈ మూవీలో ‘దగర్’ అనే వాడినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో నెటిజన్లు మూవీ టీమ్‌పై ఫుల్ ఫైర్ అవుతున్నారు. తాజాగా, దుల్కర్ సల్మాన్ ట్విట్టర్ ద్వారా క్షమాపణలు చెప్తూ ఓ నోట్ రిలీజ్ చేశారు. “మా సినిమా ‘లోకా చాప్టర్–1 చంద్ర’లోని ఓ డైలాగ్ కర్ణాటక ప్రజల మనోభావాలను దెబ్బతీసిందని తెలుసుకుని మేము చాలా చింతిస్తున్నాము. ప్రజల మనోభావాలకే మేము మొదటి ప్రాధాన్యత ఇస్తాం. ఈ విషయంలో ఎవరినీ బాధపెట్టే ఉద్దేశం మాకు లేదు. సినిమాలోని వివాదాస్పదనమైన డైలాగ్స్‌కు త్వరలోనే మార్చడం లేదా తొలగించడం చేస్తాము. కన్నడ ప్రజలకు కలిగిన ఇబ్బందికి మేము మనస్ఫూర్తిగా క్షమాపణలు చెబుతున్నాము. దయచేసి మా క్షమాపణలు అంగీకరించాలని వేడుకుంటున్నాం” అని రాసుకొచ్చారు.






# ఓటీటీలోకి కన్నప్ప వచ్చేస్తున్నాడు

మంచు ఫ్యామిలీకి ఎంతో ప్రతిష్టాత్మకమైన చిత్రం.. ‘కన్నప్ప’. ఈ సినిమా తీయడానికి పుష్కర కాలం క్రితమే సన్నాహాలు మొదలుపెట్టాడు మంచు విష్ణు. కొడుకు కలల సినిమాకు మోహన్ బాబు ఇవ్వాల్సిన సహకారం అంతా ఇచ్చారు. మేకింగ్ ఆలస్యమై.. రిలీజ్ వాయిదాల మీద వాయిదాలు పడి.. చివరికి జూన్ నెలాఖర్లో ప్రేక్షకుల ముందుకు వచ్చిందీ సినిమా. రూ.200 కోట్లకు పైగా బడ్జెట్ పెట్టి తీసిన ఈ సినిమా తొలి వీకెండ్లో ప్రేక్షకుల నుంచి మంచి స్పందనే తెచ్చుకుంది కానీ.. తర్వాత నిలబడలేక పోయింది. రిలీజ్ ముంగిట ఈ సినిమా ఓటీటీ, శాటిలైట్ హక్కులను సైతం మంచు విష్ణు అమ్మలేదు. కట్ చేస్తే కన్నప్ప రిలీజ్ తర్వాత మిగతా సినిమాల్లా నెల రోజుల్లో ఓటీటీలోకి రాలేదు.విడుదలైన మూడు నెలల తర్వాత కానీ ఆ చిత్రానికి ఓటీటీ డీల్ ఖరారు కాలేదు. హక్కులను ఎంత మొత్తానికి అమ్మారు అన్నది క్లారిటీ లేదు కానీ.. కన్నప్ప స్ట్రీమింగ్ డేట్ మాత్రం వచ్చేసింది. సెప్టెంబరు 4 నుంచి స్ట్రీమింగ్ జెయింట్ అమేజాన్ ప్రైమ్‌లో ఈ సినిమా డిజిటల్‌గా విడుదల కానుంది. అతిథి పాత్రే అయినప్పటికీ ప్రభాస్ నటించిన సినిమా కావడంతో ఈ సినిమాను థియేటర్లలో మిస్సయిన వాళ్లు ఓటీటీలో చూడాలని ఎదురు చూస్తున్నారు. సినిమాకు యావరేజ్ టాక్ రావడం, క్లైమాక్స్ అద్భుతమని, మంచు విష్ణు కెరీర్ బెస్ట్ పెర్ఫామెన్స్ అని టాక్ వచ్చిన నేపథ్యంలో ఓటీటీలో ఈ సినిమాను ఎంతమంది చూస్తారో వేచి చూడాలి. ఈ రోజుల్లో పెద్ద సినిమాలన్నీ విడుదలకు ముందే డిజిటల్ డీల్స్ ఖరారు చేసుకుంటున్నాయి. కానీ కన్నప్పకు మాత్రం అలా జరగలేదు. అలా అని ఆ సినిమాకు ఆఫర్లు రాలేదని కాదు. విడుదల ముంగిట కొన్ని ఓటీటీ సంస్థలతో అతను సంప్రదింపులు జరిపాడు. ఐతే ఒక ప్రముఖ ఓటీటీ సంస్థ కోట్ చేసిన రేటు నచ్చక.. హిట్టు కొట్టి ఆ తర్వాత డీల్ మాట్లాడతానంటూ ఛాలెంజ్ చేసిన విషయాన్ని విష్ణునే స్వయంగా వెల్లడించాడు. బహుశా అది అమేజాన్ ప్రైమే కావవచ్చేమో. మరి విడుదలకు ముందు వాళ్లెంత కోట్ చేశారో.. ఇప్పుడు ఈ రేటుకు విష్ణు సినిమాను అమ్మాడో?

# అమ్మడు క్రేజ్‌కు ఫ్యాన్స్ ఫిదా

‘లోఫర్’ సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన బాలీవుడ్ బ్యూటీ దిశా పటాని.. తెలుగులో అంతగా గుర్తింపు తెచ్చుకోనప్పటికీ బాలీవుడ్‌లో మాత్రం బ్యాక్ టు బ్యాక్ చిత్రాలు అనౌన్స్ చేస్తుంది. ఇక గతేడాది వచ్చిన ‘కల్కి’ చిత్రంతో పాన్ ఇండియా రేంజ్‌లో గుర్తింపు తెచ్చుకుని ఇప్పుడు మరోసారి ప్రభాస్‌తో జత కట్టేందుకు సిద్ధం అయింది. ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న ‘స్పిరిట్’ చిత్రంలో దిశా పటానీ హీరోయిన్‌గా ఫిక్స్ అయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ సినిమాతో బిజీగా ఉంటూనే మరో మూవీలో జాయిన్ అయ్యింది ఈ బ్యూటీ. దిశా పటానీ బాలీవుడ్‌లో విశాల్ భరద్వాజ్ దర్శకత్వంలో ఓ మూవీ చేయబోతుంది. గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో షాహిద్ కపూర్ హీరో కాగా.. త్రిప్తి డిమ్రి, నానా పటేకర్, రణదీప్ హుడా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఇక ఈ మూవీలో దిశా పటానీ అతిథి పాత్రకు ఎంపిక అయింది. అంతే కాకుండా.. రీసెంట్‌గా షూటింగ్‌లో కూడా జాయిన్ అయినట్లు తెలుస్తుంది. ప్రజెంట్ ఇందుకు సంబంధించిన న్యూస్ నెట్టింట వైరల్ అవుతుండగా.. బాలీవుడ్‌లో దిశాకు ఉన్న క్రేజ్ చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు ఫ్యాన్స్.



VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com